తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM, SRIKAKULAM

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha

24-8-2023 గురువారం సంపుటి : 29 సంచిక : 205 పేజీలు : 10+4 వెల : 6.50



**ఇది అత్యంత అరుదైన విజయం**

**రాష్ట్రపతి ముర్ము** 7లో

అంతరిక్ష పరిశోధనల్లో భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. చంద్రుని దక్షిణ ధృవంపై తొలిసారి అడుగుపెట్టిన దేశంగా ప్రపంచంలో శిఖరాగ్రాన నిలిచింది. విక్రమ్ లాండర్ జాబిల్లిపై నెమ్మదిగా దిగడం తిలకించిన భారతీయులందరి హృదయాలు పులకించాయి. చంద్రయాన్- 3 సక్సెస్‌తో ఇస్రో కీర్తి ప్రతిష్టలు మరోసారి నలుదెసలా ప్రసరించాయి.

**జాబిల్లిపై భారత్ జెండా**

# అందిన చందమామ

## చంద్రయాన్-3 సక్సెస్



'చంద్రయాన్-3' మరికొన్ని కథనాలు 5లో

**శ్రీహరికోట, ఆగస్టు 23, ప్రభాతవార్త:** అంతరిక్ష పరిశోధనలో భారత శాస్త్రవేత్తలు ప్రపంచ రికార్డు సాధించారు. అగ్రరాజ్యాలకు సాధ్యంకాని చంద్రగ్రహం దక్షిణ ధ్రువంపై మన ఉపగ్రహం చంద్రయాన్-3ని క్షేమంగా దించారు. బుధవారం సాయంత్రం భారతదేశం మరచిపోలేని రోజు. సరిగ్గా 6.04 గంటలకు ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగా ప్రకటించిన సమయానికే చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువంపై అత్యంత నిదానంగా, క్షేమంగా సాఫ్ట్ ల్యాండ్ అయ్యింది. ఆ ప్రాంతంలోని రెండు బిలాల మధ్య విక్రమ్ ల్యాండర్ దిగడంతో దేశంలోని 140 కోట్ల మంది హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ బ్రిక్స్ దేశాల సదస్సు కోసం దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్‌బర్గ్‌కు వెళ్లిన కారణంగా ఆయన అక్కడి నుంచే వర్చువల్ విధానం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలతో కలిసి చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ కార్యక్రమాన్ని వీక్షించారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న మిషన్ ఆపరేషన్ కాంప్లెక్స్‌లో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌తో సహా దేశంలోని ఇతర అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తలు, ప్రముఖులు చంద్రయాన్ విజయాన్ని అక్కడి కంప్యూటర్ తెరలపై వీక్షించి కేరింతలు కొట్టారు. చంద్రయాన్-3 ప్రయాణం ఆద్యంతం ఉద్విఘ్నం ఉత్కంఠ మధ్య నడిచింది. అనంతరం ≫2



చంద్రయాన్-3 సక్సెస్‌తో కరీంనగర్‌లో విజయానందంతో విద్యార్థులు

### అంతరిక్షంలో భారత్ అఖండ విజయం

చంద్రుని దక్షిణ ధృవంపైకి అడుగిడిన తొలిదేశం

అమెరికా, రష్యా, చైనా తర్వాత అంతరిక్ష వేదికపైకి భారత్

జులై 14న శ్రీహరికోట నుంచి చంద్రయాన్-3 ప్రయోగం

41వ రోజున జాబిల్లిని ముద్దాడిన ఉపగ్రహం



చంద్రయాన్-3 సక్సెస్ సందర్భంగా జోహాన్స్‌బర్గ్‌లో బుధవారం ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

## నా జన్మ ధన్యమైంది..

### ఈ అద్భుత విజయం 140 కోట్ల భారతీయులదే: ప్రధాని మోడీ

**జోహాన్స్‌బర్గ్,ఆగస్టు 23:** అంతరిక్ష చరిత్రలో ఇస్రో సరికొత్త చరిత్ర సృష్టించిందని, చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో తన జన్మధన్యం అయిందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో ఉన్న ప్రధాని చంద్రయాన్ విజయవంతంపై ప్రధాని స్పందించి ఇస్రోశాస్త్రవేత్తల కృషిని ప్రశంసించారు. చంద్రాయన్ ప్రయోగాన్ని ఆయన దక్షిణాఫ్రికానుంచి వర్చువల్‌గా వీక్షించారు. ఈప్రయోగం సక్సెస్ అయిన వెంటనే ఆయన చప్పట్లు చరుస్తూ అభినందించారు. ≫2





జోహాన్స్‌బర్గ్‌లో బుధవారం బ్రిక్స్ దేశాధినేతలతో ప్రధాని మోడీ

## బ్రిక్స్ విస్తరణకు మద్దతు

### 15వ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ

**జోహాన్స్‌బర్గ్, ఆగస్టు 23:** బ్రిక్స్ కూటమిని ఏకాభిప్రాయంతోనే మరింత విస్తృతంచేయాలని అందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధాన ఇనరేంద్రమోడీ అన్నారు. భాగస్వామ్య దేశాలపరస్పర సహకారంతోముందుకువెళ్లడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. దక్షిణాఫ్రికా రాజధాని జోహాన్స్‌బర్గ్‌లో జరిగిన 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రసంగించినమోడీ ఆఫ్రికన్ యూనియన్‌కు జి20లో శాశ్వత సభ్యత్వాన్ని తాము ప్రతిపాదిస్తున్నాట్లు తెలిపారు. బ్రిక్స్ భాగస్వామ్య పక్షాలుకూడా ఇందుకు మద్దతు పలుకుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తుకు బ్రిక్స్ సంసిద్ధంగా ఉండాలంటే మనం మన సమాజాలను భవిష్యత్తుకు సిద్ధంచేసుకోవాలని మోడీ పిలుపునిచ్చారు. భారత్ ≫2



బుధవారం గాంధీభవన్‌లో చంద్రశేఖర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్

## చంద్రశేఖర్‌కు కాంగ్రెస్ తీర్థం

### రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం

### ఆరోగ్యశ్రీతో 5 లక్షల వైద్య ఖర్చులు: పిసిసి చీఫ్ రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బిజెపికి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులలో కలిసి పోటీ చేస్తామని మునుగోడు ఎన్నికల సందర్భంగా ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మోడిని కలిసి అమిత్‌షాతో చీకటి ఒప్పందం చేసుకొని ఇపుడు కమ్యూనిస్టులకు పంగనామాలు పెట్టారని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో బుధవారం మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, బిఆర్ఎస్ జహీరాబాద్ నాయకులు హుగ్గెల్లి రాములు, పలువురు కార్యకర్తలు టిపిసిసి ≫2

# రైతు సంక్షేమమే లక్ష్యం

### 'ధరణి'లో రైతులు హక్కుదారులయ్యారు

### విద్యుత్ వినియోగంలో నం.1

### ఐడిబిసిలు అభివృద్ధికి తార్కాణం

### ఎన్నికలొస్తే అడుక్కునేవాళ్లొస్తారు జాగ్రత్త..

### ప్రగతి శంఖారావ సభలో సిఎం కెసిఆర్



ప్రగతి శంఖారావ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు23 ప్రభాతవార్త:** రైతు సంక్షేమానికి కృషి చేస్తూ నేడు దేశానికే తలమానికంగా తెలంగాణ రాష్ట్రం మారిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనం, ఎస్పీ భవనం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన సీఎస్ శాంతి కుమారి, మంత్రులతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ రాజర్షిషాకు, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిణి ప్రియదర్శినిలకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు చేయూత ఫించన్ కింద రూ.4 వేలు అందించే పథకంతో పాటు బీడీ కార్మికుల్లో భాగమైన టేకాదారు, ప్యాకేజెర్లకు ఫించన్ ఫథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ భవనంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించిన ప్రగతి శంఖారావ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. రైతుకు పెట్టుబడి సాయం అందించడమే కాకుండా ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా రైతు ప్రమాదవశాత్తు లేదా సాధారణ మరణం పొందితే వారి కుటుంబం రోడ్డు పాలు కాకుండా తక్షణమే 5 లక్షల రూపాయల ప్రమాద భీమాను అందిస్తున్న ఏకైక రాష్ట్రం అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌ను కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిలిపి వేస్తామంటున్నారన్నారు. ధరణితో రైతుల బొటనవేలే హక్కు దారుగా మారిందని, గతంలో రైతు పేరు వీఆర్‌వో మొదలుకొని రెవెన్యూ మినిస్టర్ వరకు ఎవరైనా మార్చే వీలుండేదని, అలా కాకుండా రైతుకే ఇచ్చిన హక్కు ధరణి అని, అలాంటి ధరణి మీకుకావాలా,వద్దా అంటూ ప్రశ్నించారు. పెట్టుబడి సాయం అందిస్తూ సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్ ప్రాజెక్టును, చెక్‌డ్యాంలను నిర్మిస్తూ రైతులకు తెలంగాణ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. గతంలో ఎప్పుడు లేనంత పంట పండిస్తూ పంజాబ్ రాష్ట్రానికే తెలంగాణ పోటీగా వచ్చిందన్నారు. ధాన్యం ఎక్కడ పెట్టాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని, దానిని అధిగమించేందుకు సివిల్ సప్లై ద్వారా జపాన్ టెక్నాలజీతో ప్రభుత్వమే రైస్‌మిల్లులను ఏర్పాటు చేసే ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలోని అన్ని రాష్ట్రాల రైతులు కోరుకుంటున్నారన్నారు. మహారాష్ట్ర రైతులు తెలంగాణ విధంగా వీఆర్‌వో వ్యవస్థను తొలగించి రైతు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతున్నారని, రాష్ట్రంలోకి బీఆర్ఎస్ పార్టీని వారు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వస్తే చీకటి రాజ్యం వస్తుందన్న పరిస్థితిని నుంచి నేడు విద్యుత్ ≫2

### నేడు కేబినెట్‌లోకి మహేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 23:** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి కేబినెట్‌లో అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈటల రాజేందర్‌ను తప్పించిన తర్వాత కొత్తగా ఎవరికీ మంత్రి పదవి ఇవ్వలేదు. ఖాళీగా ఉన్న ఆ స్థానంలోకి మహేందర్‌రెడ్డికి అవకాశం లభించింది. ఎమ్మెల్సీగా ఉన్న మహేందర్‌రెడ్డి తాండూరు నుంచి పోటీ చేయాలనుకోవడం,సిట్టింగ్ ఎమ్మెల్యేకే ఇస్తామంటే ప్రత్యామ్నాయం చూసుకొంటామని పార్టీ దృష్టికి తెచ్చినట్లు కొన్నాళ్ల క్రితం ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకులు జోక్యం చేసుకుని ఆయనతో చర్చించాక..తాండూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విజయానికి ≫2

బిఆర్ఎస్‌కు వీరేశం, సంతోష్‌కుమార్ రాజీనామా,

అసంతృప్తులకు బుజ్జగింపులు, తుమ్మలతో నామా భేటీ

పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసేందుకు నిరాకరించిన రాజయ్య

## పెల్లుబుకుతున్న తిరుగుబాట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** రాబోయే ఎన్నికలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అభ్యర్థుల ప్రకటనతో టికెట్ ఆశించి భంగపడ్డ ముఖ్యనేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు నేతలు పార్టీ అధిష్టానంపై తిరుగుబాటును ప్రదర్శిస్తున్నారు. ఆత్మీయుల సమావేశాలు నిర్వహించి ఏకంగా రాజీనామాలు చేస్తున్నారు. తలోదారి చూసుకుంటున్నారు. ఇదే సమయంలో ఈ నేతలను బుజ్జగించే పనిలో అధిష్ఠానం నిమగ్నమైంది. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాలేరు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడటంతో ఆయన అనుచరగణం అసమ్మతికి తెరలేపింది. తుమ్మల బిఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలో చేరుతారేమోనని ఊహించిన బిఆర్ఎస్ బుజ్జగింపు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఎంపీ నామా నాగేశ్వరరావు తుమ్మలతో భేటీ అయ్యారు. గంటకు పైగా ఇద్దరు చర్చించినట్లు సమాచారం. 2018 ఎన్నికల్లో పాలేరు బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కందాల ఉపేందర్‌రెడ్డి చేతిలోన పరాజయం మూటగట్టుకున్నారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి బిఆర్ఎస్‌లో చేరారు. అయితే వచ్చే ఎన్నికల్ల పాలేరు నుంచి తనకే టికెట్ ఇస్తారన్న గట్టి నమ్మకంతో తుమ్మల ఉన్నారు. కానీ అనూహ్యంగా మళ్లీ కందాలకే టికెట్ కేటాయించడంతో తుమ్మల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పాలేరు నుంచి బరిలో తుమ్మల ఉండాల్సిందేనని లేని పక్షంలో బిఆర్ఎస్‌కు దూరమై ≫7

# అందిన చందమామా

≫ ఉత్సాహం వెల్లువెత్తింది.

**41 రోజుల సుదీర్ఘ ప్రయాణం**

చంద్రయాన్-3 బుధవారం సాయంత్రం చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ కావడానికి ముందు 41 రోజుల సుదీర్ఘ ప్రయాణం చేసింది. మొత్తం భూమి నుంచి చంద్రుని చేరుకోవడానికి సుమారు మూడు లక్షల 84 వేల కిలోమీటర్ల దూరం చంద్రయాన్-3 ప్రయాణించాల్సి వచ్చింది. గత నెల 14న మన తెలుగు నేల శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3 ఎం4 బాహుబలి రాకెట్ ద్వారా ప్రొపల్షన్ మాడ్యూల్, విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన 3900 కిలోల బరువు ఉన్న చంద్రయాన్-3ని ప్రయోగించారు. అనంతరం అంతరిక్షంలోని భూకక్ష్యలో ఐదుమార్లు రైజింగ్ ఆపరేషన్ల ద్వారా కక్ష్య పెంపు కార్యక్రమం పూర్తి చేశారు. ఆగస్టు 5న ఈ ఉపగ్రహం చంద్రకక్ష్యలో ప్రవేశించింది. ఆ తర్వాత మరో ఐదుమార్లు చంద్ర కక్ష్యలో దూరాన్ని తగ్గించుకుంటూ మరో ఐదు సార్లు భూకేంద్రాల నుంచి ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్లు విజయవంతంగా చేపట్టారు. ఈ నెల 17న కీలకమైన ప్రక్రియలో భాగంగా చంద్రయాన్-3 నుంచి ప్రొపల్షన్ మాడ్యూల్, విక్రమ్ ల్యాండర్‌లు వేరుపడ్డాయి. అంతకుముందే 2019లో ప్రయోగించి అంతరిక్షంలో చంద్రుని చుట్టూ ఇంకా పరిభ్రమిస్తున్న ఆర్బిటర్ చంద్రయాన్-3 నుంచి విడిపోయిన విక్రమ్ ల్యాండర్‌కు స్వాగతం పలికింది. ప్రొపల్షన్ మాడ్యూల్ ఒకవైపు పరిభ్రమిస్తుండగానే విక్రమ్ ల్యాండర్ తనలోని రోవర్‌తో సహా క్రమేణా కక్ష్యను తగ్గించుకుంటూ చంద్రునికి 25 కిలోమీటర్ల తక్కువదూరం, 134 కిలోమీటర్ల ఎక్కువ దూరంలో బుధవారం దాకా పరిభ్రమిస్తూనే ఉంది.

**5.44 నుంచి అత్యంత క్లిష్టమైన దశ**

బుధవారం సాయంత్రం 5.44 గంటల నుంచి చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ అత్యంత క్లిష్టంగా కొనసాగింది. శాస్త్రవేత్తలు కనీసం 20 నిమిషాల పాటు ఉద్విఘ్న క్షణాలు అనుభవించారు. అప్పటి దాకా గంటకు ఆరువేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న విక్రమ్ ల్యాండర్ దశలవారీగా వేగాన్ని తగ్గించుకుంటూ దూరాన్ని తగ్గించుకుంటూ చంద్రుని వైపు మళ్లింది. ఎప్పటికప్పుడు ఈ వేగ నియంత్రణ శాస్త్రవేత్తలు అత్యంత కీలకంగా భావించారు. ఏ ఒక్క దశ అటుఇటు అయినా గతంలో జరిగిన హార్డ్ ల్యాండింగ్ వైపు మళ్లుతుందేమోనని భయపడ్డారు. అయితే ఇదేమీ లేకుండా ముందుగా శాస్త్రవేత్తలు రచించినట్లే విక్రమ్ ల్యాండర్‌లోని అత్యంత ఆధునిక పరికరాలు చంద్రుని దక్షిణ ధ్రువంపై విశ్వసనీయంగా మళ్లించాయి. దక్షిణ ధ్రువంలోని లోయలు, గుట్టలు లేని ప్రాంతాన్ని ల్యాండర్‌లోని కెమెరాలు పసిగట్టి భూకేంద్రాలకు పంపించాయి. ఇక్కడి సిగ్నల్స్ తర్వాత చంద్రునిపై వాలాల్సిన ఖచ్చితమైన స్థలాన్ని ఎంపిక చేసుకొని అత్యంత నిదానంగా భద్రంగా అక్కడ దిగడంతో ఈ ప్రయోగం వందశాతం విజయవంతమైంది. 20 నిమిషాల ముందు గంటకు ఆరువేల కిలోమీటర్ల వేగంతో ఉన్న ల్యాండర్, సాఫ్ట్ ల్యాండింగ్ జరిగేటప్పుడు సెకనుకు 0.5 కిలోమీటర్ల వేగంతో మాత్రమే పయనించడం విశేషం. చివరి దశలో చంద్రుని దక్షిణ ధ్రువానికి 150 మీటర్ల ప్రదేశానికి వచ్చినప్పుడు శాస్త్రవేత్తలు ఆ క్షణాలను ఊపిరి బిగబట్టి వీక్షించారు. 6 గంటల 2 నిమిషాలకు తనలోని రెండు ఇంజన్లను మండించుకొని వేగం నియంత్రించుకొని విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్‌గా దిగింది. అప్పటి హారిజంటల్ వేగం సెకనుకు 0.5 మీటర్లు కాగా, సాఫ్ట్ ల్యాండింగ్ సక్సెస్ అవగానే ఎంతోదూరం నుంచి తిలకిస్తున్న ప్రధాని మోడీ తన చేతిలోని జాతీయ జెండాను ఊపి ఘన విజయాన్ని ప్రకటించారు.

**ఎన్నో పరిశోధనలకు ఊతం**

చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారత దేశానికి ప్రత్యేకించి ఇస్రోకి భవిష్యత్‌లో ఎన్నో పరిశోధనలు చేసే అవకాశంతో పాటు కమర్షియల్ ఆదాయం కూడా దక్కనుంది. చంద్రునిపై 1959 నుంచి అమెరికా, రష్యా వంటి దేశాలు తమ ఉపగ్రహాలను పంపించి పరిశోధనలు చేస్తూనే ఉన్నాయి. భారత్ కూడా ఇప్పటికి రెండుసార్లు చంద్రయాన్‌లు ప్రయోగించింది. ముచ్చటగా మూడోసారి నూటికి నూరుశాతం విజయం సాధించింది. ప్రస్తుతం ల్యాండర్‌లోని రోవర్ చంద్రుని ఉపరితలంపై దిగి 14 రోజుల పాటు పరిశోధనలు చేస్తుంది. ఈ పరిశోధనల్లో 26 కిలోల ప్రజ్ఞాన్ రోవర్‌తో పాటు విక్రమ్ ల్యాండర్ కూడా పాలుపంచుకోనుంది. చంద్రునిపై ఇప్పటికే నీటి జాడలు ఉన్నట్లు చంద్రయాన్-1 ద్వారానే ఇస్రో ప్రపంచానికి చాటి చెప్పింది. చంద్రయాన్-2 ద్వారా ఆర్బిటర్ పనిచేస్తుండటంతో చంద్రుని దక్షిణ ధ్రువం ఇలా ఉంటుందన్న ఫొటోలను ఎప్పటికప్పుడు భూకేంద్రాలకు పంపించి ప్రపంచ అంతరిక్ష పరిశోధనల్లో భారత్ పాలుపంచుకుంది. ప్రస్తుతం చంద్రయాన్-3 పరిశోధనల ద్వారా చంద్రుని ఉపరితలంపై రసాయనాల అన్వేషణ చేపట్టే అవకాశం ఉంది. ప్రత్యేకించి హీలియం-3 ఆ ప్రాంతంలో ఎంత ఉందో కనుగొని శాస్త్రవేత్తలకు సమాచారం అందించనుంది. దీనితో పాటు చంద్రుని నిర్మాణం, పరిమాణం, వాతావరణం, పుట్టుక వంటి వాటిని కూడా అధ్యయనం చేయనుంది. ఇంతటితో సరిపెట్టుకోకుండా తక్కువ ఖర్చుతో భారత్ గ్రహాల పరిశోధనలకు శ్రీకారంచుట్టడంతో మరెన్నో దేశాలు మన సాంకేతిక పరిజ్ఞానంపై విశ్వాసం పెంచుకొని ఉపగ్రహాలను ఇక్కడి నుంచి ప్రయోగించడానికి ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 381 విదేశీ ఉపగ్రహాలను 34 దేశాలు మన అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించి ఉన్నారు. వాటి వల్ల భారత్‌కు వాణిజ్య లాభాలు వచ్చాయి. ఇదిలావుంటే చంద్రయాన్-3 ప్రయోగానికి భారత ప్రభుత్వం రూ.615 కోట్లు కేటాయించింది.



బెంగళూరులోని ఇస్రోలో శాస్త్రవేత్తల ఆనందోత్సాహాలు

SINGAM KUIL RED WEDNESDAY
DrawDate on:23/08/23

| DAY - SINGAM SERIES Dr No:201 | DAY - KUIL SERIES Dr No:201 |
|---|---|
| 1st Prize Rs.100000/- 361492 | 1st Prize Rs.100000/- 835427 |
| 2nd Prize Rs.7000/- 87583 | 2nd Prize Rs.7000/- 51396 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 08838 18564 20104 35323 40105 | 03752 12796 29339 35926 42153 |
| 50892 61061 67794 67924 84929 | 59446 64773 82876 83503 95001 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 1645 2043 2277 3828 4517 6353 6752 | 0239 0569 1103 1460 1520 2235 4124 |
| 8423 9505 9852 | 4519 4909 8081 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0376 2044 2757 3729 3874 6143 7717 | 0251 2058 2387 2792 3404 4486 5648 |
| 8354 9000 9621 | 6318 6352 8051 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0118 1718 3248 5235 6778 7974 8983 | 0194 1865 3451 4756 6223 7847 8571 |
| 0161 1755 3281 5249 6854 8036 9017 | 0457 2162 3654 4827 6255 7898 8687 |
| 0297 1765 3285 5256 6872 8137 9030 | 0874 2248 3692 4900 6629 7927 8899 |
| 0317 1805 3333 5326 6876 8190 9044 | 1049 2314 3733 4919 6692 8141 8991 |
| 0321 1816 3638 5630 6962 8260 9166 | 1066 2338 3737 5102 6730 8168 9035 |
| 0520 2119 4068 5806 6972 8312 9200 | 1106 2510 3943 5187 6782 8189 9127 |
| 0694 2168 4196 5858 6981 8428 9218 | 1184 2517 3997 5380 6877 8316 9135 |
| 0865 2172 4271 5955 7159 8637 9296 | 1300 2621 4089 5535 6908 8339 9458 |
| 0991 2187 4275 6049 7286 8685 9510 | 1313 2636 4290 5827 7368 8369 9601 |
| 1094 2449 4370 6058 7354 8756 9718 | 1490 2787 4354 5864 7508 8405 9976 |
| 1305 2554 4542 6099 7679 8825 | 1646 2814 4398 5886 7517 8446 |
| 1320 2646 4576 6182 7699 8911 | 1744 2922 4538 5894 7519 8457 |
| 1343 2951 4654 6309 7819 8923 | 1775 2937 4654 6103 7667 8495 |
| 1547 3052 4704 6369 7896 8939 | 1796 3200 4655 6166 7755 8556 |
| 1652 3226 4776 6595 7949 8949 | 1845 3338 4672 6183 7809 8565 |

ROSA DEAR PEARL WEDNESDAY
DrawDate on:23/08/23

| DAY - ROSA SERIES Dr No:201 | DAY - DEAR SERIES Dr No:201 |
|---|---|
| 1st Prize Rs.100000/- 147799 | 1st Prize Rs.100000/- 229923 |
| 2nd Prize Rs.7000/- 00987 | 2nd Prize Rs.7000/- 16330 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 01857 40102 43642 59296 60996 | 11357 19606 37058 53109 53410 |
| 61481 79484 80174 86051 91303 | 55138 60300 67723 74570 79427 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0886 2686 5229 5427 5773 6830 7819 | 1151 1461 1543 1596 2683 2899 5929 |
| 8588 9329 9780 | 7244 8895 9023 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 2297 3033 3596 4299 4957 5276 5580 | 0007 1193 1241 2957 4587 4884 5167 |
| 6482 6659 7095 | 7143 7508 8300 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0044 1493 3000 4464 5557 7518 9179 | 0024 1141 3065 4172 6179 7488 8860 |
| 0056 1494 3010 4489 5588 7539 9418 | 0068 1181 3077 4243 6245 7507 9000 |
| 0096 1597 3086 4637 5813 7691 9459 | 0295 1456 3222 4273 6251 7523 9147 |
| 0213 1821 3124 4733 5963 7719 9497 | 0315 1462 3312 5012 6356 7717 9156 |
| 0412 1951 3432 4846 6318 7798 9690 | 0316 1487 3323 5200 6377 7727 9174 |
| 0453 2066 3663 5054 6476 7866 9785 | 0348 1582 3401 5221 6592 7771 9231 |
| 0464 2287 3728 5200 6652 7877 9826 | 0425 1770 3499 5293 6668 7999 9385 |
| 0469 2294 3795 5233 6874 7879 9907 | 0522 1827 3589 5309 6877 8041 9565 |
| 0787 2329 3963 5252 6886 8458 9938 | 0555 1931 3624 5375 6907 8147 9666 |
| 1202 2575 4006 5315 6905 8565 9999 | 0676 2191 3652 5470 6996 8250 9677 |
| 1243 2596 4245 5329 6960 8570 | 0695 2289 3736 5501 7025 8416 |
| 1337 2681 4417 5346 6970 8573 | 0818 2352 3760 5618 7163 8454 |
| 1377 2718 4429 5369 7172 8766 | 0850 2357 3902 5773 7313 8525 |
| 1386 2767 4438 5449 7178 9012 | 0953 2634 4026 6031 7373 8815 |
| 1469 2919 4451 5539 7238 9146 | 1019 3001 4090 6172 7424 8839 |

THANGAM VAIRAM FORTUNE WEDNESDAY
DrawDate on:23/08/23

| DAY - THANGAM SERIES Dr No:201 | DAY - VAIRAM SERIES Dr No:60 |
|---|---|
| 1st Prize Rs.100000/- 945245 | 1st Prize Rs.50000/- 672471 |
| 2nd Prize Rs.7000/- 06102 | 2nd Prize Rs.7000/- 62480 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 02198 14665 30084 40272 55542 | 10729 10749 21542 25091 34390 |
| 67178 68376 84398 88459 88765 | 37115 37685 50305 51685 82424 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0152 1536 3680 4593 4992 5535 6622 | 1121 1261 1290 3144 4087 5205 6825 |
| 7775 8191 9037 | 7803 9067 9160 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 1479 1491 2645 4032 4603 4707 5049 | 0051 1676 2807 3173 3901 5116 5127 |
| 5229 7657 7874 | 6092 8680 8836 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0040 1590 2940 4414 5691 7177 9032 | 0311 1217 2325 4082 5956 7568 8718 |
| 0127 1676 2983 4497 5722 7286 9046 | 0350 1229 2363 4124 6449 7706 8841 |
| 0225 1719 3018 4537 5828 7333 9310 | 0396 1417 2478 4128 6486 7784 9002 |
| 0350 1776 3100 4872 5850 7381 9386 | 0579 1677 2759 4413 6516 7853 9089 |
| 0614 1924 3158 4889 5922 7623 9498 | 0638 1699 2883 4460 6561 7940 9190 |
| 0677 1968 3303 4908 5964 7646 9580 | 0639 1748 3198 4505 6766 8225 9385 |
| 0707 1998 3317 4959 6590 7758 9659 | 0721 1824 3209 4539 6892 8232 9840 |
| 0817 2064 3400 5001 6612 7776 9882 | 0800 1867 3532 4620 6945 8434 9850 |
| 0867 2088 3475 5137 6675 8207 9961 | 0825 1877 3578 4638 7027 8465 9950 |
| 1048 2116 3760 5207 6765 8363 9981 | 0946 2081 3869 5189 7043 8508 9983 |
| 1130 2212 3849 5255 6784 8435 | 0952 2141 3879 5321 7170 8514 |
| 1238 2252 4008 5390 6884 8513 | 1048 2172 3894 5372 7219 8524 |
| 1242 2514 4242 5428 6903 8597 | 1146 2223 3907 5425 7233 8537 |
| 1294 2677 4254 5456 6995 8682 | 1158 2264 4024 5524 7402 8667 |
| 1448 2724 4338 5618 7011 8830 | 1195 2292 4076 5661 7415 8690 |

NALLANERAM MANI FORTUNE WEDNESDAY
DrawDate on:23/08/23

| DAY - NALLANERAM SERIES Dr No:201 | DAY - MANI SERIES Dr No:60 |
|---|---|
| 1st Prize Rs.50000/- 198942 | 1st Prize Rs.50000/- 315526 |
| 2nd Prize Rs.7000/- 70711 | 2nd Prize Rs.7000/- 25315 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 11657 13941 52048 54263 58744 | 06905 17976 20007 20040 29138 |
| 74664 77913 86294 89380 99359 | 55802 62494 79466 92985 98839 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0216 1346 2695 3631 4763 5055 5749 | 1363 2092 3882 4063 4423 5234 6316 |
| 6038 8029 9028 | 6414 7175 7626 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0301 2053 2532 3655 5118 6418 6624 | 2012 3187 3955 4197 5010 7389 7469 |
| 7267 7795 9173 | 7805 7886 9717 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0033 1028 2813 4541 5971 7545 9125 | 0121 1931 3032 4864 6157 7494 9228 |
| 0055 1130 2957 4582 6012 7600 9216 | 0249 1934 3041 4887 6167 7719 9357 |
| 0080 1227 2974 4604 6142 7624 9503 | 0394 1949 3369 4924 6383 7732 9463 |
| 0125 1276 2980 4650 6207 7983 9533 | 0616 1956 3690 4951 6390 8111 9548 |
| 0411 1283 3040 4725 6580 7996 9626 | 0659 2043 3915 5410 6393 8246 9622 |
| 0465 1436 3313 4812 6613 8010 9641 | 0764 2088 3950 5440 6408 8351 9632 |
| 0566 1582 3353 4876 6701 8026 9682 | 0915 2162 4068 5441 6416 8416 9775 |
| 0687 1606 3442 4916 6729 8200 9709 | 0916 2436 4303 5739 6604 8509 9841 |
| 0739 2059 3538 4935 6746 8206 9795 | 0937 2531 4339 5826 6609 8564 9896 |
| 0841 2252 3624 4969 6924 8214 9800 | 1045 2554 4346 5833 6636 8606 9979 |
| 0868 2289 3659 5284 6930 8354 | 1204 2609 4402 5981 6729 8635 |
| 0895 2373 3709 5389 6957 8371 | 1554 2630 4535 6020 6768 8647 |
| 0929 2417 3872 5410 6996 8506 | 1656 2667 4649 6067 6950 8865 |
| 0971 2570 4447 5615 7198 8543 | 1680 2907 4734 6082 7118 8913 |
| 0990 2767 4487 5922 7400 9040 | 1708 2914 4850 6121 7254 8940 |

KUMARAN VISHNU STAR WEDNESDAY
DrawDate on:23/08/23

| DAY - KUMARAN SERIES Dr No:201 | DAY - VISHNU SERIES Dr No:201 |
|---|---|
| 1st Prize Rs.50000/- 155907 | 1st Prize Rs.50000/- 353240 |
| 2nd Prize Rs.7000/- 48844 | 2nd Prize Rs.7000/- 42342 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 13436 14614 27646 34965 51535 | 01746 15012 30240 30718 47589 |
| 56146 63444 96467 97034 99505 | 60426 66586 67473 70171 83858 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 3167 3288 3946 3964 4770 6641 6896 | 0708 1758 2946 4129 4322 4887 5110 |
| 7806 7993 9972 | 6902 7908 8769 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0035 1286 3341 3637 6166 6331 6608 | 0257 2050 2133 3349 3880 5227 5906 |
| 7846 9406 9802 | 6097 6281 9853 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0153 2642 4181 5505 6883 8065 8940 | 0073 1318 3316 4837 6997 8503 9499 |
| 0225 2719 4306 5601 6923 8128 8957 | 0201 1463 3607 4883 7301 8554 9515 |
| 0229 2922 4460 5681 7054 8228 8991 | 0218 1469 3627 4896 7315 8595 9621 |
| 0421 3029 4529 5781 7099 8230 9113 | 0407 1875 3634 4909 7412 8614 9663 |
| 0481 3043 4553 5802 7285 8279 9216 | 0473 1882 3688 5254 7563 8625 9670 |
| 0586 3089 4611 5934 7444 8488 9326 | 0497 1941 3760 5343 7640 8765 9728 |
| 0623 3395 4893 6005 7487 8529 9439 | 0498 2027 3879 5399 7774 8770 9815 |
| 0657 3459 4973 6338 7580 8555 9515 | 0636 2065 3925 5704 7788 8801 9871 |
| 0769 3657 5097 6349 7614 8592 9726 | 0676 2359 4116 5711 7813 8813 9885 |
| 1110 3866 5267 6360 7677 8596 9997 | 0799 2668 4194 5769 7895 8865 9908 |
| 1635 3949 5300 6453 7720 8664 | 0845 2686 4205 6639 7962 9006 |
| 2022 3978 5351 6713 7773 8668 | 0916 2861 4363 6773 8024 9159 |
| 2083 4075 5431 6810 7914 8735 | 0927 3077 4459 6805 8181 9183 |
| 2487 4122 5432 6873 7934 8765 | 0941 3170 4599 6894 8246 9321 |
| 2638 4149 5438 6875 7992 8779 | 0976 3299 4723 6948 8323 9469 |

SWARNALAXMI LION EMERALD WEDNESDAY
DrawDate on:23/08/23

| SWARNALAXMI SERIES Dr No:201 | DAY - LION SERIES Dr No:60 |
|---|---|
| 1st Prize Rs.50000/- 527726 | 1st Prize Rs.50000/- 583106 |
| 2nd Prize Rs.7000/- 73847 | 2nd Prize Rs.7000/- 94200 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 16996 27418 38213 49503 51249 | 15500 26557 37377 48183 59375 |
| 62463 62811 73193 84728 95329 | 61755 72405 83571 94615 94926 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 3303 4133 4503 4623 6240 7101 7203 | 0529 0725 0866 2230 3921 4802 6338 |
| 7412 7684 8819 | 7122 7601 9731 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0029 0515 0861 2993 4114 5177 5436 | 0307 1699 3925 4082 4521 5714 8386 |
| 6061 7920 8810 | 8810 8994 9765 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0067 1804 3883 5167 6382 7775 9211 | 0058 1237 2661 4609 5883 6914 8263 |
| 0075 1974 3908 5338 6390 7955 9224 | 0275 1250 2822 4621 5944 6917 8493 |
| 0173 2005 3922 5441 6490 8025 9340 | 0366 1319 2843 4705 6066 6964 8665 |
| 0236 2006 4029 5517 6531 8042 9350 | 0473 1346 3007 4726 6164 7123 8685 |
| 0246 2557 4109 5528 6717 8056 9498 | 0519 1501 3312 4794 6189 7219 8764 |
| 0313 2754 4172 5589 6743 8154 9738 | 0616 1580 3372 4835 6193 7288 9352 |
| 0321 2963 4222 5664 6762 8200 9781 | 0623 1725 3455 4975 6331 7334 9564 |
| 0633 3004 4361 5679 6799 8366 9855 | 0695 2187 3605 4986 6346 7351 9607 |
| 0697 3117 4531 5723 6814 8417 9920 | 0697 2208 3613 5081 6461 7447 9989 |
| 1136 3210 4711 5838 6943 8449 9942 | 0858 2240 3620 5196 6484 7466 9996 |
| 1435 3362 4742 5950 6946 8509 | 0959 2269 3700 5254 6553 7642 |
| 1453 3486 4765 6040 6955 8737 | 1041 2300 3747 5434 6573 7651 |
| 1555 3558 4930 6064 7034 8872 | 1207 2336 3871 5523 6702 7664 |
| 1603 3648 4943 6143 7486 8903 | 1211 2401 3906 5720 6764 7776 |
| 1745 3719 5102 6234 7586 9051 | 1219 2494 4281 5773 6816 8050 |

# నాజన్మ ధన్యమైంది..

≫ ముువ్వన్నెల జెండానుప్రదర్శించారు. అనంతరం ఇస్రోశాస్త్రవేత్తల కృషిని అభినందిస్తూ ఇలాంటి చారిత్రక ఘట్టాలుచూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు,చంద్రయాన్ బృందానికి నా అభినందనలు. ఈక్షణంకోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసా. అద్భుత విజయంకోసం 140 కోట్లమందిప్రజలు ఎంతోఉత్కంఠతో ఎదురుచూసారని, ప్రపంచంలోనేతొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టామని, చంద్రయాన్ ఘన విజయంతో నా జీవితం ధన్యమైంది. ఈ విజయం దేశం గర్వించే మహత్తర క్షణాలు. చంద్రయాన్ విజయం నవభారత జయధ్వానం. బ్రిక్స్ సమావేశాల్లో ఉన్న నామనసంతా చంద్రయాన్‌పైనే ఉంది. ఈ క్షణంకోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసా. భారత్ సరికొత్త చరిత్ర లిఃంచిందని, అమృతకాలంలో తొలి ఘనవిజయం అని అన్నారు. ఇప్పటివరకూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఏ దేశమూ చేరుకోలేదన్నారు. మన శాస్త్రవేత్తల కఠోర శ్రమవల్లే ఈవిజయం సాధించామని భారత్ సాధించిన ఈ అద్భుత విజయం ఒక్క మన దేశానిది మాత్రమే కాదని, మానవాళి అందరిదీనని అని మోడీ వ్యాఖ్యానించారు.

# రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కేసులా?

## తెలంగాణ ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జికి సుప్రీం షాక్

### జడ్జి జయకుమార్‌ను సస్పెండ్ చేసిన సుప్రీంకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** తెలంగాణ ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి జయకుమార్‌ను సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికపై జడ్జి జయకుమార్ కీలక తీర్పును ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల అఫిడవిట్ వ్యవహారంలో... శ్రీనివాస్‌గౌడ్ సహా 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జడ్జి జయకుమార్ ఇంతకు ముందు ఆదేశించారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల అధికారులపై కేసు పెట్టాలని గతంలో ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయనపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కేసులు పెట్టాలని ఎలా ఆదేశిస్తారని ప్రశ్నించింది. ఆయనపై సస్పెన్షన్‌ను విధించింది. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నిక కోసం నామినేషన్ వేశారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఈ డాక్యుమెంట్లను సాధారణ ప్రక్రియలో భాగంగా అప్‌లోడ్ చేశారు. అయితే అప్‌లోడ్ అయిన డాక్యుమెంట్‌లలో కొన్ని పొరపాట్లు ఉండటంతో శ్రీనివాస్‌గౌడ్ తెర వెనక వ్యవహారం చేశారని, పాత డాక్యుమెంట్ డిలీట్ చేసి కొత్తది అప్‌లోడ్ చేశారని కొందరు ఫిర్యాదు చేశారు. ఈ ట్యాంపరింగ్‌పై దర్యాప్తు చేయాలని మహబూబ్‌నగర్ వాసి రాఘవేంద్రరాజు హైదరాబాద్ నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఓ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించింది. అయితే పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు.. ఎన్నికల అఫిడవిట్ టాంపరింగ్ కేసు వివరాలను ఇవ్వాలని ఆదేశించింది. దీంతో మహబూబ్‌నగర్ రెండో టౌన్ స్టేషన్‌లో శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు 10 మంది అధికారులపై ఇటీవలే కేసు నమోదైంది. ఈ కేసులో కోర్టు ఆదేశాల మేరకు మొత్తం పది మంది అధికారులను చేర్చారు. వీరిటో నాటి ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్‌కుమార్, నాటి స్టేట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ శశాంక్ గోయల్,ఆనాటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్‌తో పాటుఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం తీసు కున్న చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎక్కడైతే తప్పు జరిగిందో,ఎవరైతే తప్పు చేశారో వారిని నిందితులుగా చూడాలి తప్ప..ఆ సమయంలో ఉన్న అన్ని రాజ్యాంగ వ్యవస్థలను నిం దితులుగా పేర్కొనడం సరికాదని కోర్టుకు విజ్ఞప్తిచేసింది. వీరివాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. రాజ్యాం గబద్ధ వ్యవస్థలపై కేసులకు ఎలా ఆదేశిస్తారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ జయకుమార్ ఇచ్చిన ఆదేశాలను నిలిపివేసిన సుప్రీంకోర్టు.. ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.



చంద్రయాన్-3 సక్సెస్ కావడంతో బుధవారం రాజ్‌భవన్‌లో జాతీయజెండాతో గవర్నర్ తమిళిసై

# రైతు సంక్షేమమే లక్ష్యం

≫ వినియోగంలోనే నెంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్‌ను అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఎలక్షన్లు వస్తున్నాయనగానే పండుగల ఎందు బిచ్చగాళ్లలా ఓట్లు అడుక్కునేందుకు మాయమాటలు చెప్పే దగాకోరులు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సీఎం కేసీఆర్ సూచించారు. కాంగ్రెస్ హయాంలో ఉన్నప్పుడు రెండు వందల రూపాయల ఫించన్ ఇవ్వలేక పోయిందని, ఇప్పుడు నాలుగు వేలు ఇస్తామని నోటికొచ్చినట్లు చెబుతున్నారన్నారు. గతంలో వెయ్యి రూపాయల ఫించన్ ఇచ్చామని, కళ్యాణలక్ష్మికి 50 వేల ఇచ్చామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన విధంగానే ఫించన్‌ను 2 వేల రూపాయలకు, కళ్యాణలక్ష్మిని 1 లక్ష రూపాయలకు పెంచుకున్నామన్నారు. మనం ఆర్థికంగా ఇంకా బలపడుతున్నామని, త్వరలోనే ఫించన్లు కూడా పెంచుకుందామన్నారు. అక్టోబర్ 16న భారీ బహిరంగ సభ నిర్వహించే కార్యక్రమం ఉందని, అప్పుడు అన్ని స్పష్టంగా ప్రకటిస్తామన్నారు. అంతకు ముందు మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పొద్దున లేవగానే భారసాపై తిట్ల పురాణం వల్లెవేస్తే, కేసీఆర్ పుట్లకు పుట్లుగా వడ్లను పండిస్తున్నారన్నారు. సమైక్య పాలనలో వెనకబడ్డ తెలంగాణ బాధలను కేసీఆర్ రూపు మాపారన్నారు. మంజీరా నీరు కాలువల వెంబడి పరుగెడుతూ 30, 40 వేల ఎకరాల్లో పంట సాగుకు తోడ్పడుతుందన్నారు. 24 గంటల కరెంట్ ఇవ్వడం అసాధ్యమని అన్న ప్రతిపక్షాల నోళ్లను కేసీఆర్ తన చాకచక్యంతో మూయించారన్నారు. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌ను దీవించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్లు హేమలత శేఖర్‌గౌడ్, రోజా శర్మ, ఎంపీలు ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఫారుక్ హుస్సేన్, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్‌కు కాంగ్రెస్ తీర్థం

≫ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఏఐసిసి ఇంచార్జ్ మానిక్‌రావ్‌ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలు చేరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ బిజెపితో బిఆర్ఎస్ పొత్తు ఖాయమైంది కాబట్టే కమ్యూనిస్టులను కరివేపాకులా కెసిఆర్ వదిలేశారని విమర్శించారు. కమ్యూనిస్టులకు సీట్లు ఇవ్వకుండా ఏకపక్షంగా ఎందుకు కెసిఆర్ సీట్లు ప్రకటించారని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ తెలంగాణ సాధనలో త్యాగాలు చేస్తూ కీలకమైన పాత్ర పోషించారు. అందుకే ఆయనను కాంగ్రెస్ లోకి ఆహ్వానిస్తున్నాము. తొమ్మిది ఏళ్ళ బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను బొందలగడ్డగా మార్చినారని రేవంత్ ఆవేదన చెందారు. దేశంలో తెలంగాణ నెంబర్ వన్ అంటున్నారు అది కేవలం బెల్టుషాపుల్లోనే అని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలో 60వేల బెల్టుషాపులు వున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని ఆయన అన్నారు. వైన్‌షాపు టెండర్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఫీజు నిర్ణయించి 2500 కోట్ల రూపాయలు కెసిఆర్ కొల్లగొట్టారు. కాంగ్రెస్ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే కేసిఆర్ 7500 కోట్లకు అమ్ముకున్నారని ఆయన చెప్పారు. సాగు నీటి ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ మాత్రమే. నాగార్జునసాగర్ కట్టింది చర్చిద్దామా అని ఆయన సవాల్ విసిరినారు. చరిత్రచూస్తే కాంగ్రెస్ ఏం చేసిందో తెలుస్తుంది. కాళేశ్వరంలో లక్ష కోట్ల రూపాయలు దిగమింగినాడు కెసిఆర్ అని ఆయన ఆరోపించారు. కామారెడ్డి 22 ప్యాకెసి పనులు పూర్తి కాలేదు. కామారెడ్డికి గోదావరి నీళ్ళు తెస్తేనే కెసిఆర్ కామారెడ్డిలో అడుగు పెట్టాలని. కాంగ్రెస్ హయాంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ళను కట్టామని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే రూ.500కు గ్యాస్ సిలెండర్ ఇస్తామని తెలిపారు. ప్రతి పేదవాడికి ఆరోగ్యశ్రీ పథకంలో ఐదు లక్షల రూపాలయు వైద్యఖర్చులు భరిస్తామని చెప్పారు. రైతుకు రెండు లక్షల రూపాయల ఋణమాఫి చేస్తామని అన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఆయన తెలిపారు. ఈనెల 26న చేవెళ్ళలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. బిజెపిలో ఇంకా సాంఘిక అసమానతలు వున్నాయని హోం మంత్రి అమిత్ షాకు శాలువా తీసుకొని వెళ్ళితే దళితుడు తెచ్చాడని ఆయన తీసుకోలేదని మాజీ మంత్రి చంద్రశేఖర్ చేరిక సందర్భంగా బిజెపిలో తనకు జరిగిన అవమానం నెమరేసుకున్నారు. బిఆర్ఎస్‌ను ఓడించే సత్తా ఒక కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని ఆయన అన్నారు. వికరాబాద్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని ఈసారి జహిరాబాద్ నుంచి పోటీ చేస్తానని ఆయన తెలిపారు.

టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జూబ్లిహిల్స్ నివాసంలో బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరినారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నుంచి అనేక మంది వచ్చి పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి రేవంత్ పార్టీలోకి ఆహ్వానించారు.

## వారం - వర్జ్యం

**24-8-2023 గురువారం**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, నిజ శ్రావణ మాసం, శుక్ల పక్షం, కార్తె మఖ

అష్టమి రా.09-11; అనూరాధ తె.04-50

వర్జ్యం ఉ.08-50 ల 10-26

రా.కా.మ.1-30 ల 3-00 వ

యమగండం ఉ.6-00 ల 7-30 వ

దుర్ముహూర్తం ఉ.10-00 ల 10-48 వ

మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** శుభ వార్తలు వింటారు. ముఖ్యమైన ప్రయత్నాలు ఫలిస్తాయి.

**వృషభం:** అకారణంగా మనోవేదన చెందు తారు. వృత్తి ఉద్యోగులకు యథాతథం.

**మిథునం:** కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. ఖర్చులు అధికం.

**కర్కాటకం:** విద్యార్థులకు విజయం. కుటుంబ పేరు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి.

**సింహం:** భోజన సౌఖ్యం. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక లాభాలుంటాయి.

**కన్య:** శుభ వార్తలు వింటారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయులను కలుస్తారు.

**తుల:** విద్యార్థులకు శుభ యోగం. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి.

**వృశ్చికం:** ధన లాభం. కుటుంబంతో ఉత్సాహంగా గడుపుతారు.

**ధనుస్సు:** ప్రశాంతత కరువవుతుంది. వృత్తి ఉద్యోగులకు యథాతథంగా ఉంటుంది.

**మకరం:** క్రయ-విక్రయాలు సామాన్యం. కుటుంబంలో మనస్పర్థలకు ఆస్కారం.

**కుంభం:** వ్యాపారులకు శ్రమ అధికం. వివాదాలకు దూరంగా వుంటే మంచిది.

**మీనం:** సామాన్య ధన లాభం అనుకోని సంఘటనలు జరుగుతాయి.

- పాలకుర్తి సంతోష్ శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

## నేడు కేబినెట్‌లోకి
# మహేందర్‌రెడ్డి

≫ సహకరించడానికి అంగీకరించారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి సోమవారం అభ్యర్థుల ప్రకటన కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి కూడా మహేందర్‌రెడ్డి వెళ్లారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మహేందర్‌రెడ్డి మంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు మంత్రులు హాజరు కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ తొలి కేబినెట్‌లో రవాణా శాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాల అనంతరం రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా ఆయన గెలిచారు. మొత్తంగా ఆయన 1994 నుంచి 2018 వరకు తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో ఆయన రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలుపొందారు. అనంతరం రెండోసారి ఎమ్మెల్సీగా 2022 ఫిబ్రవరిలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# బ్రిక్స్ విస్తరణకు మద్దతు

≫ అధ్యక్షతన జరుగుతున్న జీ20 సదస్సులో గ్లోబల్‌సౌత్ దేశాలకు అత్యంతప్రాధాన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. బ్రిక్స్‌లో కూడా అలాంటిప్రాధాన్యతలుకల్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధిలో బ్రిక్స్ కెఉ చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కీలకపాత్రపోషిస్తోందన్న ఆయన గడచిన రెండు దశాబ్దాలుగా ఈ కూటమి ప్రయాణం ఎంతో అద్భుతంగా సాగుతున్నదన్నారు. రైల్వే రీసెర్చి నెట్‌వర్క్, ఎంఎస్ఎంఇలమధ్య సహకారం, స్టార్టప్ రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై భారత్‌చేసిన సూచనలతో ఎంతో పురోగతి కనిపిస్తోందని మోడీ అన్నారు. ఈసదస్సులోనే పలు కీలక అంశాలపై మాట్లాడిన మోడీ భారత్‌చేపట్టి అమలుచేస్తున్న ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పురోగతిగురించి వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో త్వరలోనే భారత్ కీలకభూమిక పోషించనుననదన్నారు. 2047 నాటికి భారత దేశాన్ని అభివృద్ధిచెందిన దేశంగా మార్చడం తమ సంకల్పమన్నారు. యుపిఐ సేవలే ఇందుకు నిదర్శనమని అన్నారు. డిజిటల్‌సేవలను ఇపుడు ప్రపంచదేశాలు అభినందిస్తున్నాయనిచెప్పారు. అంతకుముందు భారత ప్రధాని మోడీ దక్షిణాఫ్రికా ప్రధానమంత్రి సిరిల్‌రాంపోసాతో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు. రక్షణ, వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ఇరుదేశాల పరస్పర కృషిని మరింతపెంచుకోవాల్సిన ఆవశ్యకతను ఇరుదేశాధినేతలు అంగీకరించారు.

## కాంగ్రెస్‌లోకి సీతాదయాకర్ రెడ్డి?

### ఆమె ఇంటికి వెళ్లిన టిపిసిసి ఉపాధ్యక్షుడు మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2009లో దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సీతా దయాకర్‌రెడ్డి తెలుగుదేశంనుంచి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్దమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవలే ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే దయాకర్ రెడ్డి మృతి చెందారు. జుబ్లిహిల్స్ లోని ఎమ్మెల్యేకాలనీలో ఉన్న ఆమె నివాసానికి టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, డిసిసి అధ్యక్షుడు జి. మధుసూధన్‌రెడ్డి బుధవారం వెళ్లడం ఇన్నాళ్లుగా సీత పార్టీ మారే అంశపై వస్తున్న ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. మహబూబ్‌నగర్‌జిల్లాలోని 14 నియోజకవర్గాలలో దేవరకద్ర ఒకటి. 2007లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్త నియోజకవర్గం ఏర్పాటుఅయింది. తెలుగుదేశం ఈ నియోజకవర్గం అభ్యర్థిగా 2009లో సీతా దయా కర్‌రెడ్డిని ఎన్నికల బరిలో నిలిపి ఆ సీటును కైవసం చేసుకొంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత గత తొమ్మిదేళ్ళుగా రాజకీయంగా ఈ దంపతులు ఇద్దరు స్తబ్దుగా వున్నారు.ఇటీవలే దయాకర్‌రెడ్డి మృతిచెందడంతో సీత అభ్యర్థిత్వంపై కాంగ్రెస్‌కూడా ఆలోచిస్తుంది.ఆమె కూడా కాంగ్రెస్ కీలక నేతలతో సంప్రదింపులు చేశారని ప్రచారం జరుగుతోంది. బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో కాంగ్రెస్ కూడా గెలుపు గుర్రాల కోసం వడబోత మొదలు పెట్టింది. తెలంగాణలో బలహీనంగా వున్న టిడిపిలో వుండే సీతాదయాకర్ రెడ్డి వంటి ప్రజాధరణ వున్న నాయకులను కూడా తమ పార్టీలో చేర్చుకుంటే ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని అధినాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మల్లురవి సీతా దయాకర్ రెడ్డి ఇంటికి వెళ్ళడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకొంది.

## బిఆర్ఎస్‌కు మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం రాజీనామా

### భారీగా తరలివచ్చిన అనుచరులు, ప్రజాప్రతినిధులు



బుధవారం నకిరేకల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్,ఆగస్టు 23 ప్రభాతవార్త :** నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన అనుచరులు, ప్రజాప్రతినిధులతో బిఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. నకిరేకల్‌లోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సభకు నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు గ్రామాల నుండి ఆయన అనుచరులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు దాదాపు 10వేలకు పైగా తరలివచ్చి విజయవంతం చేశారు. తొలుత నకిరేకల్‌లోని కనకదుర్గ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పూజలు నిర్వహించి అనంతరం ప్రదర్శనగా సభ స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. ఎమ్మెల్యే పదవి అనంతరం కూడా ప్రజలకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చి అండగా ఉంటూ పార్టీని వీడలేదన్నారు. ఉద్యమ కాలంలో అర్ధరాత్రి కూడా జైలుకు వెళ్ళమన్నారు. వాస్తవాలను నాయకత్వం చూడకపోతదా అని నాలు గేళ్ళుగా ఓపికపట్టి ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి నకిరేకల్ మినిస్టేడియంలో పెద్ద పదవి ఇస్తామని ప్రకటించిన నాటి నుంచి నన్ను ఎంతో ఇబ్బందికి గురి చేశారన్నారు. ఈ నియోజక వర్గంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సోషల్ మీడియాలో సిగ్గు లేకుండా పోస్టులు పెడుతున్నారన్నారు. ఈ రోజు బిఆర్ఎస్‌ను వదిలేస్తున్నానన్నారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమ నా లక్ష్యమని, రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యేగా బరిలో ఉంటానన్నారు. నాకు ఎవరు హైకమాండ్ లేరని, ప్రజలే నాకు న్యాయ నిర్ణేతలన్నారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు, అనుచరుల సూచనలు తీసుకుని త్వరలో రాజకీయ నిర్ణయం తీసుకుంటామన్నారు.

**బిఆర్ఎస్‌కు పలువురు రాజీనామాలు:** నకిరేకల్‌లోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సభలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, బిసి ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్యలతో పాటు నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని గ్రామాల నుంచి ఆయన అనుచరులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేసినట్లు ప్రకటించారు.



ప్రమాదానికి కారణమైన లారీ, లారీ కింద ఇరుక్కుపోయిన బైక్.

## లారీ, బైక్ ఢీ: ఇద్దరు దుర్మరణం

### షాద్‌నగర్ సమీపంలో ఘటన

### 100 మీటర్ల మేర బైకును ఈడ్చుకెళ్లిన లారీ

### సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు

**షాద్‌నగర్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ శివారులో బుచ్చిగూడ రోడ్డులో బుధవారం రాత్రి లారీ – బైక్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక పట్టణ సీఐ ప్రతాప్‌లింగం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన సాయి,అంజయ్యలు ప్యాషన్ ప్రో బైక్ పై షాద్‌నగర్ వైపువస్తుండగా, షాద్‌నగర్ వైపు నుంచి బుచ్చిగూడ వైపు ఉన్న పౌల్ట్రీఫామ్‌కు వెళుతున్న లారీ (ఏపి 28 వై 6665)ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో లారీ బైకును రోడ్డు దిగ సుమారు 100 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటివద్ద ఉన్న ఇసుక కుప్పమీదకు దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు.విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం,పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు. సంఘటన స్థలానికి మృతుల కుటుంబ సభ్యులు రావడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.అనంతరం పోలీసులు మృతదేహాలను స్థానికప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## మిజోరంలో కుప్ప కూలిన నిర్మాణంలోని రైల్వే బ్రిడ్జి

## 20 మంది దుర్మరణం, పలువురికి గాయాలు



**ఐజ్వాల్, ఆగస్టు 23:** ఈశాన్య రాష్ట్రం మిజోరంలో బుధవారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న ఓ రైల్వే వంతెన కుప్పకూలింది. దీంతో 20మంది కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. కూలిన శిథిలాల కింద చిక్కుకున్న మరికొంతమంది చనిపోయే అవకాశం ఉందని, దీంతో మృతుల సంఖ్య పెరగనుందని ఐల్వే అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఐజ్వాల్‌కు సుమారు 21 కిలోమీటర్ల దూరంలోని సాయిరంగ్ గ్రామం సమీపంలో రైల్వే వంతెన నిర్మాణంలో ఉంది. బుధవారం ఎప్పట్లాగే నిర్మాణ పనులు కొనసాగుతుండగా ఉదయం 10 గంటల ప్రాంతంలో బ్రిడ్జి ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో సుమారు 35 నుంచి 40మంది కార్మికులు పనిచేస్తున్నారని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో చనిపోయిన 22 మంది కార్మికుల మృతదేహాలను వెలికి తీసినట్లు చెప్పారు. బ్రిడ్జి శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లు వివరించారు. కాగా ఈ ప్రమాదంపై మిజోరం ముఖ్యమంత్రి జోరాంతంగా ట్విట్టర్ వేదికగా స్పందించారు. వంతెన కూలిన విషం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయినట్లు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారని ముఖ్యమంత్రి జోరంతంగా వివరించారు.

## దేశంలో ఎరువుల కొరత లేదు

### యూరియా ఇతర అవసరాలకు మళ్లించొద్దు

### కేంద్ర ఎరువుల శాఖ మంత్రి మాండవీయ

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజనులో దేశంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ ఖరీఫ్ సీజనులో దేశ అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపింది. ప్రస్తుతం దేశంలో 150 లక్షల టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. ఈ నిల్వలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌తో పాటు, రాబోయే రబీ సీజను ప్రారంభానికి సరిపోతాయని తేల్చిచెప్పింది. ఈ మేరకు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా బుధవారం ఒక ప్రకటనలో యూరియాను పంటల సాగు నిమిత్తం కాకుండా ఇతర అవసరాల కోసం దారిమళ్లించవద్దని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేశారు. మాతృభూమిని కాపాడుకోవడానికి ఎరువుల సమతుల్యత అవసరమన్నారు. ఇందుకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలనేదే తమ సంకల్పమని చెప్పారు. యూరియాను వ్యవసాయ అవసరాల కోసం కాకుండా, ఇతర అవసరాల కోసం దారి మళ్లించడాన్ని రాష్ట్రాలు నిరోధించాలని సూచించారు. ఇందుకు కేంద్రంతో కలిసి పనిచేయాలని కోరారు. అలాగే నానో యూరియా, నానో డై అమ్మోనియం ఫాస్పేట్ (డీఏపీ) పురోగతిలో ఉన్నాయన్నారు.

భూసారాన్ని కాపాడేందుకు రసాయనిక ఎరువుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యత ఉందని అన్నారు. ప్రీఎం ప్రణామ్ పథకం ద్వారా కేంద్రం ప్రభుత్వం ఇప్పటికే ఈ విషయంలో ఒక అడుగు ముందుకు వేసిందని పునరుద్ఘాటించారు. మాతృభూమిని కాపాడేం దుకు ప్రత్యమ్నాయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగా సల్ఫర్ కోటెడ్ యూరియా (యూరియా గోల్డ్), నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కేంద్ర మంత్రి మాండవియా తెలిపారు.

## యేడాదికి రెండుసార్లు పరీక్షలు

### కొత్త విద్యావిధానంలో పాఠ్యపుస్తకాల ఆధునీకరణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** విద్యావ్యవస్థలో కీలక మార్పులు తెస్తూ కేంద్రం నిర్ణయించింది. కొత్త విద్యా విధానం (నెప్) పరిధిలో 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలను ఆధునీకరిస్తామని చెపుతోంది. కొత్త పాఠ్యాంశాలు, కొత్త బోధనాంశాలు కూడా విద్యాశాఖప్రకటించింది. 11, 12 తరగతుల విద్యార్థులు రెండు భాషాలను చదవాల్సి ఉంటుంది. వాటిలో ఒకటి భారతీయ భాష అయి ఉండాలి. బోర్డు పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు జరుగుతాయి. దీనివల్ల విద్యార్థులు మంచి మార్కులు స్కోర్‌చేసేందుకు వీలువుతుందని చెపుతోంది. బోర్డు పరీక్షలు మరింత సులభతరం చేసేందుకు వీలుగా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభా సామర్థ్యాలను ముందుగానే అంచనావేసేవిధంగా ఉంది. దీనితో నెలలతరబడి కోచింగ్, గుర్తుపెట్టుకునేవిధంగా విద్యార్థులు అగచాట్లు పడాల్సినవసరిలేదు. రెండుసార్లుపరీక్షలునిర్వహించడంవల్ల విద్యార్థులు తమకు అనువైన సబ్జెక్టులను ఎంచుకుని పరీక్షలురాసి మంచి మార్కులు తెచ్చుకోవచ్చని భావిస్తోంది. రెండుసార్లుపరీక్షలు నిర్వహించడంవల్ల విద్యార్థులకు మంచి మెరిట్ మార్కులు తెచ్చుకునే వీలుంటుందని అధికారులు చెపుతున్నారు. 11,12 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు కేవలం ఆర్ట్స్, సైన్స్, కామర్స్ వంటి వాటికి మాత్రమే పరిమితం చేయకుండా వారికి నచ్చిన కోర్సు చదువుకునేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. వీటితోపాటు పరీక్షల నిర్వాహకులు, మదింపుచేసేవారు, జవాబుపత్రాలు దిద్దే అధ్యాపకులు మొత్తం అందరికీ వర్సిటీ ధృవీకృత కోర్సులు చదవాల్సి ఉంటుంది. వీటికింద శిక్షణ పొందినట్లు గుర్తింపు కూడా ఇస్తారు. తరగతి గదుల్లో పాఠ్యపుస్తకాలను బోధనాపరంగా కవర్‌చేసే వ్యవస్థకు ఇపుడు స్వస్తిచెపుతున్నారు. ఎందుకంటే పాఠ్యపుస్తకాల ఖర్చుపెరుగుతుందేకానీ విద్యార్థులు అందుకు అనుగుణంగా తర్ఫీదు కాలేకపోతున్నారు. మొత్తంగాచూస్తే రెండుసార్లుపరీక్షలునిర్వహించడం వల్ల విద్యార్థినీ విద్యార్థులు మరింత మంచి మార్కులు తెచ్చుకునేందుకు దోహదంచేస్తుందని నెప్ ఉన్నతాధికారులు చెపుతున్నారు.

## యావత్ భారత దేశ ప్రజలకు ఇది పండుగ రోజు: సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** సేఫ్ లాండింగ్ అనే చివరి ఘట్టాన్ని చేరుకోవడం ద్వారా చంద్రయాన్ 3 ప్రయోగం సంపూర్ణ విజయాన్ని సాధించడం పట్ల ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హర్షం వ్యక్తం చేశారు. చంద్రుని దక్షిణ ధృవం మీదకు లాండర్ మాడ్యుల్‌ను విజయవంతంగా చేర్చిన మొట్ట మొదటి దేశంగా, ప్రపంచ అంతరిక్ష పరిశోధన రంగంలో భారత దేశం సరికొత్త అధ్యాయాన్ని లిఃంచిందని,అరుదైన చరిత్రను సృష్టించిందని సిఎం తెలిపారు. ఇది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ సందర్భం అని సిఎం కెసిఆర్ అన్నారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో,శాస్త్రవేత్తలకు,సిబ్బందికి.. ఈ ప్రయోగం విజయవంతం కావడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి సిఎం కెసిఆర్ అభినందనలు తెలిపారు. చిరకాల ఆకాంక్ష నెరవేరిన సందర్భంలో యావత్ భారతదేశ ప్రజలకు ఇది పండుగ రోజని సిఎం అన్నారు. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టబోయే అంతరిక్ష పరిశోధనలకు,ప్రయోగాలకు చంద్రయాన్ 3 విజయం గొప్ప ప్రేరణిస్తుందని సిఎం పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశ కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంచే దిశగా,అంతరిక్ష పరిశోధన రంగంలో ఇస్రో తన విజయ పరంపరను కొనసాగించాలని సిఎం కెసిఆర్ ఆకాంక్షించారు.

## ఆయిల్‌ట్యాంకర్ రోల్స్‌రాయిస్‌ఢీ

## ఇద్దరుమృతి, ఐదుగురికి గాయాలు

**నుహ్(హర్యానా), ఆగస్టు 23:** లగ్జరీ రోల్స్‌రాయిస్‌కారు ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ట్యాంకరులోని డ్రైవరు, హెల్పరు మృతిచెందగా లగ్జరీ కారులో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఢిల్లీ ముంబయి బరోడా ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన ఈప్రమాదం గగుర్పాటుకు గురిచేసింది. నుహ్ వద్ద ట్యాంకర్‌ట్రక్కు రాంగ్‌సైడ్ నడుపుకుంటూ వస్తున్నాడు. రావడంరావడమే నాగినా పోలీస్ లిమిట్స్‌రిధిలోని ఉమ్రి గ్రామం వద్ద రోల్స్‌రాయిస్ కారును ఢీకొట్టింది. రోల్ప్‌సరకాయిస్ లిమోసిన్‌కు వెంటనే మంటలు అలుముకున్నాయి. ట్యాంకర్‌ను ఢీకొన్న వెంటనేకారులో ఉన్న ఐదుగురిని రక్షించారు. వారిబంధువులు వెనుకనే మరో కారులో వస్తుండటంతో వారంతా పరుగులుతీసి మంటల్లో ఉన్న లిమోసిన్‌నుంచి వీరిని బయటికి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో మృతిచెందినవారు ట్రక్ డ్రైవర్ రామ్‌ప్రీత్, ఆతని సహాయకుడు కుల్దీప్ ఇద్దరూ కూడా ఉత్తరప్రదేశ్‌కు చెందినవారేనని పోలీసులు తెలిపారు. ఇక రోల్స్‌రాయిస్ లిమోసిన్‌లో ఉన్న వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారు దివ్య, తస్బీర్ వీరు చండీఘర్‌కు చెందినవారుకాగా ఢిల్లీ నివాసి వికాస్ అనే వ్యక్తికూడా ఉన్నారు. గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో వారికి చికిత్స జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదుచేసామని, గాయాలపాలయినవారినుంచి వాంగ్మూలంతీసుకుని కేసునమోదుచేస్తామన్నారు. ప్రమాదం వివరాలను వారి కుటుంబీకులకు చేరవేసినట్లు కూడా ఏఎస్ఐ తెలిపారు.

## గన్ మిస్‌ఫైర్‌తో హెడ్‌కానిస్టేబుల్ మృతి



భూపతి శ్రీకాంత్ (ఫైల్)

**హైదరాబాద్ (చార్మినార్), ఆగస్టు 23 ప్రభాతవార్త :** విధి నిర్వాహణలో గన్ మిస్ ఫైర్ కావటంతో బుల్లెట్ తలలోకి దూసుకెళ్లి టిఎస్ఎస్‌పి బెటాలియన్ 12 నల్గొండకు చెందిన ఓ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం సూర్యపేట్ జిల్లా అప్పనపేట్ గ్రామానికి చెందిన భూపతి శ్రీకాంత్ (30) జూన్ నెల నుంచి హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలోని కబూతర్‌ఖానా అవుట్‌పోస్ట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా 2018 బ్యాచ్‌కు చెందిన శ్రీకాంత్ ప్రతీ రోజు మాదరిగానే బుధవారం తెల్లవారు జామున 3.20 గంటల సమయంలో విధులు ముగించుకుని నిద్ర ఉపక్రమించే సమయంలో పొరపాటున శ్రీకాంత్ చేతిలోని గన్ మిస్‌ఫైర్ అయ్యింది.బుల్లెట్ శ్రీకాంత్ తలలోకి తీసుకెళ్లటంతో తీవ్రగాయాల పాలయ్యాడు.శబ్దం విన్న ప్రక్కనే ఉన్న పోలీసులు లోపలకు వచ్చి చూడగా రక్తం మడుగులో హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ పడి ఉన్నాడు.వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శ్రీకాంత్ బుధవారం ఉదయం 6.40గంటల సమయంలో మృతి చెందాడు.సమాచారం అందుకున్న దక్షిణ మండలం డిసిపి సాయి చైతన్య, చార్మినార్ ఏసిపి రుద్రభాస్కర్‌లు ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈకేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 370వ అధికరణం రద్దు ప్రభావం ఈశాన్యప్రాంతానికి వర్తించదు: సుప్రీంకు స్పష్టం చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 23: జమ్ముకాశ్మీర్‌కు సంబంధించి 370వ అధికరణం రద్దుపై విచారణచేస్తున్న సుప్రీం ధర్మాసనానికి భారత్ తన నివేదికను ఇచ్చింది. చీఫ్‌జస్టిస్ డివై చంద్రచూడ్ అధ్యక్షతన ఐదుగురు న్యాయమూరక్తుల ధర్మాసనం ఈ పిటిషన్లను విచారిస్తోంది. 370వ అధికరణంపై తన వాదనలు వినిపిస్తూ సొలిసిటర్‌జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ఈ అధికరణం రద్దుద్వారా కేంద్ర ప్రభుత్వం ఈశాన్యభారత్‌కు వర్తించే ప్రత్యేక ప్రయోజనాలజోలికి వెళ్లబోదని స్పష్టంచేసారు. జమ్ముకాశ్మీర్‌ను రెండు కేంద్రపాలితప్రాంతాలుగా విభజించిన కేంద్రం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటికోసం ప్రత్యేకరాజ్యాంగధర్మాసనాన్ని ఏర్పాటుచేసిన సుప్రీం బెంచ్‌ముందు కేంద్రం ఈ అధికరణం రద్దుతో ఈశాన్యప్రాంతప్రత్యేకప్రతిపత్తిజోలికి వెళ్లలేదని స్పష్టంచేసారు. పిటిషనర్ల తరపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ జమ్ముకాశ్మీర్‌లో ఉన్న స్వయంప్రతిపత్తి విధానాలే ఈశాన్యప్రాంతాలకు సైతం వర్తింపచేసేలా రాజ్యాంగంలో పొందుపరిచారని వాదించారు. 370వ అధికరణం రద్దువల్ల ఇపుడు ఇతర ప్రాంతాలపైనా ఈ రద్దు వర్తిస్తుందా అన్నది ప్రశ్నించారు. బెంచ్‌పై జస్టిస్ సంజయ్‌కిషన్‌కౌల్,సంజీవ్‌ఖన్నా, బిఆర్ గబవాయి, సూర్యకాంత్‌లు ఈ పిటిషన్లను విచారణచేస్తున్నారు. వీటిపై సొలిసిటర్‌జనరల్‌మాట్లాడుతూ ఈశాన్య ప్రాంతా నికిగాను, మరే ఇతర భారత్ భాగానికి కూడా ఈ రద్దు అధికరణం ప్రభావం ఉండబోదని స్పష్టంచేసారు.

## 11వ విడత రైతు బంధు నిధుల పంపిణీ పూర్తి

### 68.99 లక్షల మందికి రూ.7,624 కోట్లు : వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రైతు బంధు పథకం 11వ విడదల నిధుల పంపిణీ పూర్తి అయిందని వ్యవసాయ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఈ విడతలో తెలంగాణ వ్యాప్తంగా 68.99 లక్షల మంది రైతులకు చెందిన 1.52 కోట్ల ఎకరాలకు గాను 7,624.74 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలియచేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5,08,756 మందికి 609.67 కోట్ల రూపాయలు, అత్యల్పంగా మల్కాజిగిరిజిల్లాలో 35,879 మందికి 33.60 కోట్ల రూపాయలను ఇచ్చామన్నారు. మొత్తంగా రైతు బంధు కింద ఇప్పటి వరకూ 72,815.09 కోట్ల రూపాయలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. భారతదేశ చరిత్రలో ఇది ఒక రికార్డుని చెప్పారు.

**అమెరికాకు వ్యవసాయ మంత్రి:** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, యంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, ఆహార రంగ పరిశ్రమలు తదితర అంశాలను పరిశీలించేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ నెల 27 నుండి 31వ తేదీ వరకూ అమెరికాలో పర్యటించనుంది.

## జీ20 సదస్సుకోసం భారత్‌కు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ రాక


**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ20 శిఖరాగ్రసదస్సులో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ భారత్‌కు వస్తున్నారు. వచ్చేనెల ఏడునుంచి పదవ తేదీలమధ్య బైడెన్ భారత పర్యటన కొనసాగుతుంది. బైడెన్‌పర్యటనను శ్వేతసౌధం ప్రెస్‌సెక్రటరీకరీన్‌జీన్‌ఫియర్ అధికారికంగాప్రకటించారు. జీ20 సమావేశాల్లో బైడెన్ పలు కీలక అంశాలపై ప్రసంగిస్తారు. ఉక్రెయిన్, రష్యాయుద్ధం, యుద్ధం వల్ల తలెత్తిన ఆర్థిక సామాజిక మార్పులు వాతావరణ మార్పులు, బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచడం వంటి అంశాలపై ఆయన మాట్లాడతారని తెలుస్తోంది.


తెలంగాణ ప్రభుత్వం
నాగారం మునిసిపాలిటీ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్‌గిరి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
1) నం.E1/11/2023-24, తేది: 23.08.2023. 2) పనుల సంఖ్య: 1.0 నం.లు (ఇతరములు). 3) అంచనా ధర: రూ.40.00 లక్షలు. 4) బిడ్ దాఖలు ప్రారంభ తేది: 24.08.2023 ఉ.10.00 గం. వద్ద. 5) బిడ్స్ దాఖలుకు చివరి తేది: 29.08.2023 మ.3.00 గం. వద్ద. 6) బిడ్స్ తెరుచుట: 29.08.2023 మ.3.30 గం. వద్ద. 7) తదుపరి వివరాలకు సంప్రదించవలసిన నం: 7075596119, 9701358580 మరియు http://tender.eprocurement.gov.in చూడండి.
సం/- కమిషనర్, నాగారం మునిసిపాలిటీ
DIPR.No.5717-PP/CL/Advt/1/2023-24, తేది: 23.08.2023

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్,అమీర్‌పేట, హైదరాబాద్.
HMDA చట్టం 2008 యొక్క విభాగం 15(3) క్రింద బహిరంగ ప్రకటన
(ప్రభుత్వ మెమో.నం. 8233/Plg.I(1)/2022-3, తేది: 20.07.2023)
[illegible]
సం/- మెట్రోపాలిటన్ కమీషనర్ తరఫున, HMDA.
DIPR No.5709-PP/CL/Advt/1/2023-24 తేది: 23.08.2023

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్,అమీర్‌పేట, హైదరాబాద్.
HMDA చట్టం 2008 యొక్క విభాగం 15(3) క్రింద బహిరంగ ప్రకటన
(ప్రభుత్వ మెమో.నం. 8233/Plg.I(1)/2022-4, తేది: 20.07.2023)
[illegible]
సం/- మెట్రోపాలిటన్ కమీషనర్ తరఫున, HMDA.
DIPR No.5711-PP/CL/Advt/1/2023-24 తేది: 23.08.2023


## భారత్ మాకెంతో ముఖ్యం.. బైడెన్ మాటలను వెల్లడించిన అమెరికా రాయబారి



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** అమెరికాకు భారత్ ఎప్పుడూ ముఖ్యమైన దేశమేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తనతో పంచుకున్న విషయాన్ని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ తెలిపారు. ఇండియా స్పోరా జీ20 ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ, 'భారత్–అమెరికాల మధ్య సాంకేతిక, వాణిజ్యం, అంతరిక్షంతో సహా వివిధ రంగాల్లో సహకారం ఉంది. గతంలో నేను ఇక్కడకు అని చేయడానికి రావాలని బైడెన్‌ను కోరినప్పుడు, భారత్ మాకెంతో ముఖ్యమైన దేశమన ఆయన అన్నారు. అమెరికాలో పన్ను చెల్లించే వారిలో భారతీయ అమెరికన్లు ఆరు శాతం ఉన్నారు' అని పేర్కొన్నారు. ఈ యేడాది సెప్టెంబరులో ఢిల్లీ వేదికగా జరిగే జీ–20 శిఖరాగ్ర సదస్సుకు జో బైడెన్ హాజరుకానున్నారు. టెక్నాలజీ సహకారం, పంపిణీ వ్యవస్థలు, పర్యావరణం, అంతరిక్షం, సముద్ర అధ్యయనం తదితర అంశాల్లో కలిసి పనిచేసేలా సహకారం పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టిందన్నారు. అమెరికా, భారత్‌లను ప్రపంచంలోనే రెండు శక్తిమంతమైన శక్తులుగా అభివర్ణించారు. భారత్‌లో నివసించాలనే కల గురించి ఆయన ట్విట్టర్‌లో పంచుకున్నారు. ' నా పదవీకాలంలో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చాలా ఉత్సాహంగా ఉన్నా. భారత్‌లో అమెరికా రాయబారిగా 100 అపురూపమైన రోజులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 12 రాష్ట్రాలు, 200 రకాల రుచికరమైన భారతీయ వంటకాలను ఆస్వాదించా. అద్భుతమైన వ్యక్తులను కలిశా. వారి స్నేహం, చూపించిన ప్రేమకు ధన్యవాదాలు. భవిష్యత్తులో ఇరుదేశాల బంధం మరింత బలోపేతమయ్యేలా కృషి చేస్తాను' అని ఆయన ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.

## సచివాలయంలో ప్రారంభమైన నల్లపోచమ్మ ప్రతిష్ఠాపన

### మూడు రోజుల పాటు వివిధ హోమాలు

**హైదరాబాద్,ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణ సచివాలయ నూతన భవన ప్రాంగణ పరిధిలోని నల్లపోచమ్మ ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ ప్రతిష్టాపనా క్రతువులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ప్రారంభమైన ఈ నల్లపోచమ్మ ప్రతిష్టాపన కార్యక్రమం మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా జరగనున్నాయి. మొదటి రోజు జరిగిన పూజా కార్యక్రమానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి వి ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. అలాగే తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మాదవరం నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇక రెండో రోజు 24వ తేదీన స్థాపిత పూజ, ప్రతిష్టాపన హోమం, తిరుమంజసం, మహాలక్ష్మీ యాగం, ఫల పుష్పాదివాసం, మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మూడో రోజు 25వ తేదీన చండీయాగం, దిగ్బలి, ప్రాణప్రతిష్టాపన హోమం, ధ్వజస్తంభం, యంత్ర ప్రతిష్టాపన, విగ్రహాల ప్రతిష్ట, ప్రాణపతిష్ట, మూడు ఆలయాల శిఖర కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, మహా మంగళహారతి, మహాదాశీర్వచనం ఉంటాయి. చివరి రోజు 25వ తేదీన మద్యాహ్నం జరగనున్నప్రధాన పూజా కార్యక్రమంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాల్గొననున్నారు.



## డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే అధికం: బ్రిక్స్' సదస్సులో మోడీ



సౌత్ ఆఫ్రికా, ఆగస్టు 23: భారతదేశం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పురోగతి గురించి దక్షిణాఫ్రికాలో నిర్వహించిన 'బ్రిక్స్' సదస్సులో దేశ ప్రధాని మోడీ మాట్లాడారు. రానున్న కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక భూమిక పోషించనుందని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే దేశ ప్రజల సంకల్పం అని అన్నారు. పదే వార్షికోత్సవం సందర్భంగా బ్రిక్స్ బిజినెస్ కౌన్సిల్‌ను అభినందించారు. పదేళ్లుగా ఆర్థిక సహకారాన్ని అందించడంలో బ్రిక్స్ బిజినెస్ కౌన్సిల్ పాత్ర కీలకమైనదని తెలిపారు. అనంతరం యుపిఐ సేవల గురించి కొనియాడారు. 'ప్రస్తుతం ఈ సింగిల్ క్లిక్ విధానంతో పెద్ద సంఖ్యలో ప్రజలు డిజిటల్ లావాదేవీల్లో పాలుపంచుకుంటున్నారు. దీంతో లావాదేవీల్లో పారదర్శకత పెరిగి, మధ్యవర్తిత్వం, అవినీతి తగ్గుముఖం పట్టింది. చిన్న దుకాణం నడిపే వారి దగ్గర నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ నిర్వహించే వారి వరకూ అందరూ యుపిఐ సేవల్ని వినియోగిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నింటిల్లో అత్యధికంగా డిజిటల్ లావాదేవీలు చేస్తోన్న దేశం భారత్. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, ఫ్రాన్స్ దేశాలు కూడా ఈ సేవల్ని అందిపుచ్చుకోనున్నాయి' అంటూ యుపిఐ విస్తరణ గురించి తెలిపారు. బ్రిక్స్‌లోని దేశాలు కూడా ఈ సేవలు వినియోగించే అవకాశాలు ఉన్నాయన్నారు.

వార్త

మనమెటువంటి వాళ్లమన్నది మన మాటల్లోనే తెలుస్తుంది.

-డేవిడ్


# అంతరిక్ష విజయం

భారత అంతరిక్ష పరిశోధనల్లో మరో చరిత్రాత్మక శకం ఆవిర్భవించింది. సుదీర్ఘపరిశోధనల తర్వాత చంద్రునిపైకి పంపించతలపెట్టిన చంద్రయాన్-3 విజయవంతం అయింది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల నాలుగునిమిషాలకు చంద్రుని దక్షిణధృవంపై చంద్రయాన్-3 కాలుమోపిన కీలక ఘట్టం ముగిసింది. ఇక రెండువారాలపాటు చంద్రునిపై పరిశోధనలు విస్తృతంగా కొనసాగించడంతోపాటు ఎప్పటికప్పుడు ఆ వివరాలను ఇస్రోకు చేరవేసే ఘట్టం ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు పరిశోధనలకు అందని చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టడం ప్రపంచ రికార్డు. అంతరిక్ష రంగంలో అగ్రస్థానంలో ఉన్న అమెరికా, రష్యా, చైనా దేశాల కంటే ముందు భారత్ సాధించింది. ప్రతికూల పరిస్థితులలో ఉన్న దక్షిణ ధ్రువం చేరుకోవడం ఎంతో కష్టసాధ్యం. అలాంటి ప్రదేశంలో వ్యోమనౌకను సురక్షితంగా దించడం ద్వారా భారత్ ఘన చరిత్ర సృష్టించింది. ఈ పరిశోధనల్లో ఇస్రోశాస్త్రవేత్తల కృషి అభినందనీయం.గత నాలుగేళ్లుగా రాత్రింబవళ్లు పరిశీలించి, పరిశోధించి గతంలో జరిగిన పొరపాట్లను అవరోధాలను అధిగమించి చంద్రయాన్-3ని సమర్థవంతంగా రూపొందించారు. చంద్రయాన్-2తో చేసిన ప్రయోగం చివరి దశలో విఫలం కావడంతో ఈసారి భారత్ అంతరిక్ష పరిశోధనా సంస్థ పకడ్బందీగా సిద్ధమైందనే చెప్పొచ్చు. ఆనాటి వైఫల్యాలను దృష్టిలో ఉంచుకొని పాఠాలు నేర్చుకొని చంద్రయాన్-3ను ప్రయోగించింది. ప్రధానంగా చంద్రయాన్-3 ల్యాండర్‌ను వైఫల్యాలకు ఉన్న ఆస్కారాలను విశ్లేషించుకొని వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో ఇస్రో చంద్రయాన్-3ని రూపొందించింది. అనుకోని అవాంతరాలు తలెత్తినా ల్యాండర్ విజయవంతంగా చంద్రుడిపై దిగేలా కసరత్తు చేపట్టారు. ల్యాండింగ్ చివరి అంకంలో మూడుమీటర్ల ఎత్తు నుంచి చంద్రుడి ఉపరితలంపై ఒక్కసారిగా పడిపోయినా ఆ సమయంలో వచ్చే ఒత్తిడిని, కుదుపును తట్టుకునేలా స్టాండ్‌కు ఉన్న నాలుగు పోల్స్‌ను డిజైన్ చేశారు. దాంతో వ్యోమనౌక నిర్మాణం దానిలోపలి పరికరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తయారు చేశారు. అంతేకాదు ల్యాండర్ పాదం భాగాన్ని డాంపర్ పదార్థంతో రూపొందించడంతో అది కుదుపులో చాలా భాగాన్ని అబ్జార్బ్ చేసుకునేలా తయారు చేశారు. చంద్రుడి ఉపరితలం ఎగుడుదిగుడుగా ఉంటుంది. పెద్దరాళ్లు కూడా ఉండొచ్చు. చదునుగా లేని ఉపరితలంపై ల్యాండర్ దిగితే వ్యోమనౌక స్థిరంగా ఉండకపోవడం, వాలు ఎక్కువగా ఉన్నచోట దిగితే ల్యాండర్ పక్కకు ఒరిగిపోయే ప్రమాదం ఉంది. ల్యాండింగ్ తర్వాత ర్యాంప్ విచ్చుకొని చంద్రుని ఉపరితలానికి ఆనుకోవాలి. దాని మీద నుంచి జారుతూ విక్రమ్ ల్యాండర్‌లోని రోవర్ క్రమేణా ఉపరితలాన్ని చేరుకుంటుంది. ల్యాండింగ్‌చోట వాలు ఎక్కువగా ఉంటే ర్యాంప్ పొడవు సరిపోదు. ల్యాండర్ స్థిరత్వం లేకఅటూ ఇటూ ఊగుతూ ఉంటే వెలుపలికి వచ్చేటప్పుడు రోవర్ బోల్తా పడవచ్చు. దీనిని అధిగమించేందుకు వాలుకు తగ్గట్టు ల్యాండర్‌కు సర్దుబాటు కాళ్లు అమర్చారు. ఒక కాలు పొరపాటున చిన్నపాటి గోతిలో పడినా ఇబ్బంది ఉండదు. కాలు పొడవును ల్యాండర్ పెంచుకొని స్థిరత్వం సాధిస్తుంది. చంద్రయాన్-2లో ఫ్రంట్‌ఫేసింగ్ కెమెరా ఏర్పాటు చేశారు. అయితే అది అప్పట్లో తీసిన ఫొటోలను కమ్యూనికేషన్ వ్యవస్థ అప్పటికప్పుడు భూమికి చేరవేయలేకపోయింది. ఆ లోపాలను సరిదిద్దుతూ ఇప్పుడు చంద్రయాన్-3లో కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేయడం వల్ల ల్యాండర్ తీసిన ఫొటోలను శరవేగంగా చేరవేయడం సాధ్యమవుతుంది. ల్యాండింగ్ క్రమంలో జాబిల్లి ఉపరితలంపై ఎదురయ్యే అవరోధాలను గుర్తించి వాటి నుంచి అధిగమించేందుకు 'అటానమస్ హాజార్డ్ డిటెక్షన్ అవాయిడెన్స్'లాంటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక చంద్రయాన్-2లో టెలిమెట్రిక్ డేటా రేటు ఒక కేబీపీస్ ఉండగా, ఇప్పుడు దానిని ఏకంగా నాలుగు రెట్లు పెంచారు. ఇక ఎక్స్‌బాండ్ డేటా రేట్‌ను రెండువందల కేబీపీఎస్ నుంచి ఐదువందలకు పెంచారు. దీంతో కీలక ఘట్టాలను వేగంగా సేకరించి భూకేంద్రానికి పంపడానికి వీలయ్యే విధంగా రూపకల్పనచేశారు. అలాగే మరి కొన్ని కమ్యూనికేషన్ యాంటిన్నాలను చంద్రయాన్-3లో ల్యాండర్‌కు అమర్చారు. దీంతో వ్యోమనౌక ధృక్కోణం ఎటువైపు ఉన్నా కంట్రోల్ సెంటర్ కమ్యూని కేషన్ నిరాటంకంగా కొనసాగుతుంది. మొత్తం మీద చంద్రయాన్-2 ప్రయోగంలో జరిగిన లోపాలు కూలంకషంగా పరిశీలించి పరిశోధించి అలాంటి సమస్యలు ఎదురైతే ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించేలా చంద్రయాన్-3ను రూపొందించారు. చంద్రుడిపై విజయ వంతంగా దిగేలా అన్ని జాగ్రత్తలు చంద్రయాన్-3లో తీసుకోవడంవల్లనే అనుకున్న సమయానికి అనుకున్నట్లుగా ఖచ్చితంగా చంద్రునిపై ల్యాండ్ అయ్యేందుకు వీలుకలిగింది. ఇస్రో శాస్త్రవేత్తల అవిరామ కృషి, అధ్యయనాలు, పరిశోధనలు ఈ విజయం వెనుక దాగిన ప్రధాన అంశాలు. భారత్‌తో పోటీపడి మరీ రష్యా హడావిడిగా చేసిన లూనా 25 ప్రయోగం విఫలం కావడం, రష్యాతో పోలిస్తే తక్కువ ఖర్చుతో భారత్ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిష్టను మరింత పెంచింది. ప్రపంచ దేశాలు సైతం ఎంతో ఆసక్తితో ఎదురు చూసిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌మేటి అన్న స్థానానికి చేరింది.

> భగవంతుడు బంధువులను ఇస్తాడు కానీ, మిత్రులను ఎన్నుకునే అవకాశం మనకే ఇచ్చాడు. దానిని సద్వినియోగం చేసుకున్నవాడే సుఖంగా జీవిస్తాడు.
>
> 
>
> నేతాజీ

> యజమానికి, నాయకుడికి మాటల్లో తేడా ఉంటుంది. యజమాని ఇక మీరు వెళ్లవచ్చు అని అంటాడు. నాయకుడైతే ఇక మనం వెళదాం అంటాడు.
>
> 
>
> జాన్సన్

# ప్రజావాక్కు



## గులాబీలో భగ్గుమన్న అసమ్మతి

బిఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత జాబితాలో తమ పేరు లేనందుకు తెలంగాణ పార్టీ అభ్యర్థులు, ఆశావాదులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. అసలు అర్థంకావడం లేదు. ఎందుకు కన్నీరు అని. ఎమ్మెల్యే కాకపోతే జీవితం వ్యర్థమా? అదేనా వారి ఊపిరి, గుండె చప్పుడు?ఎందుకు ఇంత వ్యామోహం?ఒకసారి పదవి అనుభవించిన తర్వాత మద్యం సేవించినవారి లాగ రాజకీయ మత్తులో ఊగుతుంటారు. మళ్లీ అదిలేకపోతే పిచ్చిగా ప్రవర్తించి, కన్నీరుకార్చి వారిఅభిమానుల సానుభూతిపొందుతారు. ఇదేనా జీవితం?ఎందుకు అధికారం అంటే ఇంత మత్తు? ఎమ్మెల్యే లేకుంటే ప్రజాసేవ చేయలేరా? ఎంత మంది ఏ పదవి, అధికారంలేకుండా ఎంతో కాలంగా సమాజ సేవచేస్తున్నారు. అందుకే ప్రభుత్వ ప్రజల పన్నుల డబ్బుతో కోట్లు సంపాదిస్తున్నారని నాయకులతో ప్రజలు ఎన్నికలప్పుడు డబ్బు ఖర్చు పెట్టిస్తున్నారు మనడబ్బేగా అని.అందుకే ఓట్ ఫర్ నోటా నినాదం ప్రచారమైంది.ఈ సంస్కృతి ఎలామారు తుంది.ఎలామార్చాలి. రాజకీయాల్లో అవినీతి ఉన్నంతవరకు ఇది మారదు.

-డాక్టర్ జయప్రకాశ్‌రెడ్డి, నల్గొండ జిల్లా

## పసలేని ప్రసంగం

స్వాతంత్ర్య దినోత్సవం రోజు 90 నిమిషాల పాటు ప్రసంగించిన ప్రధాని ఎవరూలేరు. రాజకీయాలు మాట్లాడి ప్రతి పక్షాలను విమర్శించిన ప్రధాని కూడా ఎవరూ లేరు. ఇవన్నీ చేసిన ఏకైక ప్రధాని నరేంద్రమోడీ. తన గంటన్నర ప్రసంగంలో ఆయన సగభాగం సొంత డబ్బా కొట్టుకోవడానికి, ప్రతిపక్షాలను విమర్శించడానికి, రాజకీయాల కోసమే ప్రాధాన్యత నిచ్చారు. 90 నిమిషాల పాటు ఆయన చేసిన ప్రసంగంలో కొత్తదనం ఏమీలేదు. అయినా మోడీ చేసిన ప్రసంగం గురించి గొప్పగా చెప్పుకుంటూ మురిసిపోతున్నారు. బిజెపి శ్రేణులు అయితే ప్రసంగం ఎంతసేపు చేస్తారన్నది కాదు. ప్రసంగంలో విషయం ఏముంది అనేదే ముఖ్యం.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## డాక్టరేట్‌లకు ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, గురుకులాలు, డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా డాక్టరేట్ పట్టా పొందిన ఎస్సీ,ఎస్టీ వికలాంగులకు కాంట్రాక్టు, పార్ట్‌టైం బోధనలో ప్రాధాన్యత కల్పించాలి.

-రాపాక రవీందర్, జనగాం

## భాష-భావం

మహిళలనుద్దేశించి న్యాయమూర్తులు తమతీర్పుల్లో, ఆదేశాల్లో వాడకూడని పదాల్ని, పదబంధాల్ని క్రోడీకరించి అత్యున్నత న్యాయస్థానం ఒక పుస్తకాన్ని తెచ్చింది. అనాదిగా మహిళల పట్ల సమాజంలో నెలకొన్న ముద్రలను పురుషాధిక్య భావనలనుబలపరిచేలా న్యాయస్థానం భాష ఉండకూడదన్నది ముఖ్య ఉద్దేశ్యం.పతిత, పతివ్రత, స్త్రీ, సమాజ బలహీనత లాంటి విశేషణాలవల్ల అంతిమంగా ఆయా భావాలకు ఆమోదముద్ర లభించి,సమాజంలో స్థిరపడతాయి.న్యాయమూర్తుల తీర్పుల్లో కూడా ప్రభావం చూపుతాయి. నేరాన్ని చూసే పద్ధతిలో అవాంఛనీయ ధోరణికి అవకాశం ఉంటుంది. వీటిని సరిదిద్ది, నేడు సుప్రీం కోర్టు తమ భాషలో సంస్కారాన్ని నిలిపే కృషి చేయడం ముదావహం. మహిళాలోకం పట్ల సున్నితమైన సానుకూలమైన స్పందన. ఇదే విధంగా నేరాల్ని అభివర్ణించడంలో కూడా ముందడుగు వేయాలి.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

## ఆసక్తిగా విక్రమ్ ల్యాండింగ్

భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొని ఉంది. ఇస్రో జులై 14న ఈ ప్రయోగాన్ని చేపట్టింది. విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై దిగేక్షణాల కోసం ఇస్రో శాస్త్రవేత్తలతో సహా ప్రతి ఒక్కరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. చంద్రయాన్-2, తాజాగా రష్యా ప్రయోగించిన లూనా-25 క్రాష్ ల్యాండింగ్ నేపథ్యంలో ఇస్రో సైంటిస్టులు మరిన్నిజాగ్రత్తలు తీసుకొని లాండర్‌ను మృదువుగా చంద్రుని ఉపరితలంపై దించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శాస్త్రవేత్తలు భావించినట్లు అంతా సాఫీగాసాగి సాఫ్ట్ ల్యాండింగ్ జరిగితే చంద్రుని దక్షిణధ్రువం ఉపరితలంపై కాలు మోపిన తొలిదేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. ఈఘట్టం భారతీయులకే కాక యావత్ మానవాళికి అదొక చిరస్మరణీయ ఘట్టమే అవుతుంది.

-చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

## ఏది శాశ్వతం?

ప్రధానిని నేనే మళ్లీ మళ్లీ నేనే ఎన్నికవుతా? నేనుండగా ప్రత్యర్థులెవరూ ప్రధాన మంత్రి కాలేదంటున్నారు నరేంద్ర మోడీ. అది అసాధ్యం మహాఅయితే కొన్ని నెలలు కాకుంటే మరికొద్ది సంవత్సరాలు. ఆ తరువాత పదవి నుంచి దిగక తప్పదు, మోడీ మాజీ కాక తప్పదు. ఇప్పటికీ ఎంతో మంది ప్రధాన మంత్రులు వచ్చారు, పోయారు. అలానే నరేంద్రమోడీ కూడా.

-మిథునం, హైదరాబాద్

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# రాబోయే ఎన్నికల్లో పైచేయి ఎవరిది?

**మోడీ పది సంవత్సరాల పాలనపై ప్రజలకి అసంతృప్తి కలిగితే మరొక ఎనిమిది నెలల తరువాత భారతదేశానికి కొత్త ప్రధాని వచ్చే అవకాశం లేకపోలేదు. మోడీ వైఫల్యాలతోపాటు విభజన రాజకీయాలు హిందుత్వ అజెండా, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తులకు దేశసంపదను దోచిపెట్టడం అదుపులోకి రాని ద్రవ్యోల్బణం, రైతు సమస్యలు, మణిపూర్ హింస లాంటి అంశాలను ప్రజలలోకి తీసు కళ్లాలని ఇండియా కూటమి భావిస్తుంది. పార్టీలు ప్రభుత్వాలు రాజకీయాల కోసం కాకుండా ప్రజలకోసం నిజాయితీగా అంకితభావంతో చిత్తశుద్ధితో పనిచేస్తే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి 2047వరకు వేచి చూడవలసిన అవసరంలేదు. నవభారత నిర్మాణం కోసం నూతన ప్రభుత్వం కోసం వేచి చూద్దాం.**



డాక్టర్ తిరునవారి శేషు

సరిగ్గా ఎండలు మండేకాలంలో 2024ఏప్రిల్ మాసంలో 18వ లోక్‌సభ ఎన్నికలు దేశంలో వేడి పుట్టించబోతున్నాయి. ఒక దశాబ్దకాలం పాటు కొనసాగిన తన పాలనపై మోడీ ప్రజల తీర్పుకోరబోతుంటే కొత్తగా ఏర్పాటైన ఇండియా కూటమి మోడీని హ్యాట్రిక్ విజయం సాధించకుండా అడ్డుకోవాలని రాజకీయ వ్యూహాలను రూపొందించుకుంటున్నవేళ రాబోయే లోక్‌సభ ఎన్నికలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకోబోతున్నాయి. యూపిఏ, ఎన్డీయేకి ఒక దశాబ్దకాలంపాటు అవకాశం ఇచ్చిన ఓటర్లు రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ఎవరికి అవకాశం ఇవ్వబోతున్నారు? గత రెండు లోక్‌సభ ఎన్నికలలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాలసినపూర్తి మెజార్టీని సాధించిన బిజెపి మరొకసారి మెజార్టీ సాధిస్తుందా లేక ఇండియా కూటమి అధికారంలోకి రాగలుగుతుందా అనే చర్చ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా జరుగుతుంది.2014 లోక్‌సభ ఎన్నికలలో యూపిఏ 10 సంవత్సరాల పాలనపై ప్రజా వ్యతిరేకతతోపాటు అవినీతి ప్రధాన అంశంగా 2019 లోక్‌సభ ఎన్నికలలో జాతీయవాద హిందుత్వ అజెండా ప్రధాన అంశంగా ఎన్నికలను ప్రభావితం చేసి గెలుపు ఓటములను నిర్ణయిస్తే2024 లోక్‌సభ ఎన్నికలకు మాత్రం ఏకూటమికి ఆ స్థాయి ప్రచారాస్త్రాలు కనపడకపోవడం వలన ఎన్నికలలో ఎవరు గెలుస్తారనే అంశంపై స్పష్టత కొరవడిందనే చెప్పాలి. కానీ రాబోయే లోక్‌సభ ఎన్నికలలో అధికారం కోసం రెండు కూటములు బలంగా ఎన్నికల రణక్షేత్రంలో తలపడబోతున్నాయనే ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి.లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలంగాణ, మిజోరం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో పార్టీల గెలుపు ఓటములు లోక్‌సభ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఈ ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచిన పార్టీకి లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవడానికి ఒక సానుకూలమైన రాజకీయ వాతావరణాన్ని కల్పిస్తుంది అనటంలో సందేహం లేదు. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత గెలవటం మరిచిపోయిన కాంగ్రెస్ పార్టీకి హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, శాసనసభ ఎన్నికలలో గెలుపు రాజకీయంగా ఆ పార్టీకి జీవనం పోసినాయనే చెప్పాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపిపై కాంగ్రెస్‌పార్టీ సాధించిన విజయాన్ని అంత తేలికగా కొట్టిపారేయలేం. శాసనసభ ఎన్నికలు జరగబోతున్న ఐదురాష్ట్రాల్లో తెలంగాణ మిజోరాంలో ప్రాంతీయ పార్టీలైన బిఆర్‌ఎస్ మిజోనేషనల్ ఫ్రంట్ అధికారంలో ఉంటే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ మధ్యప్రదేశ్‌లో బిజెపి అధికారంలో ఉన్నాయి. రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ బిజెపిలు ముఖాముఖి తలపడుతుంటే తెలంగాణ మిజోరం రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలలో 85లోక్‌సభ స్థానాలు ఉంటే 65 లోక్‌సభ స్థానాలు బిజెపి చేతిలోనే ఉన్నాయి. కేవలం ఆరు లోక్‌సభస్థానాలు మాత్రమే కాంగ్రెస్‌చేతిలో ఉన్నాయి. అంటే 2019లో జరిగిన శాసనసభ ఎన్నికలలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటుచేసినా మెజార్టీ లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంలో కాంగ్రెస్‌పార్టీచతికిలపడింది. కాబట్టి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌బలం పుంజుకోవాలంటే ఈ ఐదురాష్ట్రాలలో మెజార్టీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలవాల్సిన అవసరం ఉంది. బిజెపి కూడా తన పూర్వపుబలాన్ని నిలబెట్టుకోవాలంటే ఈ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచితీరాలి. కాబట్టి ఈ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలుపు అటు కాంగ్రెస్‌కి ఇటు భారతీయ జనతా పార్టీకి జవన్మరణ సమస్యగా మారిపోయిందనే చెప్పాలి. 2024లోక్‌సభ ఎన్నికలలోమూడోసారి మోడీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడంతోపాటు కాంగ్రెస్ బలపడాల్సిన అవస



రాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం గెలుపు కోసం అన్ని పార్టీల కంటే ముందుగానే అస్త్రాలను సిద్ధంచేసుకున్నట్లుగా కనపడుతుంది. కాంగ్రెస్ పార్టీ తాను ఒంటరిగా బిజెపిని ఓడించలేమని గ్రహించి యుపిఏ భాగస్వామ్య పార్టీలతో పాటుబిజెపిని వ్యతిరేకిస్తున్న విపక్ష పార్టీలతో కలిసి 26 పార్టీలతో ఇండియా కూటమిని ఏర్పాటు చేసింది.ఇండియా కూటమికిపోటీ బిజెపి కూడా 38పార్టీలతో ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేయాలని ప్రయత్నిస్తుంది. పార్టీల సంఖ్యాపరంగా కాకుండా రాజకీయంగా చూస్తే ఎన్డీయే కూటమి కంటే ఇండియా కూటమి బలంగా కనిపిస్తుంది. ప్రస్తుతం17వ లోక్‌సభలో ఇండియా కూటమికి 15మంది ఎంపిల బలం,ఎన్డీయే కూటమికి 330మంది ఎంపిల బలం కలిగి ఉన్నాయి. కానీ 18వ లోక్‌సభ ఎన్నికలలో ఈ బలాబలాలలో మార్పులు వచ్చే అవకాశం లేకపోలేదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్,కర్ణాటక, గుజరాత్,బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ లాంటి పది రాష్ట్రాల నుండి బిజెపి ప్రస్తుత లోక్‌సభలో 244 మంది ఎంపిల బలాన్ని కలిగి ఉంది.కానీ రాబోయే ఎన్నికలలో బిజెపి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్,రాజస్థాన్,బీహార్, కర్ణాటక, హర్యానా, జార్ఖండ్‌లలో తన ఎంపి స్థానాలను కోల్పోయే అవకాశాలు కనపడుతున్నాయి. ప్రస్తుతానికైతే బిజెపి యూపి, గుజరాత్‌లలో మాత్రమే బలంగా కనిపిస్తుంది.ఒకవేళ సమాజ్‌వాది పార్టీ లోక్‌సభ ఎన్నికలనాటికి యూపిలో మరింత బలపడితే బిజెపికి రాజకీయంగా మరింతనష్టం జరుగుతుంది.అలాగే గుజరాత్‌లో కాంగ్రెస్ ఆమ్‌ఆద్మీపార్టీల మధ్య పొత్తుకుదిరితే గుజరాత్ లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో స్వీప్ చేసిన భారతీయ జనతాపార్టీకి ఈసారి ఆపరిస్థితి ఉండకపోవచ్చు. మరొకవైపు మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటకలలో ఉన్న 82 లోక్‌సభ స్థానాలలో కాంగ్రెస్ తన లోక్‌సభ స్థానాలసంఖ్యను పెంచుకోగలిగితే బిజెపికి నష్టం జరుగుతుంది. ప్రస్తుత లోక్‌సభలో ఈ మూడురాష్ట్రాల నుండికాంగ్రెస్ ప్రాతినిధ్యం కేవలం రెండు లోక్‌సభ స్థానాలకే పరిమితం. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ సమాజ్‌వాదిపార్టీ ఆర్జెడి తమ లోక్‌సభ స్థానాలను పెంచు కొని టిఎంసి,డిఎంకె శివసేన జెడియులు తమ లోక్‌సభ స్థానాలను నిలబెట్టుకుంటే ఇండియా కూటమి ఎన్డీయేకిబలమైన పోటీదారుగా నిలబడే అవకాశం లేకపోలేదు. ఉత్తరాన యూపి, ఎంపి రాజస్థాన్,హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌లో తూర్పున మహారాష్ట్ర,గుజరాత్‌లో బిజెపికి లోక్‌సభ స్థానాలు తగ్గే అవకాశం ఉంది. అలాగే దక్షిణాదిలో బిజెపి తనపూర్వపు బలాన్ని కోల్పోవడమేకాదు పుంజుకునే అవకాశం లేకపోవడం వలన బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మెజార్టీ సాధించలేకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఒక జాతీయ సర్వేసంస్థ ప్రకారంగా ఎన్డీయే కూటమికి 255లోక్‌సభ స్థానాలు ఇండియా కూటమికి 225లోక్‌సభ స్థానాలు గెలుచుకునే అవకాశం ఉందని చెబుతుంది. ఒకవేళ అదే నిజమైతే తటస్థ పార్టీలుగా వ్యవహరిస్తున్న వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ బిజూ జనతాదళ్, భారత రాష్ట్రసమితి పార్టీలు ప్రభుత్వ ఏర్పాటులో కీలకం కాబోతున్నాయి. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల కంటే రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి బలంగా కనిపిస్తుంది.విపక్ష ఇండియా కూటమిలో పార్టీల మధ్యవైరుధ్యాలు ఉన్నప్పటికీ ఎన్నికల నాటికి అవి సర్దుకోవచ్చు. ఒకవేళ సర్దుకోకపోయినా ఆ వైరుధ్యాల ప్రభావం పెద్దగా కూటమి విజయ అవకాశాలను దెబ్బతీయకపోవచ్చు.విపక్ష ఇండియా కూటమి బలంగా కనిపిస్తున్నా ఈ కూటమి నుండి మోడీని దీటుగా ఎదుర్కొనే నాయకుడు ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవ్వటమే కాదు ఈప్రశ్నకు ఇప్పటికిప్పుడు సరైన సమాధానంకూడా దొరకటం లేదు. మోడీకి ప్రత్యామ్నాయంగా నిలబడేసరితూగే వ్యక్తిఇండియా కూట మిలో కనిపించడం లేదు కానీ దేశవ్యాప్తంగా పాపులారిటీ కలిగిన రాహుల్‌గాంధీ, నితీష్‌కుమార్ స్టాలిన్‌లాంటి నేతలు ఇండియా కూట మిలో అనేకమందిఉన్నారు.ఇక ఇండియా కూటమిలో మోడీకి ధీటైన ప్రధానమంత్రి అభ్యర్థులుగా నితీష్ కుమార్, ఎంకె స్టాలిన్ తెరపైకి వచ్చే అవకాశం ఉంది. వీరిద్దరిలో స్టాలిన్ ఆమోదయోగ్యమైన వ్యక్తి గా కనిపించవచ్చు. మోడీ పది సంవత్సరాల పాలనపై ప్రజలకి అసంతృప్తి కలిగితే మరొక ఎనిమిది నెలల తరువాత భారతదేశానికి కొత్త ప్రధాని వచ్చే అవకాశం లేకపోలేదు. మోడీ వైఫల్యాలతోపాటు విభజన రాజకీయాలు హిందుత్వ అజెండా, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తులకు దేశసంపదను దోచిపెట్టడం అదుపులోకి రాని ద్రవ్యోల్బణం, రైతు సమస్యలు, మణిపూర్ హింస లాంటి అంశాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని ఇండియా కూటమి భావిస్తుంది.పార్టీలు ప్రభుత్వాలు రాజకీయాల కోసం కాకుండా ప్రజలకోసం నిజాయితీగా అంకితభావంతో చిత్తశుద్ధితో పనిచేస్తే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి 2047వరకు వేచి చూడవలసిన అవసరంలేదు. నవభారత నిర్మాణం కోసం నూతన ప్రభుత్వం కోసం వేచి చూద్దాం. ●

# 'బ్రిక్స్' బంధం బలపడేనా?

కనుమ ఎల్లారెడ్డి

బ్రిక్స్ అంటే ఐదు దేశాల కలయిక. ఇవన్నీ ఒక కూటమిగా ఆవిర్భవించాయి.అవి బ్రెజిల్, రష్యా,ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా. ముందు నాలుగు దేశాలే ఉండగా ఐదో దేశంగా 2010 ఏప్రిల్‌లో సౌత్ ఆఫ్రికా చేరడంతో బ్రిక్ బ్రిక్స్‌గా మారింది. బ్రిక్ 2006లో ఏర్పడింది. తదుపరి సౌత్ ఆఫ్రికా చేరడంతో 2010లో బ్రిక్స్‌గామారింది. దీని ప్రధానకార్యాలయం చైనాలోని షాంఘైలో ఉంది.ఇక కొద్ది రోజుల్లో బ్రిక్స్ సమావేశం జరగనుంది. బ్రిక్స్‌లో చేరడానికి ఇరాన్ సైతం ఉత్సాహపడుతోంది. దాదాపు పది, పదకొండు దేశాలు బ్రిక్స్‌లో చేరడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. చేరడం బాగానే ఉంది. బ్రిక్స్ ఆశయాలు నెరవేర్చడానికి కూడా ముందుండాలి. ఏదో ఒకదానిలో చేరామా అనే మిషపోవాలి. నేడు చాలా దేశాలు అదే పరిణామక్రమంలోనే ఉన్నాయి. ఈ నెలలో జరగబోయే చర్చలలో అంతర్జాతీయ, ప్రాంతీయ, పరస్పర ప్రయోజనం మొదలగు అంశాల్లో చర్చ ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఒకదేశం మరో దేశం పట్ల గౌరవభావం, సౌభ్రాతృత్వం ఉండాలి. ప్రాంతీయ అంటే ఆయా దేశాలలోని కొన్ని ప్రాంతాలు అభివృద్ధికి వీలుగా ఉండే అక్కడ ప్రయోజనం కొరకు ఆయా దేశాలతో సంబంధాలకొరకు చర్చ జరుగుతుంది. ఇందు నిమిత్తమే బ్రిక్స్‌దేశ సభ్య దేశమైన రష్యా, ఇరాన్‌తో సంబంధం బలోపేతం చేసుకొనుటకు వాణిజ్య,రవాణా రంగాలలో ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకొనుటకు చేతులు కలిపాయి. ఈ విషయంపై ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ,రష్యా అధ్యక్షుడు పుతిన్,తెలిఫోన్ చర్చలు జరిపారు. రెండు దేశాలు తమ మధ్య సహకారం బలపడాలని కోరుకుంటున్నాయి. ఇరాన్‌లోని షారాఫ్ మసీదుపై గుర్తు తెలియని దుండగుల దాడికి పుతిన్ సానుభూతి వ్యక్తంచేశాడు. ప్రస్తుతం బ్రిక్స్‌లోఉన్న ఐదు దేశాలు బలమైనవే.అయితే ఇటీవల రష్యా, చైనాతో అంటకాగుతోంది. భారత్, రష్యా దేశాల మధ్య స్నేహ సంబంధాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈసారి సదస్సుకు చైనా, ఇండియా, నేతలు పరస్పరం కలిసే అవకాశంఉంది. దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామపోస్ ఆహ్వానం మేరకు బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు అవుతున్నట్లు చైనా విదేశాంగ ప్రతినిధి హువాచున్ యింగ్ వెల్లడిచేశారు. బ్రిక్స్‌సదస్సులో పశ్చిమ దేశాలపైన చర్చలు సాగవచ్చు.రష్యా, చైనా, దౌత్యపరఅంశాలపై చర్చలుకూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఉక్రెయిన్‌తో రష్యాచేస్తున్న యుద్ధంపై సదస్సులో ఒక కార్యాచరణ ప్రారంభించాలి.బ్రిక్స్‌లో దేశాలు సయోధ్యగా ఉంటేనే ఆ దేశాలు చర్చించే అంశాలు నెరవేరుతాయి.ఆయా దేశాలలో లుకలుకలు మొదలైతే సమావేశం జరిగినా అవి మొక్కుబడిగా ఉంటాయి. దక్షిణాఫ్రికాలోని జోహాన్స్‌బర్గులో ప్రస్తుతం బ్రిక్స్‌సమావేశం మూడురోజుల పాటు జరగనుంది. ఆ సదస్సుకు పలు దేశాలు రావాలని నిర్ణయించాయి. బ్రిక్స్ సభ్యత్వం కొరకు ఇరాన్, వెనిజుల, క్యూబా, ఇండోనేషియా, వియత్నం, నైజీరియా మోరాకో, అల్జీరియా, బోలివియా, థాయిలాండ్ మొదలుగు దేశాలున్నాయి.ఈ దేశాలు చేరడం చాలావరకు బాగానే ఉంది. కాని కొన్ని దౌత్య అంశాలు దేశాల మధ్య ఉన్నాయి. సాధారణంగా బ్రిక్స్‌లో ఆధిపత్యం చైనా వహించాలనే బలమైన కోరిక ఉంది. బ్రిక్స్‌లో చైనా పాచికలు భారత్ ముందు సాగవు. అందుకని చిన్న దేశాలను చైనా మచ్చిక చేసుకోవాలనే తలంపుతోఉన్నట్లు భోగట్ట.దేశాలన్నీ చేరితే ఏమి ప్రయోజనం? ముందు ఏదేశమైతే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపగలదో అప్పుడు బ్రిక్స్‌కు ఉపయోగం. ఇప్పుడే దాదాపు 10,11దేశాలు బ్రిక్స్‌లో చేరడానికి ఉత్సాహం చూపిస్తున్నాయి. ఈ చిన్నదేశాల వాదన రష్యాపట్టించుకోదు.ఉక్రెయిన్‌కు నచ్చ చెపుతాయి.కానీ ఆచరణలో సాధ్యం కాని విషయం. బ్రిక్స్‌లో దేశాలు బలపడాలంటే ఒక అర్థవంతమైన ప్రణాళికఉండాలి. సదస్సుకు హాజరై సహకారం పెంపొందించుకున్నాం అనే మాట కాకుండా దేశాలన్నీ ఒకే మాట మీద నిలబడాలి. ముందు అంతర్జాతీయ శాంతి ఏర్పడే దిశగా చర్చలు సాగాలి. అంతర్జాతీయ విభజన దేశాల మధ్యచిచ్చు పెట్టి అధోగతిపాలు చేస్తుంది. బ్రిక్స్ సదస్సుకు హేమాహేమీ దేశాలు అంటే ప్రస్తుతం ఉన్న దేశాలు, చాలా వరకు చిన్న,చితక దేశాలు హాజరవుతున్నాయి. వాటిలో చాలావరకు తమ రక్షణ కొరకు, భద్రత కొరకు, పెద్ద దేశాలతో దౌత్యం నెరపడానికి ఇష్టం చూపుతున్నట్లు ఉన్నాయి. ఏ దేశాల కూటమి అయినా ముందు అవి చేసే అంశాలపై ఒక ప్రణాళిక విడుదల చేయాలి. దౌత్యపర,వాణిజ్యపర, పరస్పర సహకారం, భాగస్వామ్యం అనే ఊకదంపుడు మాటలతో కాకుండా సమష్టిగా, సమైక్యంగా పోరాడాలి. లక్ష్యం సిద్ధించే వరకు ఒకటిగా ఉండాలి. ఇప్పుడు బ్రిక్స్‌లో దాదాపు 11 దేశాలు చేరుతుండడంతో అది విస్తృతమైంది.అయితే దేశాలు సఖ్యతగా లేకుంటే యుద్ధ వాతావరణం ఏర్పడుతుంది. బ్రిక్స్‌సదస్సులో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం నిలుపుదల చేసేవిధంగా అందరూ ఆమోదించాలి.●


# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగనభట్ల

నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారం. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపురూపమైన పదార్థం. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరు అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు, ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టిగడ్డలా ఉంటుంది భూమి. భూమి మీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు, గాలి తరువాత ముఖ్యమైనది నీరు. నీరు మూడు రూపాలలో ఉంటుంది. ఘనరూపం అంటే మంచు గడ్డల రూపంలోనూ, ద్రవ రూపంలో అంటే సముద్రాలు, నదులు, తటకములు మొదలైనవి, వాయురూపంలో భూమండలంపై 71 శాతానికిపైగా ఆవరించి ఉంది. కొత్త కొత్త సమ్మేళన పదార్థాలతోను, విషపూరిత రసాయన పదార్థాలతోను నీరు కలుషిత మవుతున్నది. అలా కలుషితమైన జలము, జలచక్రం ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థాలను, అనగా రసాయన పదార్థాలను కూడా కలుపుకొని వాయురూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించగానే ద్రవించి తిరిగి వర్షరూపంలో, తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినప్పుడు రంగులలో వర్షం కురవడం, ఆమ్లవర్షాలు కురవడం, సర్వసాధారణం. దాంతో ప్రకృతికి అపార నష్టం జరుగుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి. ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త ద్రావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవరసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచినీళ్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహుదూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి తాగునీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం.




మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిణామంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99 శాతం ఉన్నది ఉప్పునీరే. ఇది 97 శాతం సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది. తాగడానికి పనికొచ్చే నీరు ఒక శాతం మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86శాతం, నదుల్లో 0.02శాతం ఉండగా మిగిలినవి భూగర్భజలాలు. ప్రపంచవ్యాప్తంగా తాగడానికి ఉపయోగపడే నీరు 0.3 శాతం మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా నీటిని వృధా చేస్తున్నాం. నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే మనకు అందుబాటులో ఉన్న నీటిని వృధా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని, ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ (కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారని, దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టూ కాపలా కాసే పరిస్థితి ఉంటుందని తలంటుకోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడిగుండుతో జీవిస్తారనీ, స్త్రీ, పురుషులందరూ రోజూ తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు. భారత్‌తో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు, నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. భారత చరిత్రంతా జలవనరులతోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించుకోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసుకనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృధా చేయడం సృష్టికి,భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవడం,వృధాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వినియోగం, తదితరాలన్నింటికీ ప్రాధాన్యమివ్వాలి. ●




# ఇది ఎంతోమంది కఠోర శ్రమ

## - ఇస్రో ఛైర్మన్ సోమనాథ్



**శ్రీహరికోట (తడ), ఆగస్టు 23 ప్రభాతవార్త:** చంద్రయాన్-3 ప్రయోగ విజయం ఎంతో మంది కఠోరశ్రమగా ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ పేర్కొన్నారు. మిషన్ ఆపరేషన్ కాంప్లెక్స్‌లో ఆయన శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రయాన్ ప్రాజెక్టు డిజైన్‌లో ముందు నుంచి ఉత్సాహంతో పాల్గొన్న వారిని గుర్తు చేసుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్, కమలాకర్, కోటేశ్వరరావు వంటి వారిని ఆయన అభినందించారు. ప్రస్తుతం యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్న శంకరన్ వంటివారు బాగా కష్టపడ్డారని చెప్పారు. చంద్రయాన్-1, చంద్రయాన్-2 ప్రయోగాలలో పాలుపంచుకున్న అప్పటి శాస్త్రవేత్తలు, చంద్ర యాన్-3 ఇంతటి విజయం సాధించడానికి మార్గం చూపించారని ఛైర్మన్ చెప్పారు. చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ తర్వాత ఇస్రో ఛైర్మన్ సోమనాథ్‌ను ఎంతోమంది అభినందించారు.

**నాలుగేళ్ల ముందే సాధించాల్సింది - శంకరన్**

నాలుగేళ్ల ముందే 2019లోనే చంద్రయాన్-2 ద్వారా ఈ అద్భుత విజయం సాధించాల్సిందని యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ శంకరన్ పేర్కొన్నారు. చంద్రయాన్-2 ప్రయోగం చివరి క్షణాల్లో మాత్రమే విఫలమైందన్నారు. ప్రస్తుతం చంద్రయాన్-3 ప్రయోగం జరిగినప్పుడు తనను మాట్లాడమంటే సాఫ్ట్ ల్యాండింగ్ తర్వాతే మాట్లాడతానని చెప్పానని, ఇప్పుడు ఈ విజయం తర్వాత గొప్పగా మాట్లాడుతున్నట్లు చెప్పారు. 44 ఏళ్లుగా ఇటువంటి సక్సెస్‌ను ఎదురు చూసినట్లు శంకరన్ అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనను చంద్రయాన్-3 ప్రయోగ విజయం అంచనాలు పెంచేసిందన్నారు. విమర్శకులు కూడా తమకు ఉపయోగపడ్డారని, ప్రజలు గట్టి నమ్మకం పెంచుకున్నందు వల్లే ఈ విజయం సాధ్యమయిందన్నారు. శంకరన్ మాట్లాడుతున్నంత సేపు సహచర శాస్త్రవేత్తలు ఆనందంతో చప్పట్లు కొడుతూనే ఉన్నారు.

**టైమ్‌లైన్ ప్రకారమే అంతా సవ్యంగా - వీరముత్తువేల్**

చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ టైమ్‌లైన్ ప్రకారమే సవ్యంగా జరిగిందని ప్రాజెక్టు డైరెక్టర్ వీరముత్తువేల్ తెలిపారు. చంద్రునిపై పరిశోధనలు చేసే నాలుగో దేశంగా భారత్ అవతరించిందని ఆయన అంటూ నావిగేషన్ కంట్రోల్, ఇంజనీరింగ్ సిబ్బంది, రివ్యూ కమిటీ, ప్రాజెక్టు అధికారులు ఎంతో గొప్పగా సహకరించినట్లు చెప్పారు. ఈ సంక్లిష్టమైన ప్రక్రియను అందరి సహకారంతోనే సాధించామన్నారు. మిషన్ ఆపరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తమ బృందం సభ్యులు ఏ తప్పు లేకుండా అనుకున్నట్లు విధులు నిర్వహించడం వల్లనే చంద్రయాన్-3 నూటికి నూరుశాతం విజయవంతమైందన్నారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కల్పన తన ప్రసంగంలో ఇది సంతోషకరమైన రోజుగా అభివర్ణించారు. చంద్రయాన్-3 బృందం పనితీరుతో పాటు ఇస్రో పెద్దల సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహం వల్లనే ఈ ఘన విజయం సాధ్యమయిందని ఆమె అన్నారు.

# చంద్రునిపై మానవ సహిత ప్రయోగం చేస్తాం



## అవసరమైతే ఇతర దేశాలకు కూడా సహకరిస్తాం..

## ఇక మరిన్ని గ్రహాల పరిశోధనలు: ప్రధాని మోడీ

**శ్రీహరికోట (తడ), ఆగస్టు 23 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన చరిత్ర సరికొత్త ప్రయోగాలు చేపడు తుందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 ప్రయోగ విజయం తర్వాత ఆయన జాతిని ఉద్దేశించి మాట్లాడారు. తాను బ్రిక్ దేశాల సదస్సులో దక్షిణాఫ్రికాలో ఉన్నప్పటికీ నా మనసంతా మీ వద్దే ఉందని దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రయాన్-3 ప్రయోగ విజయం నవ భారత నిర్మాణానికి నాందిగా చెప్పారు. 140 కోట్ల హృద యాలు ఈ రోజు ఉప్పొంగాయని, భారత్‌లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోందని మోడీ అన్నారు. ఒక మహా సముద్రాన్ని అలవోకగా ఈదిన అనుభవం తనకు వచ్చిం దన్నారు.

అమృత మహోత్సవం సమయాన ఇది మరపురాని గఘన విజయంగా చెప్పారు. భూమి మీద కలలు కంటే అది చంద్రునిపై సాకారమైందని మోడీ చెబుతూ ప్రస్తుతం చందమామపై ఇండియా ఉందని చెప్పారు. భవిష్యత్‌లో మానవ సహిత ప్రయోగాలను విజయ వంతంగా చేపడతామని, అందులో చంద్రుని మీద కూడా మనిషిని పంపించే అవకాశం లేకపోలేదన్నారు. ఈ ప్రయోగాలలో ఇతర దేశాలకు సహకరిస్తామని మోడీ చెప్పారు. చంద్రయాన్-3 ప్రయోగంతో ప్రపంచ రికార్డు సాధించడం మన ఉజ్వల భవిష్యత్తుకు దారి చూపిస్తుం దన్నారు. ఆదిత్య ఎల్1, శుక్రయాన్ వంటి ప్రయోగాలు కూడా ఇస్రో చేపడుతుందని చెప్పారు. చందమామ మనకు చాలా దూరంగా ఉండేదని, ఈ క్షణాన అది తమకు అందుబాటులో ఉందన్న నమ్మకం కుదిరింద న్నారు. చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. ఇది ఎప్పటి నుంచో దేశ ప్రజలు ఎదురుచూస్తున్న అపూర్వ ఘట్టమన్నారు. చంద్రునిపై ఉపగ్రహాన్ని దించడం కాకుండా దక్షిణ ధ్రువంపై ఎవరూ అడుగుపెట్టలేని చోట మన శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సృష్టించారని మోడీ అభినందించారు.


# చంద్రయాన్ విజయంతో దేశమంతా సంబరాలు



చంద్రయాన్-3 ప్రయోగ విజయంతో బుధవారం దేశ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. ఎన్నోవేల మంది విద్యార్థులు జయజయ ధ్వానాలతో సాఫ్ట్ ల్యాండింగ్ దృశ్యాలను వీక్షించారు. ప్రత్యేకించి భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలోనూ సంబరాలు మిన్నంటాయి. ఇకనకడి బ్రహ్మప్రకాష్‌హాలు, ఎంఆర్ కురుప్పు ఆడిటోరియంలలో ప్రత్యేకంగా షార్ ఉద్యోగులకు పెద్ద తెరలపై సాఫ్ట్ ల్యాండింగ్ దృశ్యాలు వీక్షించే అవకాశం కల్పించారు. శ్రీహరికోట సమీపంలోని అన్ని పల్లెలు, పట్టణాలలో బుధవారం సాయంత్రం టీవీలకు అతుక్కుపోయారు. సామాజిక మాధ్యమాలలోనూ ఈ దృశ్యాలు వీక్షిం చారు. ఇటీవల రష్యా ప్రయోగించిన లూనా-25 ఉపగ్రహం విఫలం చెందడంతో ఆ ప్రభావం మన చంద్రయాన్-3 మీద పడుతుందేమోనని అనేకమంది సందేహాలు ఉన్నాయి. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ నమ్మకంగా విక్రమ్ ల్యాండర్ గతంలోలాగా క్రాష్ ల్యాండింగ్ కాకుండా హ్యాపీ ఎండింగ్ ఇచ్చింది. ఇదిలావుంటే శ్రీహరికోటలో పనిచేసిన విశ్రాంత శాస్త్రవేత్తలు, బుధవారం మొత్తం యమబిజీగా గడిపారు. వివిధ టెలివిజన్ ఛానళ్లు వీరి అభిప్రాయాల కోసం పోటీపడ్డాయి. ఎంతోమంది విశ్రాంత శాస్త్రవేత్తలు అత్యంత విలువైన సమాచారాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా స్టుడియోలలోను, ఫోన్లలోను శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 గురించి అనేక వివరాలు సమగ్రంగా అందజేశారు. ఇక శ్రీహరికోటలో అతి త్వరలో జరగనున్న సూర్య పరిశోధనల కోసం ప్రయోగించే ఆదిత్య ఎల్1 గగన్‌యాన్ మానవ రహిత ప్రయోగాలపై శాస్త్రవేత్తలు దృష్టి కేంద్రీకరించారు.

# ఇక ల్యాండర్, రోవర్‌లు ఏంచేస్తాయి?

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రయో గించిన చంద్రయాన్-3 బుధవారం సాయంత్రం 6.04 గంటలకు దిగింది. ఇదివరకు ఏ దేశం దిగని చంద్రుడి దక్షిణ ధృవంలో చంద్రయాన్ దిగనుండటంతో ఈ చారిత్రక ఘట్టాన్ని చూసేందుకు యావత్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూసింది. చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా దిగిన తర్వాత ల్యాండర్, రోవర్‌లు ఏం పని చేస్తాయనే విషయాన్ని ఓసారి పరిశీలిస్తే ల్యాండింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయిన అనంతరం ల్యాండర్ విక్రమ్ లోపలి నుంచి ప్రజ్ఞాన్ రోవర్ బయటికొస్తుంది. సైడ్ ప్యానళ్లను ర్యాంప్‌గా ఉపయోగించుకుంటూ జాబిల్లి ఉపరితలంపైకి అది చేరుకుం టుంది. ఆ పరిసర ప్రాంతాల్లో 14 రోజుల పాటు ల్యాండర్, రోవర్‌లలో ఉన్న పేలోడ్‌లు తమ విధులని కొనసాగిస్తాయి. ల్యాండర్‌చేసే పరిశోధనలు నేరుగా భూమ్మీద ఉన్న పర్యవేక్షణ కేంద్రంతో కమ్యూనికేట్ చేసినప్పటికీ రోవర్ మాత్రం ల్యాండర్‌కు మాత్రమే కమ్యూనికేట్ చేసే వీలుంది. చంద్రయాన్ 2లో పంపించిన ఆర్బిటార్ ఇప్పటికే చంద్రుడి చుట్టూ తిరుగుతున్నం దున చంద్రయాన్-3లో దాన్ని పంపించలేదు. ప్రొపల్షన్ మాడ్యూల్‌తోపాటు ల్యాండర్, రోవర్‌లను మాత్రమే పంపించారు. వీటిలో మొత్తం అయిదు పరిశోధక పేలోడ్‌లు ఉన్నాయి. జాబిల్లిపై వాతావరణ పరిస్థితులు, ఉపరితల నిర్మాణం వంటి అంశాలను అవి నిశితంగా శోధిస్తాయి. అవేంటంటే ల్యాండర్ మాడ్యూల్ లేదా ల్యాండర్‌ను చంద్రుడి 100 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశపెట్టడమే ప్రొపల్షన్ మాడ్యూల్ ప్రధాన నిధి. ఈ ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయింది. అయితే ప్రొపల్షన్ మాడ్యూల్‌లో ఒక పేలోడ్ ఉంది. దానిపేరు స్పెక్ట్రో పొలారిమెట్రీ ఆఫ్ హాబిటబుల్ ప్లానెట్ ఎర్త్. చంద్రుడి చుట్టూ తిరుగుతూ స్పెక్ట్రోమీటర్, ఉష్ణ ప్రసరణ పరిశీలన సాధనాల సహాయంతో చంద్రుడి మీద నుంచి భూమిపై పరిశీలన జరుపుతుంది. దాదాపు ఇది మూడు నుంచి దాదాపు ఇది మూడు నుంచి ఆరు నెలలు పనిచేయనుంది. ఇక చంద్రయాన్-3లో వెళ్లిన ల్యాండర్ పేరు విక్రమ్. దీని బరువు 1749.8 కిలోలు. జీవితకాలం 14 రోజులు. 2 రెండుమీటర్ల పొడవు, 2మీ.వెడల్పుతో కూడిన ఈ ల్యాండర్‌తో మూడు పేలోడ్‌లను అమర్చారు. రేడియో అనాటమీ ఆఫ్ మూన్ బౌండ్ హైపర్‌సెన్సిటివ్ ఐనోస్పియర్ అండ్ అట్మాస్పియర్, చంద్రుడి ఉపరితలంపై ప్లాస్మా సాంద్రతపై అధ్యయనం చేస్తుంది. చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్, చంద్రుడి ఉపరితలంపై ఉష్ణలక్షణాలను కొలుస్తుంది. ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సిస్మిక్ యాక్టివిటీ చంద్రయాన్ 3 దిగిన ప్రాంతంలో భూకంపాల తీవ్రతపై ఇది ప్రయోగాలు చేస్తుంది. జాబిల్లి పొరలు, మట్టి స్వభావాన్ని పరిశీలిస్తుంది. భవిష్యత్తులో ప్రయోగాలకు అనుగుణంగా ఇది ఉపయోగపడుతుంది. లేజర్ రెట్రోరిఫ్లెక్టర్ అర్రే : ఇది అమెరికా అంతరిక్ష పరిశోధక సంస్థ నాసాకు చెందని పరికరం. చంద్రుడిపై గతిశాస్త్రాన్ని అర్థం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ఏడు సెన్సార్లు ఉంటాయి. ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా కూడా ఇందులోనే ఉంది. ఇలా ల్యాండర్‌లో మొత్తంగా ఆరు ప్రక్రియలు న్నాయి. ల్యాండర్ లెగ్, రోవర్‌ర్యాంప్, రోవర్, ఐఎల్ఎస్ఎ, రాంభా, చాస్టె పేలోడ్‌లనుతో పాటు వీటిని అనుసంధానించే సురక్షిత వ్యవస్థ. ఎక్స్‌బ్యాండ్ యాంటెన్నాలున్నాయి. ఇక ల్యాండర్‌లో పంపించిన రోవర్ పేరు ప్రజ్ఞాన్. దీని బరువు 26 కిలోలు. జాబిల్లి ఉపరితలంపై సురక్షితంగా దిగిన తర్వాత అందులో నుంచి బయటకు వస్తుంది. ఆరు చక్రాల సహాయంతో చంద్రుడి ఉపరితలంపై తిరుగుతూ 14 రోజులు పనిచేస్తుంది. ఇందులో రెండు పేలోడ్‌లు ఉన్నాయి. లేజర్‌ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్: గుణాత్మక, నిర్మాణాత్మక మూలకాలను విశ్లేషించడానికి ఉపయోగపడుతుంది. ఈ పరికరంలో ఉన్న లేజర్ మట్టిపై పడుతుంది. అలా దాన్ని కరిగించడం ద్వారా అందులో ఉన్న రసాయన మూలకాలు, ఖనిజ సంపదను గుర్తించడంలో దోహదపడుతుంది. ఆల్ఫా పార్టికల్ ఎక్స్‌రే స్పెక్టోమీటర్ : ల్యాండింగ్ అయిన ప్రదేశంలోని మట్టి, రాళ్లలో ఉన్న రసాయ నాలు గుర్తిస్తుంది. ముఖ్యంగా మెగ్నీషియం, అల్యూమినియం, సిలికాన్, పొటాషియం, కాల్షియం, టైటానియం వంటి మూలకా లను గుర్తించే పనిలో నిమగ్నమవుతుంది. సోలార్ ప్యానెల్‌ల ద్వారా శక్తిని పొందే విక్రమ్, ప్రగ్యాన్‌ల జీవితకాలం 14 రోజులే. అందుకే చంద్రుడిపై సూర్యరశ్మి ఉన్నంతసేపే ఈ వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. సూర్యాస్తమయం అయ్యాక మొత్తం అంధకారంగా మారుతుంది. ఆ సమయంలో ఉష్ణోగ్రతలు మైనస్ 180 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతాయి. అలాంటి పరిస్థితుల్లో ల్యాండర్, రోవర్ వ్యవస్థలు మనుగడ సాగించడం సాధ్యం కాదు. 14 రోజుల తర్వాత మళ్లీ అక్కడ సూర్యోదయంఅయ్యాక ల్యాండర్, రోవర్‌లపై సూర్యరశ్మి పడి, ఒకవేళ మళ్లీ అవి పనిచేస్తే మరింత ప్రయోజనమేనని ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు.



విక్రమ్ ల్యాండర్



ప్రజ్ఞాన్ రోవర్

## మూడో చంద్రయాన్ ఖర్చు

# రూ. 615 కోట్లు

**శ్రీహరికోట (తడ), ఆగస్టు 23 ప్రభాతవార్త:** అంతరిక్షంలో భారత కీర్తిపతాక మరోసారి రెపరెప లాడింది. అగ్రరాజ్యాలకు అందని ద్రాక్షలా మిగిలిన చంద్రుని దక్షిణ ధ్రువంపై మన చంద్రయాన్-3 లోని విక్రమ్ ల్యాండర్ బుధవారం సాయంత్రం కాలుమోపింది. ఈ విజయం ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రపంచ వ్యాప్త కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది. అయితే ఇది ఒక్కరోజు శ్రమకాదు. 15 సంవత్స రాల కఠోరశ్రమ. ముచ్చటగా మూడోసారి మాత్రమే చంద్రయాన్-3 నూరుశాతం విజయవంతమైంది. 2008 అక్టోబర్ 22న పిఎస్ఎల్‌వి సి-11 రాకెట్ ద్వారా చంద్ర యాన్-1ను ప్రయోగించారు. దానికి అయిన ఖర్చు 386 కోట్లు. 1380 కిలోల బరువు ఉన్న చంద్రయాన్-1 ప్రయోగం విజయవంతం అయ్యింది కానీ 312 రోజుల తర్వాత ఇస్రోతో దాని సంబంధాలు తెగిపోయాయి. అప్పట్లో చంద్రునిపై నీటి జాడలు ఉన్నట్లు చంద్రయాన్-1 గుర్తించింది. మూన్ ఇంప్లాక్ట్ ప్రోబ్ అనే పరికరం చంద్రుని చేరింది. ఇస్రో ఛైర్మన్‌గా ఆ ప్రయోగాన్ని జి.మాధవన్ నాయర్ పర్యవేక్షించారు.

ఆ తర్వాత 11 సంవత్సరాల అనంతరం 2019 జూలై 22న జిఎస్ఎల్‌వి మార్క్3 ఎం1 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను ప్రయోగించారు. అప్పట్లో దానికి భారీగా ఖర్చుపెట్టారు. మొత్తం 978 కోట్లుగా తేల్చారు. ఆర్బిటర్ బరువు 2379 కిలోలైతే, విక్రమ్ ల్యాండర్ బరువు 1471 కిలోలుగా ఉంది. ప్రజ్ఞాన్ రోవర్ 27 కిలోలతో నిర్మించారు. అప్పుడు ఇస్రో ఛైర్మన్‌గా కె.శివన్ వ్యవహరిస్తున్నారు. చంద్రయాన్-2లోని ఆర్బిటర్ ఇప్పటిదాకా పనిచేస్తోంది. అయితే అదే ఏడాది సెప్టెంబర్ 7న 48రోజుల ప్రయాణం తర్వాత చంద్రయాన్-2లోని విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ జరగకపోగా, హార్డ్ ల్యాండింగ్‌తో కనుమరుగైపోయింది. 2014లో మార్స్ మీద మంగళయాన్ ప్రయోగించారు. ఇది మొదటిసారి విజయవంతమై ప్రపంచ శాస్త్రవేత్తలను ఆశ్చర్య పరిచింది. అయితే చంద్రునిపై పరిశోధనలు చేసి తీరాలని భారత్ చంద్రయాన్-3ని రూపొందిం చారు. ప్రస్తుత ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వ ర్యంలో చంద్రయాన్-2లోని పొరపాట్లు లేకుండా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉపగ్రహాన్ని తయారుచేసి జూలై 14న ఎల్‌విఎం3 ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగించారు. దీనికి ఖర్చు రూ.615 కోట్లు మాత్రమే. 41వ రోజు చంద్ర యాన్-3 ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి వేరుపడి ఉన్న విక్రమ్ ల్యాండర్ తనలోపల ఇముడ్చుకున్న రోవర్‌తో సహా చంద్రుని దక్షిణ ధ్రువంపై బుధవారం సాయంత్రం శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం క్షేమంగా దిగింది.

**దేశ వ్యాప్తంగా పూజలు, ప్రార్థనలు**

చంద్రయాన్-3 ప్రయోగవిజయాన్ని కోరుతూ బుధ వారం దేశ వ్యాప్తంగా పలుచోట్ల పూజలు నిర్వహిం చారు. సర్వమత ప్రార్థనలు జరిగాయి. పాఠశాలల విద్యార్థులు సైతం దేవాలయాలకు వెళ్లి చంద్ర యాన్-3 విజయవంతం కావాలని మొక్కు కున్నారు. అనేకచోట్ల పాఠశాలలు, కళాశాలల్లో చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ దృశ్యాలను తెరల మీద ప్రదర్శించారు. అమెరికాకు చెందిన ఒక ప్రవాస భారతీయుడు చంద్రయాన్-3 సైకత శిల్పాన్ని అత్యద్భుతంగా రూపొందించారు. పాకి స్తాన్ మాజీమంత్రి ఒకరు చంద్రయాన్-3 విజ యాన్ని ఆకాంక్షిస్తూ ప్రకటన చేశారు. మొత్తంమీద బుధవారం విశ్వ వ్యాప్తంగా చంద్రయాన్-3 విజయాన్ని కోరుతూ ఆసక్తిని ప్రదర్శించారు.

# పలుదేశాల్లో ప్రత్యక్ష ప్రసారం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** చంద్రుడిపై లాండర్‌ను విజయవంతంగా లాండ్ చేయడంలో భారత్ సాధించిన విజయం బుధ వారం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రజలు లైవ్ టెలికాస్ట్‌లో వీక్షించారు. ఎప్పుడూ భారత్‌ను ద్వేషించే దాయాది దేశం పాకిస్తాన్‌లోనూ ప్రజలు ఈ దృశ్యాలను లైవ్‌లో చూడడం గమనార్హం. అంతకు ముందు చంద్రయాన్3 ని లైవ్‌లో చూపా లని పాకిస్తాన్‌కు చెందిన మంత్రులతో పాటు పలువురు ప్రముఖులు కోరడం విశేషం. ఇంకోవైపు చంద్రయాన్‌విజయవంతం అవడంపైదేశ వ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి. భారత్ అంటే పాకిస్తాన్‌కు ఎంత కోపమనేది తెలిసిందే. ప్రతీ విషయాన్ని భారత్‌పై అక్కసు వెళ్లగక్కే పాక్ భారత్ ప్రయోగించిన చంద్రయాన్ 3 విషయంలో మాత్రం సానుకూలంగా వ్యవహరించడం అందరిని ఆశ్చర్యపరిచింది. చంద్రయాన్ ప్రయోగించింది మొదలుకొని బుధవారం సాయంత్రం ఆరు గంటల మూడు నిమిషాలకు దీనిని చంద్రుడి దక్షిణ కక్షపై దించే వరకు జరిగిన పరిణామాలపై దాయాది దేశం పాకిస్తాన్‌లో అన్ని వర్గాల వారు ఆసక్తిగా తిలకించారు. బుధవారం ఉదయం నుంచే ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు చంద్రయాన్ గురించి ఆసక్తిగా ఎదురుచూడగా పాకిస్తాన్‌లో కూడా దీని గురించే అందరు చర్చించడం విశేషం.

# అవిరళకృషి చేసిన శాస్త్రవేత్తలు

**బెంగళూరు, ఆగస్టు 23:** జాబిల్లి దక్షిణ ధృవంపై చంద్రయాన్ 3 వ్యోమనౌక అడుగుపెట్టే క్షణంకోసం యావత్ భారతావని ఎంతో ఉద్విగ్నంగా ఎదురు చూస్తోంది. 41 రోజుల ప్రయాణం తర్వాత చంద్రుడి ఉపరితలంపై దిగేందుకు విక్రమ్ ల్యాండర్ సన్నద్ధమైంది. ఈ సందర్భంగా చంద్రయాన్ 3 మిషన్‌లో ఎంతో మంది ఇస్రో శాస్త్ర వేత్తలు కీలకంగా వ్యవహరించారు. మరి ఈ శాస్త్రవేత్తల బృందాలకు నాయకత్వం వహించిన కీలక వ్యక్తుల గురించి తెలుసుకుందాం.

**ఎస్ సోమనాథ్ భారతి, ఇస్రో ఛైర్మన్ :**

చంద్రయాన్ 3ని నింగిలోకి తీసుకెళ్లినలాంచ్ వెహి కల్ మార్క్ 3 రూపకల్పనలలో ఈయన కీలకంగా వ్యవహరించారు. 2022 జనవరిలో ఆయన ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు వరకుఆయన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో లిక్విడ్ ప్రొల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. చంద్ర యాన్-3తోపాటు త్వరలో ఇస్రో చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్, సోలార్ మిషన్ ఆదిత్య ఎల్1 పనులను ఆయన పర్యవేక్షిస్తున్నారు. బెంగళూరు లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ పూర్వ విద్యార్థి, పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి మార్క్-3ల నిర్మాణం, ప్రొపల్షన్ సిస్టమ్ డిజైన్, డైనమిక్స్ డిజైన్, సెపరేషన్ సిస్టమ్ వంటి విభాగాల్లో ఈయనకు అపార అనుభవం ఉంది.

**పి వీరముత్తువేల్, చంద్రయాన్ 3 ప్రాజెక్టు డైరెక్టర్:**

2019లో చంద్రయాన్ 3 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఈయన బాధ్య తలు చేపట్టారు. కొత్త రోవర్, ల్యాండర్ నిర్మాణం ఈయన పర్యవేక్షణలోనే జరిగింది. ఐఐటి మద్రాస్ నుంచి సాంకేతిక విభాగంలో పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. చంద్రయాన్ 2 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వనితా ఆధ్వర్యంలో ఈయన పని చేశారు. చంద్రయాన్ 3 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడా నికి ముందు బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో ఉన్న స్పేస్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రోగ్రామ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు, మంగళ యాన్ మిషన్‌లో కూడా భాగస్వామ్యం అయ్యారు.



**కె కల్పన్, చంద్రయాన్ 3 డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ :**

కల్పన చెన్నైలో బిటెక్ పూర్తయిన వెంటనే ఇస్రోలో శాస్త్రవేత్తగా విధుల్లోచేరారు. తొలుత శ్రీహరికోటలో పదేళ్లపాటు విధులు నిర్వహించారు. 2005లో బదిలీపై బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రానికెళ్లి అక్కడ విధులు నిర్వహిం చారు. అయిదు ఉపగ్రహాల రూపకల్పనలో పాలు పంచు కున్నారు. చంద్రయాన్ 2 ప్రాజెక్టులో ఈమె భాగ స్వామ్యం ఉంది. ప్రస్తుతం చంద్రయాన్ 3 ప్రాజెక్టు అసోసియేటెడ్ డైరెక్టర్‌గా వ్యవహరి స్తున్నారు.

**ఎస్ ఉన్ని కృష్ణన్ నాయర్, డైరెక్టర్, విఎస్ఎస్‌సి:**

కేరళలోని తుంబాలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహ రిస్తున్నారు. ప్రస్తుతం చంద్ర యాన్ 3ని నింగిలోకి తీసు కెళ్లిన ఎల్‌ఎమ్‌వి3ని విఎస్ ఎస్‌సిలో నిర్మించారు. చంద్రయాన్2 మిషన్‌లో కూడా ఉన్ని కృష్ణన్ విఎస్ ఎస్‌విలోని తన బృందంతో కలిసి కీలకపాత్ర పోషించారు.

**ఎం శంకరన్ డైరెక్టర్, యూఆర్‌ఎస్‌సి:**

2021లో యూఆర్‌రావ్ శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా ఎమ్ శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈయ నను ఇస్రో పవర్‌హౌస్‌గా పరిగణిస్తారు. ఉపగ్రహాలకు అవసరమైన పవర్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడంలో ఈయనకు మూడుదశాబ్దాల అనుభవంఉంది. భౌతికశాస్త్ర పట్టభద్రుడైన శంకరన్ చంద్రయాన్ 3 మిషన్‌లో కీలకమైన ల్యాండర్ శక్తిని పరీక్షిం చేందుకు అవసరమైన చంద్రుడి ఉపరితలాన్ని పోలిన నిర్మాణాన్ని భూమిపై రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. గతంలో ఈయన చంద్రయాన్ 1, చంద్రయాన్ 2 మిషన్‌లో కూడా పనిచేశారు.

**వి నారాయణన్, డైరెక్టర్, ఎల్‌పిఎస్‌సి :**

తిరువనంతపురంలోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. చంద్రయాన్ 3 లోని విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్‌కు అవసరమైన థ్రస్టర్లను ఈయన నాయత్వంలోనే అభివృద్ధి చేశారు. ఐఐటి ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి, క్రయోజెనిక్ ఇంజిన్స్ నిర్మాణంలో ఈయన నిపుణుడు.

**బిఎన్ రామకృష్ణ, డైరెక్టర్, ఐఎస్‌టిఆర్‌ఎసి :**

బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహ రిస్తున్నారు. విక్రమ్ ల్యాండింగ్ ప్రక్రియలో 17 మినిట్స్ ఆఫ్ టెర్రర్‌గా శాస్త్రవేత్తలు అభివర్ణి స్తున్న ప్రక్రియను ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు. భారత దేశంలోని 32 మీటర్ల అతిపెద్ద డిష్ యాంటెనా ఈ కేంద్రంలోనే ఉంది. దీని సాయంతోనే శాస్త్రవేత్తలు విక్రమ్ ల్యాండర్‌కు కమాండ్‌లు పంపుతారు.

### సిఎం సభరోజు మెదక్ జిల్లాలో ఘటన
## దళిత బంధు రాలేదని యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దేవయ్య

**టేక్మాల్,ఆగస్టు 23, ప్రభాతవార్త:** దళిత బంధు రాలే దని యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మెదక్‌జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కాలోజీ పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. కాలోజీపల్లి గ్రామానికి చెందిన బేగరి దేవ య్యకు గుంట భూమి, ఉండేందుకు ఇళ్లు కూడా లేదు. అతనికి నడవడానికి కూడా రాదు. తన కొడుకు సహాయంతో బయటకు వస్తూ,వెళ్తూ ఉంటాడు. దళిత బంధు లిస్టులో తన పేరును నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఫినాయిల్ తాగి సిఎం సభకు వెళ్తున్న బస్సుకు అడ్డంగా కూర్చున్నాడు. దళితబంధు కోసం గ్రామ సర్పంచి హార్షాబేగంకు పలు మార్లు విన్నవించుకున్నా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. అందుకనే ఈ ఆత్మహత్యా యత్నానికి ఒడిగట్టానని అన్నాడు. సీఎం సభకు వెళ్లే బిఆర్ఎస్ శ్రేణులు ఆయనను కాపాడే ప్రయత్నం చేయకపోగా ఏర్పాటుచేసిన వాహనాలలో ఎక్కి సభకు తరలి వెళ్లారు. అక్కడే ఉన్న జర్నలిస్టులు టేక్మాల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సమాచార కమిషనర్ల నియామకంపై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్ర సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్లతో పాటు చీఫ్ కమిషనర్ నియామకంపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ అంశంపై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం విచారణ చేబట్టింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాదులు సమాధానం ఇస్తూ సమాచార కమిషనర్లతోపాటు చీఫ్ కమిషనర్ నియామకంపై నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. చీఫ్ కమిషనర్ కోసం 40 దరఖాస్తులు వచ్చాయని, కమిషనర్ల పోస్టుల కోసం 273దరఖాస్తులు అందాయని వారు వివరించారు. సమాచార కమిషనర్ల నియామకం కోసం ఎంపిక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సర్కారు తరపు న్యాయవాదులు హైకోర్టుకు తెలిపారు. ఇందుకోసం నాలుగు వారాల గడువు కావాలని వారు కోరారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు ధర్మాసనం ఈ కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## అబ్కారీలో ఆకస్మిక బదలీలతో సంచలనం

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** తెలంగాణ ఎక్సైజ్‌శాఖలో ఆకస్మిక బదిలీలు సంచలనం రేపడంతో పాటు వివాదాస్పదంగా మారాయి. ఆరేళ్ళుగా అబ్కారి శాఖలో జనరల్ ట్రాన్స్‌ఫర్లు జరగలేదు. అలాంటిది ఆరుగురు సిఐలను ఆగమేఘాలపై బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా పోస్టింగ్ ఇచ్చే విషయంలో లక్షల రూపాయలు చేతులు మారాయని ఊహాగానాలు గుప్పుమంటున్నాయి. లింగంపల్లి ఎస్‌హెచ్‌ఓ స్థానంలో ముషీరాబాద్ ఎస్ హెచ్ వో లక్ష్మణ్‌గౌడ్, శంషాబాద్ ఎస్ హెచ్ వో స్థానంలో ఇవో చార్మినార్ దేవేందర్‌రావు, శంషాబాద్ డిటిఎఫ్ స్థానంలో ఎన్‌టిఎఫ్ సిఐ ప్రవీణ్, మేడ్చల్ డిటిఎఫ్ స్థానంలో మహబూబ్‌నగర్‌డిటిఎఫ్ నర్సిరెడ్డి, షాదనగర్ ఎస్ హెచ్ వో స్థానంలో ధూల్‌పేట ఎస్ హెచ్ వో అంజయ్య, నారాయణపేట ఎస్ హెచ్ వో స్థానంలో చెక్‌పోస్టు సిఐ కవిత బదిలీ ఫైళ్లపై ఎక్సైజ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఎక్సైజ్ టెండర్లు ముగిసిన రెండో రోజునే శంషాబాద్ యూనిట్‌లో ముగ్గురు సిఐలను ట్రాన్స్‌ఫర్ చేశారు శంషాబాద్ ఇఎస్ పరిధిలో 10వేల ఆరువందల టెండర్లు దాఖలైనాయి. టెండర్లలో ఏదైనా అవకతవకలు జరగడంవల్ల ఈ బదిలీలు చేశారా అనే అనుమానం వ్యక్తం అవుతుంది.

## కాంగ్రెస్ బిసి డిక్లరేషన్ కోసం కర్ణాటక సిఎం సిద్దరామయ్యకు ఆహ్వానం

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త :** తెలంగాణలో బిసి డిక్లరేషన్ చేయడానికి సెప్టెంబర్ మొదటి వారంలో జరుపతలపెట్టిన సభకు రావాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. బుధవారం బెంగుళూర్‌లో సిడబ్ల్యుసి నేత భట్టి విక్రమార్క, మాజీ ఎంపి హనుమంతరావు, ప్రచారకమిటి ఛైర్మన్ మధుయాష్కీ, మంత్రి బోసురాజు ఆయను ఆహ్వానించారు.



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డా. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితర నాయకులు

## బిఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం: ప్రవీణ్‌కుమార్

### కామ్రేడ్లు కలిసొస్తే పొత్తులపై ఆలోచిస్తాం
### భావసారూప్య పార్టీలతో పొత్తుకు సిద్ధం

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 23 ప్రభాతవార్త :** బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు తమ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి ఆధిపత్య కుల పార్టీల జెండాలు మోయొద్దని తెలంగాణ రాష్ట్ర బిఎస్పీ అధ్యక్షుడు డా. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆధిపత్య పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలు జనాభాలో సింహభాగం కలిగిన బహుజనులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, సంపదలో భాగస్వామ్యం చేయడంలో వివక్ష చూపుతున్నారన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా. గుండాల మదన్‌కుమార్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాచేసి బిఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డా. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణలో 139 బిసి కులాలకు కేవలం 6 కులాలకు మాత్రమే అసెంబ్లీ సీట్లు కేటాయించడం అన్యాయమని, జనాభాలో 60శాతమున్న బిసిలకు బిఆర్ఎస్ కేవలం 23 అసెంబ్లీ సీట్లు కేటాయించడం పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ అహంకారానికి నిదర్శనమని, 5శాతమున్న రెడ్లకు 40సీట్లు, ఒక్కశాతం కూడాలేని వెలమలకు 11 సీట్లు కేటాయించడం ఏరకమైన ప్రజాస్వామ్యమని ఆర్.ఎస్ ప్రశ్నించారు. మాజీమంత్రి తాటికొండ రాజయ్య అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కన్నీళ్లు పెట్టుకోవడం విచారకరమని, ఆధిపత్య పార్టీల్లో పనిచేసే ఏ నాయకునికైనా రాబోయే రోజుల్లో ఇదే గతిపడుతుందని ఆయన అన్నారు. అనంతరం గుండాల మదన్‌కుమార్‌ను బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ నియమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సాంబశివగౌడ్, అరుణక్వీన్, చిరంజీవి, సునీల్, లింగం, శైలజ తదితర నాయకులు పాల్గొన్నారు.

## నిషేధించిన పురుగు మందుల అమ్మకం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణలోని పలు జిల్లాల్లో నిషేధించిన పురుగు మందుల అమ్మకం జోరుగా సాగుతోంది. ప్రధానంగా గ్లైకో సెట్ అనే గడ్డి మందును వివిధ పురుగు మందుల దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండల కేంద్రంలో సీడ్స్, ఫర్టిలైజర్స్ షాపుల్లో వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కేంద్ర ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో ఈ పురుగు మందుల షాపు యజమానులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నర్సంపేట్‌లో ఉద్యాన పరిశోధనా కేంద్రం

**హైదరాబాద్, అగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటల పరిశోధనా కేంద్రం మంజూరైంది. వరంగల్ జిల్లా నర్సంపేట్ నియోజకవర్గానికి ఉద్యాన పంటల పరిశోధనా కేంద్రం శాంక్షను చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను కూడా ఇటీవల విడుదల చేసింది. గజ్వేల్ నియోజకవర్గం ములుగులోని హార్టికల్చర్ యూనివర్సిటికి అనుబంధంగా నర్సంపేట్‌లో రాష్ట్ర స్థాయి హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్‌లో ఉద్యాన కళాశాల ఏర్పాటుకు అవకాశం కలుగుతుందని స్థానికులు భావిస్తున్నారు. కాగా గతంలో ఖానాపూర్ మండలంలోని అశోక్‌నగర్‌లో ఈ ఉద్యాన రీసెర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అనుకున్నప్పటికీ అక్కడ అటవీస్థలం విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి.దీంతో నర్సంపేట్ నియోజకవర్గంలో ప్రభుత్వం దీన్ని మంజూరు చేసింది.

# కెసిఆర్‌ను తరిమి కొట్టడమే బిజెపి లక్ష్యం

### రాష్ట్రాన్ని ముంచుతున్న బిఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి
### రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం రావడం ఖాయం
### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ధీమా



బుధవారం చేవెళ్లలో ఓపెన్‌టాప్ జీప్‌లో ర్యాలీలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తదితరులు

**చేవెళ్ళ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణకు సిఎం కెసిఆర్ క్యాన్సర్ కంటే డేంజర్‌రంటూ క్యాన్సర్ మూడో దశకు చేరితే ప్రాణానికే ప్రమాదం ఉన్నట్లే మూడవ సారి కెసిఆర్ సిఎం అయితే తెలంగాణ రాష్ట్రానికి నష్టమని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. బుదవారం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో బూత్ సమ్మేళనను నిర్వహించారు. చేవెళ్ళలో భారీ ఎత్తున ర్యాలీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి,మాజీ ఎంపిలు జితేందర్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, వివేక్ వెంకట్‌స్వామి, కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్ప.రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి,ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు భాష, రాష్ట్ర నాయకులు అశ్వద్దామరెడ్డి, కంజర్ల ప్రకాష్, జంగారెడ్డి,ప్రతాప్, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. గజమాలతో బండి సంజయ్‌కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌ను రానున్న ఎన్నికల్లో తరిమి కొట్టడమే లక్ష్యంగా బిజెపి పనిచేస్తుందన్నారు తెలంగాణను నట్టేట ముంచుతున్న కెసిఆర్‌కు ఓటు వేస్తే ప్రజలందరూ మునిగి పోవడం ఖాయమన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ దండుపాళ్యం ముఠాగా ఏర్పడి దోచుకుంటున్నారన్నారు. ప్రజలందరూ ఆలోచించి బిఆర్ఎస్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. ఎన్నికల ముందు 30మంది అభ్యర్దులకు బిఫాంలను మాత్రం ఇవ్వడన్నారు. పార్టీని మారుతారన్న కారణంతోనే జాబితాను ప్రకటించారన్నారు. రానున్నఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీలో బిజెపి అభ్యర్ది గెలుపు ఖాయమన్నారు.పోలింగ్ బూత్‌లో బిజెపికి ఓటు వేస్తేనే ఎంపిగా,ఎమ్మెల్యేగా విజయం సాధించి అధికారంలోకి వచ్చి ప్రజలకు సేవ చేస్తామన్నారు. అధికారంలోకి వస్తే దళితులను సిఎంగా చేస్తామని అధికారంలోకి రాగానే దళిత సిఎంను మరిచిపోయారన్నారు. సిఎం కెసిఆర్ దళితులకు చేసిం దేమిలేదన్నారు. బిఆర్ఎస్ బిసిలకు పెద్ద ఎత్తున అన్యాయం చేసిందన్నారు. ఆర్టీసిని విలీనంలో పెద్ద ఎత్తున కుట్ర దాగిఉందన్నారు.ఆర్టీసి ఆస్తులను లీజుల పేరుతో దోచుకోవడం కోసమే ఆర్టిసిని విలీనం చేశారన్నారు. తెలంగాణ ప్రజలు రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్,ఎంఐఎంలను నమ్మకూడదన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ నాయకులు విజయ్‌కూమార్, చేవెళ్ల మండల బిజెపి మండలశాఖ అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి,రంగారెడ్డి జిల్లా ఓబిసి కార్యవర్గ సభ్యులు చీర శ్రీనివాస్, వెంకట్‌రామరెడ్డి అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి,శ్రీపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, అభి, క్రిష్ణా, బిజెవైఎం కార్యవర్గ సభ్యులు గుడిపల్లి మధుసూదన్‌రెడ్డి, బిజెవెఎం అధ్యక్షుడు బండారి చంద్రశేఖర్‌రెడ్డి, ఐటి సెల్ అద్యక్షుడు అభిషేక్‌రెడ్డి బిజెవైఎం నాయకులు నరేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహికుల నుంచి కాంగ్రెస్‌కు వెల్లువెత్తున్న దరఖాస్తులు

### ఖమ్మంలో ఆరుగురు పొంగులేటి వర్గీయుల దరఖాస్తులు
### నల్లగొండ టికెట్టు కోసం కొమటిరెడ్డి వెంకటరెడ్డి దరఖాస్తు
### దరఖాస్తు చేసుకున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు
### శుక్రవారం తుది గడువు

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభకు త్వరలో జరగబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వం కూడా లేని ఇతర పార్టీల నాయకులు కూడా దరఖాస్తులు చేసుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో గత తొమ్మిదేళ్లుగా సంస్థాగత బలోపేతంకు కృషిచేసిన కార్యకర్తలు నాయకులు కూడా ఆశావహంతో దరఖాస్తులు చేసుకుంటున్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్టు ఆశిస్తూ ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టిపిసిసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు కూడా బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ఎంపి ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు ఏడు అసెంబ్లీస్థానాలలో పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. శ్రీనివాసరెడ్డి అనుచరులు ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మంలో మొత్తం 10అసెంబ్లీ ఏడు సెగ్మెంట్లకు దరఖాస్తులు చేసుకున్నారు. జనరల్ స్థానాలైన పాలేరు ఖమ్మం నుంచి ఏదో ఒక స్థానం ఇవ్వాలని మువ్వ విజయబాబు దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లందు ఎస్టీ స్థానం కోసం జడ్పీచైర్మన్ కనుకయ్య, పినపాక స్థానం పాయం వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గం కోసం విజయబాబు, అశ్వారావ్‌పేట జారె ఆదినారాయణ, సత్తుపల్లి స్థానం కోసం కొండూరి సుధాకర్‌రావు దరఖాస్తు చేశారు. పొంగులేటి కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకుంటారని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఖమ్మంలో మొత్తం పది నియోజకవర్గాలు వుండగా ఆయన అనుచరులు మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కోరుతూ దరఖాస్తులు చేశారు. నిజామాబాద్ నుంచి తిప్పరెడ్డి మోహన్ రెడ్డి దరఖాస్తు చేశారు. గాంధీభవన్‌లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి తరుపున నల్లగొండ టౌన్‌ప్రసిడెంట్ గుమ్మల మోహన్‌రెడ్డి దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జడ్పీటిసి లక్ష్మయ్య, మాడుగుల్ జడ్పీటిసి పైదులు పలువురు కౌన్సిలర్లు పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు. మొగిలి సునితారావ్ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకొని మాట్లాడుతూ 32ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అభివృద్ధికి కృషిచేస్తున్నానని తెలిపారు.ఎన్ఎస్‌యుఐ నుంచి అంచెలంచెలుగా ఎదిగానని ఏనాడు స్వార్థప్రయోజనం కోసం పార్టీలను ఫిరాయించలేదని ఆమె గుర్తుచేశారు. ఆగస్టు 18న టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి,సిఎల్‌పి నేత భట్టివిక్రమార్క, మధుయాష్కీ అంజన్ కుమార్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకొనే ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని ఒక నమూనా దరఖాస్తును విడుదలచేశారు. శుక్రవారం(ఆగస్టు18) నుంచి ఆగస్టు25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని గడువును విధించారు. దరఖాస్తుదారుడు తిరిగి చెల్లించబడని రుసుము కింద డిడి రూపంలో చెల్లించాల్సి వుంటుంది. ఎస్సీ,ఎస్టీలు 25వేల రూపాయలు దరఖాస్తుతో చెల్లించాలి. ఇతరులైతే రూ .50వేల దరఖాస్తుతో చెల్లించాల్సి వుంటుంది. ఈ దరఖాస్తులను ఎలక్షన్ కమిటీ,స్క్రీనింగ్ కమిటీ పరిశీలిస్తుంది. పార్టీకి అభ్యర్థులు చేసిన సేవలు సర్వేల ప్రాతిపదికన నివేదిక తయారు చేసి సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి నివేదించి అభ్యర్థులను ఫైనల్ చేస్తారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే పార్టీనేతలు ఎవరైనా దరఖాస్తులు చేసుకోవాల్సిందే అనే నియమం పెట్టడంతో ఇతర పార్టీలనుంచి కూడా దరఖాస్తులు వస్తున్నాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ దరఖాస్తు తన పిఏ ద్వారా పంపించింది. ఆమె పార్టీ మారితే దక్కవలసిన చిక్కులు వస్తాయని భర్తను ముందుగా రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేర్పించారు. దంపతులు ఇద్దరు ఖానాపూర్, అసిఫాబాద్ స్థానాలపై దృష్టిసారించారు. జూపల్లి కొల్లాపూర్ నుంచి పోటీ చేయడానికి మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. శేర్‌లింగంపల్లి టికెట్టు ఆశిస్తూ సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ దరఖాస్తుచేసుకున్నారు. ఇప్పటి వరకు దాదాపు 264కు పైగా దరఖాస్తులు వచ్చాయని కాంగ్రెస్ వర్గాలు అనధికారికంగా తెలిపాయి.

# మహిళా బిల్లు కోసం డిసెంబర్‌లో మరోసారి దీక్ష చేస్తా

### ఈ దీక్షకు సోనియా, ప్రియాంక, స్మృతి ఇరానీలను పిలుస్తా
### బిజెపి ఎంపీ అర్వింద్‌పై చర్యలు తీసుకోవాలని ఇసికి వినతి
### మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** మహిళా రిజర్వేషన్లు తన వ్యక్తిగత ఎజెండా కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దేశంలోని మహిళలందరూ చట్టసభల్లో రిజర్వేషన్లు కోరుకుంటున్నారని తెలిపారు. మహిళల రిజర్వేషన్ల కోసం అంబేద్కర్ కూడా కొట్లాడారని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో మహిళలు కేవలం 12 శాతం మాత్రమే ఉన్నారని అన్నారు. బుధవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తొలి లోక్‌సభలో 8శాతం మహిళా ఎంపీలే ఉంటే... ఇప్పుడు ఆ సంఖ్య 12శాతానికి మాత్రమే చేరిందని అన్నారు. మణిపూర్‌లో ఇప్పుడు ఇద్దరు మహిళలు మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని తెలిపారు. సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగానే మహిళలు మిగిలిపోవాలా? అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బిజెపి నాయకులు అనవసరంగా తనపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2010 రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు... 2023 వచ్చినా ఎందుకు ఆమోదం పొందడం లేదని ప్రశ్నించారు. 14 ఏండ్లుగా మోదీ సర్కార్ మహిళా బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని నిలదీశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం వచ్చే డిసెంబర్‌లో మరోసారి దీక్ష చేస్తామని ఆమె ప్రకటించారు. ఈ దీక్షకు సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, స్మృతి ఇరానీ సహా మహిళా నేతలు అందర్నీ ఆహ్వానిస్తామని తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆరోపించారని, దీంతో ఆయనను ఆ పోస్టు నుంచి తీసేశారని, దానిపై దేశమంతా చర్చ జరుగుతోందన్నారు. ఏ పార్టీకి ఓటు వేసినా బిజెపికి వెళ్తుందని బిజెపి ఎంపీ అర్వింద్ అనుమానాలకు తావిస్తోందని, ఈ విషయాన్ని పరిశీలించాలని తాను సీరియస్‌గా కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. తమ పార్టీ న్యాయ విభాగం ఈసీకి ఫిర్యాదు చేయనుందని, ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా చర్యలు తప్పవని బిఆర్ఎస్ నాయకులను ఆమె హెచ్చరించారు. ప్రజాజీవితంలో ఉన్న ఎవరైనా సరే మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఎమ్మెల్యే టికెట్ రాని అందరికీ తగిన ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. సిఎం కెసిఆర్‌కు భయమన్నది లేదని తెలిపారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తుందని ఆమె ఆరోపించారు. గత ఎన్నికల్లో హామీలను ప్రజలు నమ్మలేదని అన్నారు. మహిళా హక్కులపై కాంగ్రెస్,బిజెపి దొందు దొందేనని పేర్కొన్నారు. గత పది ఏళ్లలో మహిళా బిల్లుపై సోనియా ప్రియాంక గాంధీలు ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

### కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ లక్ష కోట్ల దోపిడి
### 2018 ఎన్నికల్లో పోలీసులను అడ్డుపెట్టుకొని నన్ను ఓడించారు
### కేసీఆర్ మళ్లీ దొంగదెబ్బ తీయాలని ప్రయత్నం
### టీపీసీసీ అధ్యక్షుడు,ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**కొడంగల్, ఆగస్టు 23ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షులు,ఎంపీ రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.బుధవారం సాయంత్రం ఆయన వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చేరుకోవడంతో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బాణసంచాకాలుస్తు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన తన స్వగృహంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతు కాంగ్రెస్‌ను చూసి కేసీఆర్‌కు భయం చుట్టుకున్నదని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ లక్ష కోట్ల దోపిడికి పాల్పడ్డాడని ఆరోపించారు.కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ మిత్తికి కూడా సరిపోవడం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ వస్తుంది..రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని భరోసా ఇచ్చారు.బీఆర్ఎస్ పాలనలో పాలమూరు పాడుబడ్డది..రంగారెడ్డి దిక్కులేనిది అయ్యిందన్నారు.రూ.4వేలు పెన్షన్ ఎలా ఇస్తారని కేసీఆర్ అంటున్నారని,నెలనెలా మొదటి తారీఖునే రూ.4వేలు పెన్షన్ ఇచ్చి తీరుతామన్నారు.2018 ఎన్నికల్లో పోలీసులను అడ్డుపెట్టుకొని నన్ను ఓడించారు.కొడంగల్‌లోపోలీసుల సహాయంతో కేసీఆర్ మళ్ళీ దొంగదెబ్బ తీయాలని చూస్తున్నాడని,కేసీఆర్‌కు పోలీసులు ఉంటే తనకు కాంగ్రెస్ సైనికులు ఉన్నారని చెప్పారు.మీరే నా సైనికులు..మీరే నాల బలగం అంటూ కొడంగల్ తనకు పుట్టినిల్లు లాంటిదని,పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని పెద్దలు చెప్పారని అందుకే కొడంగల్ గడ్డ నుంచే బీఆర్ఎస్‌ను బొందపెడదామని పిలుపునిచ్చారు.పదేళ్ళుగా ఎమ్మెల్యేగా ఉన్న తాను ఎవరికీ లేదనకుండా సాయం చేశానని,కానీ ఇప్పుడున్న ఎమ్మెల్యే చచ్చిన శవాన్ని కూడా వదలకుండా దోచుకెళ్ళే రకమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి పరోక్షంగా చురుకలు అంటించారు.ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తెస్తానని హామీ ఇచ్చి కేసీఆర్ మోసం చేశారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో మన ప్రభుత్వం రాబోతుంది..మనల్ని చూసి కేసీఆర్ భయపడుతున్నాడని తన పేరు తీసేందుకు కేసీఆర్ భయపడుతున్నాడని అన్నారు.ఈనెల 26న జరిగే చెవెళ్ళ ప్రజా గర్జన సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా తరలివచ్చి సభను విజయంతంచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి,నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూముల వివరాల సేకరణ

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమి వివరాలను వ్యవసాయ శాఖ సేకరిస్తోంది. వీఆర్ఓ వ్యవస్థ రద్దు కావడం, ప్లానింగ్ సిబ్బంది లేకపోవడంతో రాష్ట్రంలో పంటల సాగు భూమి వివరాలను వ్యవసాయ శాఖకు రాష్ట్ర సర్కార్ అప్పగించింది. రెవెన్యూ రికార్డులను ఆధారంగా చేసుకుని వ్యవసాయ శాఖకు చెందిన ఎక్స్‌టెన్షన్ అధికారులు (ఏఇఒ) క్షేత్రస్థాయిలో సర్వే నెంబరులో రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమి వివరాలను నమోదు చేస్తున్నారు. రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏ పంటలు సాగు చేస్తున్నారు, సంబంధిత రైతు సాగు చేస్తున్నారా లేక కుటుంబ సభ్యుల నిర్వహణ లేదా కౌలు రైతులు పంటలు పండిస్తున్నారు, రైతు భూమి ఏ ప్రాంతంలో ఉంది తదితర వివరాలను సేకరిస్తున్నారు.

## ఇస్రో శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్ విజయవంతం

### టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఇస్రో శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్ -3 విజయవంతం అయిందని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఇస్రోను స్థాపించి ఖగోళ రహస్యాలపై పరిశోధనలను ప్రోత్సహించడం వల్ల అంచలంచెలుగా దేశం ఇలాంటి విజయాలను సొంతం చేసుకుంటున్నదని ఆయన అన్నారు.ఖగోళ పరిశోధనలో అమెరికా రష్యా సరసన భారత దేశం స్వాంతత్ర్యం పొందిన తొలినాళ్ళలోనే నిలిపే ప్రయత్నంకు తొలి ప్రధానమంత్రి నెహ్రూ అకురార్పణ చేశారని గుర్తు చేసుకున్నారు. ఇది భారతదేశ చారిత్రాత్మకమైన ఘట్టం, ఇస్రో చరిత్రలో ఇది శుభదినం అని ఆయన పేర్కొన్నారు. ఇస్రోశాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. ఇస్రో శాస్త్రవేత్తలో మరింత ఆత్మవిశ్వాసం చంద్రయాన్-3 పెంచింది. మొదటి ప్రధానమంత్రి జవ హర్‌లాల్ నెహ్రూ స్థాపించిన ఇస్రో ప్రపంచ చరిత్రలో ఇంతటి ఘన విజయం సాధిం చడం ముమ్మాటికి శాస్త్రవేత్తల కృషి మాత్రమే వారి కృషి ఫలించింది.

## ఇస్రోకి అభినందనలు తెలిపిన నారాయణ విద్యాసంస్థలు

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:**అంతరిక్షరంగంలో భారత్ చరిత్రను లిఖించిందని, చంద్రుడిదక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్ నిర్ధేశిత ప్రాంతంలో సురక్షితంగా అడుగుపెట్టడం మనశాస్త్రవేత్తల విజయం అనినారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్లు పి.సింధూరనారాయణ, పి.శరణ్‌నారాయణ అభినందలు తెలి పారు. జాతి గర్వించ దగ్గక్షణాలు ఇవని వారు పేర్కొన్నారు.నారాయణ విద్యార్థులను ఖగోళ పరిశ ధనకు ప్రేరేపించేలా విద్యాబోధనలు కొనసాగిస్తున్నామని చంద్రయాన్ విజయం మా విద్యార్థులలో మరింత స్ఫూర్తిని పెంపొందిచేలా వుందని వారు అన్నారు. నాసా నిర్వహించే ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యధిక బహుమతులు పొందుతారని వారు గుర్తుచేశారు.

## చంద్రయాన్ 3 విజయవంతంపై ఎల్ఐసీ జెడ్ ఎం హర్షం



**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** చంద్రయాన్ 3 విషయంలో ఇస్రో ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఎల్ఐసీ హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎల్‌కె శ్యామ్ సుందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఎన్నో సవాళ్లను అధికమించి విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా ల్యాండింగ్ చేశారన్నారు. ఇది దేశ పౌరులైన ప్రతీ ఒక్కరికీ గర్వకారణమని వ్యాఖ్యానించారు. నాలుగు సంవత్సరాల తర్వాత భారతదేశం, ఇస్రో ప్రపంచంలోనే గొప్ప విజయాన్ని సాధించా యన్నారు. విక్రమ్ ల్యాండర్‌ను ఇస్రో చైర్మన్, అతని బృందం విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతంపై సురక్షితంగా ల్యాండ్ చేశాయని చెప్పారు. లక్ష్యాలను సాధించడానికి నిర్విరామంగా పనిచేసిన శాస్త్రవేత్తల బృందానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** వ్యవసాయం కలిసి రాక, చేసిన అప్పులు తీరే మార్గం కనిపించక తెలంగాణలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు బలన్మరణానికి పాల్పడ్డారు. రాష్ట్రంలోని హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట్ గ్రామానికి చెందిన సందెల చందర్ (36) కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం పలువురి వద్ద 5 లక్షల రూపాయల వరకూ అప్పులు చేశారు. అయితే పంట దిగుబడి సరిగా రాకపోవడంతో వాటిని ఏ విధంగా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపం చెందారు. ఈ క్రమంలో పొలం వల్ల పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అదేవిధంగా జనగామ్ జిల్లా రఘునాథపల్లి మండలం అశ్వారావుపల్లికి చెందిన యాదగిరి (65) తనకున్న నాలుగు ఎకరాల్లో గత ఏడాది పత్తి పంటను సాగు చేశారు. అయితే చీడపీడలు సోకి పంట దిగుబడి అనుకున్నంతగా రాలేదు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన లక్షలాది రూపాయల అప్పు పెరిగింది. వీటిని ఎలా తీర్చాలో తెలియక, మరోపక్క అప్పు ఇచ్చినవారి వత్తిడి పెరగడంతో గత్యంతరంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న యాదగిరిని జనగామ్ జిల్లా హాస్పిటల్‌కు తరలించగా, వైద్య చికిత్సలు పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

## త్వరలో గొర్రెల పంపిణీ

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఇందుకు అవసరమైన నిధులను పన్నేతర ఆదాయం నుండి నిధులు వినియోగించాలనే యోచన చేస్తోంది. అయితే గొర్రెల పంపిణీ నిమిత్తం అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వ సంస్థలు లేదా, బ్యాంకుల నుండి రుణాలుగా తీసుకోవాలని దిశగా కూడా ఆలోచన చేస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే 121 కోట్ల రూపాయలను గొర్రెల పంపిణీకి ప్రభుత్వం విడుదల చేయడంతో రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 8,801 యూనిట్లను పంపిణీ చేసింది. అయితే తదుపరి నిధులు లేకపోవడంతో ఈ పథకం అమలును పెండింగ్‌లో ఉంచింది. త్వరలో శాసనసభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో గొర్రెల పంపంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## కోటి బతుకమ్మ చీరెలు సిద్ధం

**హైదరాబాద్,ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఈ ఏడాది కోటి బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే చేనేత జౌళి శాఖ అధికారులు సిరిసిల్లలోని నేత కార్మికులకు అప్పగించగా వాటి పనులు దాదాపు పూర్తియి, పంపిణీకి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్నింటినీ సిద్ధం చేస్తున్నారు. వీటిలో దాదాపు 90 శాతం చీరలు సిరిసిల్లాలో తయారవ్వగా, మిగిలిన 10 శాతం కరీంనగర్‌లో తయారు చేస్తున్నారు. గత ఏడాది అందించిన 10 రంగులు, 17 డిజైన్లకు బదులుగా ఈ సారి 25 రంగులు, 20 డిజైన్లలో బతుకమ్మ చీరలను తయారుచేశారు. గత ఏడాది అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యంగా వర్షాల కారణంగా ఏర్పడిన జాప్యాలను గమనంలో ఉంచుకుని చేనేత జౌళి శాఖ అధికారులు ముందుగానే ఈ ఏడాది బతుకమ్మ చీరల తయారీకి అప్పగించారు. ఇందుకు గాను 339 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. అక్టోబరు మొదటి వారం నుండి చీరల పంపిణీని ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ప్రతీ రోజూ లక్ష చీరలను తయారు చేస్తున్నారు. ఈ చీరలను సిరిసిల్లలో 20 వేల మంది పవర్‌లూమ్ నేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఎలాంటి కొరత లేరకుండా చూసేందుకు 3 లక్షల చీరల బఫర్ స్టాక్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు

### పలు జిల్లాలకు ఎల్లో, గ్రీన్ అలర్ట్ జారీ

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు బుధవారం వివిధ జిల్లాలకు ఎల్లో, గ్రీన్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే వీలుందని తెలిపింది. రాష్ట్రంలోని మల్కాజిగిరి, నల్లగొండ, రంగారెడ్డి, సూర్యాపేట్, హైదరాబాద్, జనగామ్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా రాష్ట్రంలో గడచిన 24 గంటల్లోనూ వివిధ ప్రాంతాల్లో చెదురుమదురు వర్షాలు కురిశాయి. రాష్ట్రం మొత్తం మీద సగటున 4.5 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలోనే అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో 43 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే మంచిర్యాల జిల్లాలో 12.6 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 10.5 మిల్లీ మీటర్లు, భూపాలపల్లిలో 9.5 మిల్లీ మీటర్లు, కొత్తగూడెంలో 6.4 మిల్లీ మీటర్లు, వరంగల్‌లో 13.1 మిల్లీ మీటర్లు, కరీంనగర్‌లో 10.2 మిల్లీ మీటర్లు, సిరిసిల్లాలో 32.3 మిల్లీ మీటర్లు, కామారెడ్డిలో 12.5 మిల్లీ మీటర్లు, జనగామ్ జిల్లాలో 7.6 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది.

## రాష్ట్రం నుండి 50 లక్షల టన్నుల బియ్యం సేకరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బియ్యం సేకరణ విషయంలో తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ నుండి బియ్యం సేకరించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. రాష్ట్రంలో వానాకాలం సీజనులో సాగైన వరి ధాన్యాన్ని బియ్యం కింద మార్చి ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో వానాకాలం సీజనులో తెలంగాణ నుండి 50 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సీజనులో తెలంగాణలో వరిధాన్యం దిగుబడి పెరుగుతుందని, దీంతో 67 లక్షల టన్నులమే మేర బియ్యం సేకరించాలని రాష్ట్ర సర్కార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయితేఇందులో 50లక్షల టన్నులమేర బియ్యంతీసుకునేందకు కేంద్రం అంగీకరించింది.

## ఇది అత్యంత అరుదైన విజయం: రాష్ట్రపతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** చంద్రుని దక్షిణధ్రువంపైకి విజయవంతంగా చంద్రయాన్-3 నిర్వహించిన ఇస్రో శాస్త్రవేత్తలు అభినందనీయులని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. భారత చరిత్రలో ఇదొక అత్యంత అరుదైన సంఘటన అని భారత శాస్త్రవేత్తలు అపూర్వవిజయం సాధించారని రాష్ట్రపతి అభినందించారు. జీవితకాలంలో ఒకేసారి ఇలాంటి అరుదైన విజయాలు చోటుచేసుకుంటాయని అన్నారు. చంద్రయాన్-3 విజయం యావత్ భారత దేశానికి గర్వకారణం అని పేర్కొన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపైకి విక్రమ్ లాండర్ విజయవంతంగా దిగిన సంఘటనను ప్రత్యక్షప్రసారంలోచూసిన ఆమె ఇస్రోశాస్త్రవేత్తలు,ఈ చంద్రయాన్‌తో అనుబంధం ఉన్న అందరినీ కొనియాడారు.అంతరిక్షపరిశోధనల్లో మన శాస్త్రవేత్తలు కొత్త చరిత్రను సృష్టించారని, నేటి విజయం భారత భౌగోళిక స్వరూపాన్నే మార్చి వేసిందని అన్నారు. గోవాకు అధికారిక పర్యటనపై వెళ్లిన రాష్ట్రపతి చంద్రయాన్-3 మొత్తంప్రత్యక్షప్రసారం చూసారు. ఆధునిక శాస్త్రసాంకేతిక విజ్ఞానంతోపాటు భారత్ సాంప్రదాయ విజ్ఞాన సంపదను ఎలా అనుసరిస్తుందనడానికి నేటి విజయమే కారణమన్నారు.



# ప్రపంచ దిగ్గజ సంస్థ గోల్డ్‌మెన్ సాక్స్ హైదరాబాద్‌లో భారీ విస్తరణ

### న్యూయార్క్‌లో మంత్రి కెటిఆర్‌తో గోల్డ్‌మెన్ సాక్స్ ప్రతినిధుల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చి చేరింది. అంతర్జాతీయ బ్యాంకింగ్, ఫైనాన్స్ దిగ్గజ సంస్థ గోల్డ్‌మెన్ సాక్స్ తెలంగాణలో తన భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఇప్పటికే తమ కార్యకలాపాలు ప్రారంభించిన గోల్డ్‌మెన్ సాక్స్ భారీ విస్తరణ దిశగా అడుగులేస్తోంది. హైదరాబాద్‌లో రెట్టింపు సిబ్బందితో తమ కార్యకలాపాలు విస్తరించనున్నట్లు గోల్డ్‌మెన్ సాక్స్ ప్రకటించింది. అమెరికాలోని న్యూయార్క్ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్‌తో గోల్డ్‌మెన్ సాక్స్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అదనంగా 2వేల మంది నిపుణులకు ఉపాధి కల్పించనుంది. సంస్థ విస్తరణతో హైదరాబాద్ మరింత బలోపేతమవుతుందని కెటిఆర్ అన్నారు. బ్యాంకింగ్,ఫైనాన్స్,ఇన్సూరెన్స్ రంగాల్లో మరింత బలోపేతం అవుతుందని కెటిఆర్ పేర్కొన్నారు. హైటెక్ సిటీలోని సలార్‌పురియా సత్వ నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన గోల్డ్‌మెన్ సాక్స్ ఆఫీస్‌ను మంత్రి కెటిఆర్ ఇప్పటికే ప్రారంభించారు. బిఎఫ్ఎస్ఐ రంగాల్లో హైదరాబాద్ నగరాన్ని అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని మంత్రి తెలిపారు.

# పెల్లుబుకుతున్న తిరుగుబాట్లు

>> ఇతర దారులు చేసుకుంటారని ఆయన అనుచర వర్గం స్పష్టం చేస్తోంది. కొత్తగూడెం నుంచి ఈసారి టికెట్ తనకే దక్కుతుందని ఆశించిన జలగం వెంకట్రావుకు సైతం టికెట్ దక్కకపోవడంతో ఆయన వర్గీయులు భవిష్యత్తు రాజకీయ పయనంపై త్వరలోనే సమావేశానికి సిద్ధమతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యను కలవడానికి హన్మకొండలోని నివాసానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెళ్లారు. పల్లాను కలిసేందుకు రాజయ్య నిరాకరించారు. ఎమ్మెల్యే రాజయ్య అంబుబాటులో లేకపోవడంతో ఆయన అనుచరులతో పల్లా సమావేశమయ్యారు. పార్టీ అధిష్ఠానం రాజయ్యకు సముచిత స్థానం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. రెండు,మూడు రోజుల్లోనే సిఎం కెసిఆర్‌ను కలుస్తామని తెలిలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజయ్య, కడియం శ్రీహరి, తాను కలిసి గులాబీ జెండా ఎగురవేయడానికి సిద్ధంగా ఉన్నామని పల్లా వెల్లడించారు. తాజాగా మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ కూడా బిఆర్ఎస్ పార్టీని వీడారు. వచ్చే ఎన్నికల్లో తాను కరీంనగర్ నుంచి పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సమాచారం. టికెట్ ఇస్తారన్న ఆశతో ఉన్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశానికి బిఆర్ఎస్ మొండి చేయి చూపడంతో నిరాశే మిగిలింది. దీంతో ఆ పార్టీకి ఆయన రాజీనామా చేశారు. నకిరేకల్ ఆత్మీయ సమ్మేళనంలో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వారం రోజుల్లో ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. బిఆర్ఎస్ నుంచి కొత్తగూడెం టికెట్ ఆశించిన తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావు నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో హెల్త్ డైరెక్టర్‌గానే కొనసాగుతారా? లేక వేరు దారి చూసుకుంటారా అన్న దానిపై చర్చ సాగుతోంది. ఒకవేళ ఆయన వేరే పార్టీలోకి వెళ్లి టికెట్ తెచ్చుకునే అవకాశం ఉంటే, హెల్త్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. మల్కాజగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుపై వేటుకు రంగం సిద్ధం అవుతోంది. ఆయన స్థానంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ మల్కాజగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ బిఆర్ఎస్‌ను వీడి బిజెపిలో చేరారు. ఆయనను తిరిగి పార్టీలోకి రప్పించి అభ్యర్థిగా ప్రకటించే విషయంలో మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తనకు టికెట్ ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు యాదగిరిగుట్టలో ఆత్మీయుల సమావేశం నిర్వహించి తాజా నిర్ణయం తీసుకోనున్నారు.

# విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు కార్మికులు మృతి

**శ్రీకాకుళం, ఆగస్టు 23 ప్రభాతవార్త** ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీ సెగిడిపేటలో ఓ వ్యవసాయ పొలంలో బోరు తవ్వుతున్న క్రమంలో విద్యుత్ వైర్లు తాకడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సెగిడిపేటకు చెందిన రైతు యాగాటి హేమాచలం పొలంలో వి.రమణ (రణస్థలం)కు చెందిన వాహనంతో బుధవారం బోరు బావిని తవ్వుతున్నారు. ఈ వాహనంలో ఒడిశాకు చెందిన ఐదుగురు కార్మికులు పని చేస్తున్నారు. బోరు తవ్వుతుండగా పైన విద్యుత్ తీగలు ఉన్నాయన్న విషయాన్ని మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో విద్యుత్ తీగలకు గొట్టాలు తాకి బిసుము సౌర (20), హుండ భాగ్థిరా (31) అనే కార్మికులు మృతి చెందారు. ఒడిశా నుంచి వీరురెండు నెలల క్రితం ఈ జిల్లాకు వచ్చి ఈ వాహనంతో వివిధ ప్రాంతాల్లో బోర్లు తవ్వుతున్నారు. ఒకే ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఐదుగురు కార్మికులు ప్రతిరోజు ఏదో ఒక చోట బోరు తవ్వే పనిలో ఉండేవారు. ఇదే క్రమంలో సెగిడిపేటలో బోరు తవ్వేపనిలో ఉండగానే గొట్టాలకు విద్యుత్ వైర్లు తాకడంతో ఇద్దరు కార్మికులను విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కాటేసింది.

# భారీ వర్షంతో మూడో టి20 మ్యాచ్‌రద్దు



## 2-0తో సిరీస్ భారత్ కైవసం

**డబ్లిన్,ఆగస్టు 23:** ఐర్లాండ్‌తోమూడు టి20ల సిరీస్‌ని 3-0తో క్లీన్‌స్వీప్‌చేయాలని పెట్టుకున్న టీమిండియా ఆశలు వర్షం వల్లబరిచింది.

బుధవారం జరగాల్సి ఉన్న మూడో టి20 మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దయిందిఇ. దాదాపు మూడున్నర గంటలపాటు వర్షం కురిసింది. అనంతరం వర్షం తగ్గినా మైదానం చిత్తడిగా మారడంతో మ్యాచ్‌నిర్వహణ సాధ్యం కాదని అంపైర్లు తేల్చారు. దీనితో మ్యాచ్‌రద్దుచేస్తున్నట్లు వెల్లడించారు.మొదటి రెండు టి20ల్లో విజయం సాధించిన భారత్‌ఈ సిరీస్‌ను 2-0తో కైవసంచేసుకుంది. కీలకమైన వన్డే ప్రపంచకప్‌ముందు ఐర్లాండ్ సిరీస్‌తోజస్‌ప్రీత్‌బుమ్రా రీ ఎంట్రీ ఇచ్చి మంచి ఫామ్‌చూపించాడు. రింకూసింగ్, ప్రసిద్‌కృష్ణ ఇదే సిరీస్‌లో భారత్ తరపున అరంగేట్రంచేసి అవకాశం ఇస్తారనుకున్నా మ్యాచ్‌రద్దవడంతో సాధ్యం కాలేదు. గత ఏడాది జరిగిన టి20 సిరీస్‌లోకూడా టీమిండియా విజేతగా నిలిచింది. ఈనెల 30నుంచి షురూ అవుతున్న ఆసియాకప్‌తో మళ్లీ టీమిండియా మైదానంలోకి వస్తుంది. ఆరుదేశాలుపాల్గొనే ఆసియా కప్‌టోర్నీలోసెప్టెంబరు రెండున తొలిమ్యాచ్ ఆడనుంది. చిరకాలప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఆమ్యాచ్‌లో భారత్ తలపడుతుంది. గ్రూప్‌ఏలో భారత్ పాకిస్థాన్,నేపాల్‌లు ఆడుతుండగాగ్రూప్‌బీలో బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక తలపడుతున్నాయి. వచ్చేనెల 17వ తేదీ ఫైనల్ ఉంటుంది.

# చెప్పిందల్లా చేయడానికి ముస్లింలు మీ బానిసలు కారు: కాంగ్రెస్ సీనియర్ నేత

**భోపాల్, ఆగస్టు 23:** మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ప్రచారాన్ని వేగవంతం చేవాయి. హిందూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు కాంగ్రెస్ నేతలు హిందూత్వ మంత్రాన్ని జపిస్తుండడంపై ఆ పార్టీ సీనియర్ నేత అజీజ్ ఖురేషి తమ పార్టీపైనే విమర్శలు చేయడం మధ్యప్రదేశ్ రాజకీయాల్లో సంచలనంగా మారింది. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ ఇటీవల కాలంలో ఎక్కువగా హిందూ దేవాలయాలను సందర్శిస్తూ, హిందుత్వ అస్త్రాన్ని ప్రయోగించడాన్ని తప్పుబట్టారు సీనియర్ కాంగ్రెస్ నేత అజీజ్ ఖురేషి(82). మంత్రిగానూ, ఎంపీగానూ, ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గానూ సేవలందించిన అజీజ్ ఖురేషీ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని మీరు చెప్పిందల్లా చేయడానికి ముస్లింలు మీ బానిసలు కాదని, కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని పార్టీలు ఈ విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. పోలీస్ శాఖలోనూ, రక్షణ శాఖలోనూ, బ్యాంకుల్లోనూ ముస్లింలకు ఉద్యోగాలు రావు, వారికి కనీసం బ్యాంకు లోనులు కూడా రావు, అలాంటప్పుడు మీకు ఎందుకు ఓటు వేయ్యాలని ప్రశ్నించారు. ముస్లింల ఇళ్ల, దుకాణాలు, మందిరాలు తగలబెడుతూ వారి పిల్లలను అనాథలుగా చేస్తుంటే చూస్తూ ఉంటారనుకోకండి. వారేమీ పిరికివారు కాదు. 22 కోట్ల మందిలో 2 కోట్ల మంది ప్రాణాలర్పిస్తే పోయేదేమీ లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ లీడర్లు గురించి మాట్లాడుతూ, ఈ మధ్య వారు కొత్తగా హిందూత్వ మంత్రాన్ని జపిస్తున్నారు. పార్టీ ఆఫీసుల్లో దేవుళ్ల ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నారు. ఓట్ల



కోసం దిగజారడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. దీనిపై కాంగ్రెస్ నేత కెకె మిశ్రా స్పందిస్తూ అది ఆయన అభిప్రాయమని కాంగ్రెస్ ఎప్పుడూ లౌకికవాదాన్ని విశ్వసిస్తుందని అన్నారు. ఇక బిజెపి నేత నరేంద్ర సాలూజ అజీజ్ ఖురేషీ చేసిన వ్యాఖ్యలను ఆధారం చేసుకుని కాంగ్రెస్ పార్టీకి మైరిటీలను బుజ్జగించే రాజకీయాలు అలవాటేనని రాహుల్ గాంధీ, కమల్ నాథ్ సహా కాంగ్రెస్ నాయకులంతా ఎన్నికల నేపథ్యంలో హిందువుల అవతారం ఎత్తుతారని మధ్యప్రదేశ్‌లో ఉండే 82 శాతం హిందూ ఓటర్లను ప్రభావితం చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని ఆయన అన్నారు. చేతనైతే ఖురేషీ అడిగిన దానికి సమాధానం చెప్పాలని అన్నారు.

# శ్రీలంకకు మళ్లీ చైనా పరిశోధక నౌక!



**కొలంబో, ఆగస్టు 23:** హిందూ మహా సముద్రంలోకి మరోసారి చైనా నిఘా నౌక ప్రవేశించనుంది. తమ రీసెర్చి నౌక షి యాన్-6 శ్రీలంకలో లంగరు వేయడానికి అవసరమైన అనుమతులను చైనా ఇప్పటికే కోరింది. ఈ విషయాన్ని కొలంబో ధ్రువీకరించింది. దీంతో భారత్‌కు మరోసారి భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తాయి. శ్రీలంక విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ప్రియాంగ్ విక్రమ సింఘే మాట్లాడుతూఇ, ' షి యాన్-6ను శ్రీలంకలో నిలిపివేసేందుకు బీజింగ్ అనుమతులు కోరింది. తేదీలను ఇంకా ఖరారు చేయలేదు. చైనా అభ్యర్థనను ప్రాసెస్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. చైనాకు చెందిన సిజిటిఎన్ ప్రకారం షి యాన్-6 నౌకలో సుమారు 60 మంది సిబ్బంది ఉంటారు. ఈ నౌక ఓషనోగ్రఫీ, సముద్ర గర్భ పరిశోధనలు చేస్తుంది. దీంతోపాటు మెరైన్ ఎకాలజీపై కూడా పరిశోధనలు నిర్వహిస్తుంది. తూర్పు, పశ్చిమ అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల్లో శ్రీలంక అత్యంత కీలకమైన ప్రదేశం. గతేడాది శ్రీలంకలోని హంబన్‌టోట రేవులో చైనాకు చెందిన యువాన్ వాంగ్-5 నైక లంగరేసింది. ఈ నౌక స్పేస్ క్రాంఫ్ట్‌లను ట్రాక్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని న్యూఢిల్లీ గూఢచర్య నౌకగా పేర్కొంది. తీవ్రస్థాయిలో అభ్యంతరాలను వ్యక్తం చేసింది. భారత రక్షణ కేంద్రాలపై ఇది నిఘా వేస్తుందని ఆరోపించింది. శ్రీలంకలోని హాంబన్‌టోట రేవును చైనా కంపెనీలు 99యేళ్ల లీజుకు తీసుకొని 2017 నుంచి నిర్వహిస్తున్నాయి. భౌగోళికంగా హిందూ సముద్రంలో భారత్ అత్యంత వ్యూహాత్మక స్థానంలో ఉంది. పసిఫిక్-హిందూ సహా సముద్రాల్లోకి ప్రయాణించేందుకు దగ్గరి మార్గమైన మలక్కా జల సంధి ఇక్కడే ఉంది. దీని నుంచి యేటా 90 వేల నౌకలు ప్రయాణిస్తాయి. వీటిలో సుమారు 9.4 బిలియన్ టన్నుల సరుకులు రవాణా అవుతాయి. ప్రపంచ వాణిజ్యంలో 40శాతం ఇక్కడి నుంచే జరుగుతోంది. దీనికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే భారత్‌కు చెందిన అండమాన్ దీవులున్నాయి. ఇక్కడ భారత త్రివిధ దళాల సంయుక్త కమాండ్ ఉంది. ఇది మన పొరుగు దేశం చైనాకు ఇబ్బందిగా మారింది. దీంతో భారత్‌ని దెబ్బతీసేలా వ్యూహాలు పన్నుతోంది. ఇందులో భాగంగా దక్షిణ చైనా సముద్రం, హిందూ మహా సముద్రంలోకి 33 కీలక ప్రదేశాల వద్దకు ఇక నుంచి క్రమం తప్పకుండా సర్వే నౌకలను పంపించాలని కొన్నాళ్ల క్రితం చైనా నిర్ణయించింది. ఈ విషయాన్ని నేషనల్ నేచురల్ సైన్స్ ఫౌండేషన్ ఆఫ్ చైనా అధికారికంగా ప్రకటించింది. చైనా నిర్ణయించిన సర్వే పాయింట్లలో రెండు భారత్ సమీపంలోనే ఉన్నాయి. అక్కడ ఏం సర్వేలు చేస్తాయో వెల్లడించలేదు. భారత్ గత కొన్నేళ్లుగా బంగాళాఖాతంలో పలు క్షిపణులును పరీక్షిస్తోంది. తాజాగా చైనా ప్రకటించిన సర్వే పాయింట్లు, క్షిపణి పరీక్షల రేంజిలో ఉన్నాయి. అంటే భారత్ చేపట్టే పరీక్షలను విశ్లేషించడానికి డ్రాగన్‌కు అవకాశం లభించనుంది. గతేడాది డిసెంబరులో భారత్ ఒడిశాలోని అబ్దుల్ కలామ్ ద్వీపం నుంచి 5000 కిలోమీటర్ల రేంజి అగ్ని-5 పరీక్షను నిర్వహించే నోటమ్' జారీచేసిన సమయంలో చైనా సర్వే నౌక యువాన్‌వాంగ్-5 హిందూ మహాసముద్రంలోకి వచ్చింది. ఇప్పటికే మయన్మార్‌కు చెందిన కోకో దీవుల్లోకి సైనిక పరికరాలు చేపట్టిందనే ఆరోపణలున్నాయి.

# విద్యుత్ కొరత రాష్ట్రాలకు సాయం

### ఉత్పాదక సామర్థ్య వినియోగంపై దృష్టి
### సర్ ప్లస్ పవర్ పోర్టల్‌లో కొన్నింటికి అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** విద్యుత్ కోతలను ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు మరింత త్వరితగతిన సహాయం చేసేందుకు కేంద్రం విస్తృత చర్యలు చేపట్టనుంది. ఇందులో భాగంగా విద్యుత్ డిమాండ్ పెరిగి వాటిని అధికమించేందుకు కొనుగోలుకు సహాయం చేసేందుకు జాతీయ స్థాయి ఉత్పాదక సామర్థ్య వినియోగ విధానాన్ని సరళీకృతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించింది. ఈ విషయమై హై ప్రైస్ డే ఎహెడ్ మార్కెట్ అండ్ సర్‌ప్లస్ పవర్ పోర్టల్ (పియుఎస్‌హెచ్‌పి)లో కొనుగోలు దారులు (విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు)), అమ్మకం దారులకు (విద్యుత్ ఉత్పత్తి సంస్థలు (జెన్‌కో))కు విస్తృత భాగస్వామ్యం కల్పించడానికి, వాటికి ప్రోత్సాహకాలను అందించడానికి అవసరమైన సూచనలు అందించాల్సిందిగా నేషనల్ పవర్ కమిటీ (ఎన్‌పిసి) మిగులు విద్యుత్ పోర్టల్ రాష్ట్రాలకు తాజాగా లేఖలు రాసింది. ఈ విషయమై కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖలోని సీనియర్ సెక్రటరీ ఒకరు వెల్లడించారు. విద్యుత్ కోతలను ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు విద్యుత్‌ను కొనుగోలు చేయడంలో సహాయ పడేందుకు ఈ పోర్టల్ జాతీయ స్థాయి ఉత్పాదక సామర్థ్య వినియోగ విధానాన్ని ఇప్పటికే కేంద్రం రాష్ట్రాలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యుత్ టారిఫ్‌లు సంబంధిత కమిషన్లతో నిర్ణయించడంతో పాటు, నియంత్రించబడతాయి. సాధారణంగా విద్యుత్ సంక్షోభం ఏప్రిల్, మే, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వివిధ రాష్ట్రాల్లో ఎర్పడటం సర్వసాధారణంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో నేషనల్ పవర్ కమిటీ రాష్ట్రాల విద్యుత్ డిస్కంలు, ఉత్పత్తి సంస్థలకు ముఖ్యంగా రిజర్వ్ షట్ డౌన్ (ఆర్ఎస్‌డి) కింద ఉన్న యూనిట్లకు ప్రోత్సాహకాలను అందిచే విషయంలో మరింత ఆకర్షణీయంగా ఉండేలా హై ప్రైస్ డే ఎహెడ్ మార్కెట్ అండ్ సర్‌ప్లస్ పవర్ పోర్టల్‌ను మెరుగు పరచడానికి ప్రాంతీయ విద్యుత్ కమిటీలు (ఆర్‌పిసిలు) సూచనలను అందించడం ద్వారా మరింత సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలో మెరుగైన, సరళీ కృత విధానాలతో రాష్ట్రాలకు మరింత విస్తృత సేవలను అందించ వచ్చని భావిస్తోంది. కాగా హై ప్రైస్ డే ఎహెడ్ మార్కెట్ అండ్ సర్‌ప్లస్ పవర్ పోర్టల్‌ను ఈ ఏడాది మార్చి 9వ తేదీన కేంద్రం ప్రారంభించింది. ఏప్రిల్ నెల 3వ తేదీ నుండి రాష్ట్రాలకు విద్యుత్ లావాదేవీలను నిర్వహించడం మొదలుపెట్టింది. ఈ విధానాన్ని ఇప్పటికే దేశంలోని 17 రాష్ట్రాలు వినియోగించుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంత వరకూ వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 14 వినతులను పరిష్కరించి కొత్త లబ్దిదారులైన రాష్ట్రా విద్యుత్ పంపిణీ సంస్థలకు మళ్లీ కరెంటును కేటాయించింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) చైర్మన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ దేశంలోని ఉత్తర, తూర్పు ప్రాంతానికి చెందిన రాష్ట్రాల నుండి భాగస్వామ్యం లేకపో వడం, అందుబాటులో ఉన్న మిగులు విద్యుత్‌ను పొందేందుకు పరిమితం ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఆయా రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ఈస్ట్రన్ రీజియన్ పవర్ కమిటీ (ఈఆర్‌పిసి), నార్తర్న్ రీజియన్ పవర్ కమిటీ (ఎన్నార్‌పిసి)పోర్టల్‌ను ఉపయోగించుకునేలా రాష్ట్రాలను ప్రోత్సహించవచ్చని ప్యానల్ నిర్ణయించింది.

# బ్రిక్స్ కీలక కార్యక్రమానికి జిన్‌పింగ్ డుమ్మా!



**సౌత్ ఆఫ్రికా, ఆగస్టు 23:** దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ ఎకనామిక్ గ్రూప్‌లోని బిజినెస్ ఫోరం సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ డుమ్మా కొట్టారు. ఆయన తరపున చైనా వాణిజ్య మంత్రి వాంగ్‌వెంటావ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికా ఆధిపత్య ధోరణిపై ఆవేశపూరితంగా ఆయన ప్రసంగించారు. వాస్తవానికి సోమవారం జిన్‌పింగ్ జొహన్నెస్‌బర్గ్‌లో అడుగుపెట్టారు. ఆయన షెడ్యూల్ ప్రకారం మంగళవారం మిగిలిన నేతలతో కలిసి బిజినెస్‌ఫోరం మీటింగ్‌లో ప్రసంగించాల్సి ఉండగా, ఈ కార్యక్రమానికి ఆయన హాజరు కాలేదు. దీనిపై చైనా నుంచి ముందస్తుగా ఎటువంటి సమాచారం లేదా వివరణ వెలువడలేదు. అదే సమయంలో అమెరికాను పరోక్షంగా తప్పుపడుతూ జిన్‌పింగ్ పంపిన ప్రకటనను చైనా వాణిజ్య మంత్రి చదివి వినిపించారు. తమకు తెలియకుండానే ప్రపంచ దేశాలు సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధంలో చిక్కుకోకూడదని పేర్కొన్నారు. ఇందులో ఆయన నేరుగా ఎక్కడా అమెరికా పేరును ప్రస్తావించలేదు.' ఆధిపత్యం కనబర్చాలనే కొన్ని దేశాల ధోరణి అదుపు తప్పింది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలు, మార్కెట్లను దెబ్బతీస్తోంది. ఎవరైతే వేగంగా అభివృద్ధి చెందుతున్నారో, వారిని అడ్డుకోవడమే లక్ష్యంగా మారుతుంది. కానీ ఇదంతా వ్యర్థం' అని వెల్లడించారు. తాజాగా బిజినెస్ ఫోరం మీటింగ్‌కు హాజరుకాని బ్రిక్స్ నేత జిన్‌పింగ్ ఒక్కరే. చివరికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా వర్చువల్ విధానంలో ప్రసంగించారు. చైనా విదేశీ వ్యవహారాలను సుదీర్ఘకాలంగా పరిశీలిస్తున్న వారు కూడా జిన్‌పింగ్ వ్యవహార శైలితో ఆశ్చర్యపోయారు.' చైనా చాలా ఆశలు పెట్టుకొన్న బ్రిక్స్ వంటి బహుళ పక్ష సదస్సు ప్రారంభ సమావేశంలో జిన్‌పింగ్ హాజరుకాకపోవడం చాలా అసాధారణ విషయం' అని విదేశీ వ్యవహారాల నిపుణులు ఒకరు పేర్కొన్నారు. ఏదో బలమైన కారణం ఉంటేనే జిన్‌పింగ్ గైర్హాజరై ఉంటారని చెబుతున్నారు.

# రష్యా సూపర్‌సానిక్ లాంగ్‌రేంజ్ బాంబర్ ధ్వంసం!



**మాస్కో, ఆగస్టు 23:** రష్యాలోని కీలక స్థావరాలపై ఉక్రెయిన్ డ్రోన్లు దాడులు చేసి భారీ నష్టాలను కలిగిస్తున్నాయి. తాజాగా రష్యాకు చెందిన సూపర్ సానిక్ విమానాలుండే షైకోవ్కా స్థావరంపై భారీగా బాంబింగ్ జరిగింది. ఇది ఉక్రెయిన్ సరిహద్దుకు 200 కిలోమీటర్ల దూరంలో ఉంది. గత వారాంతంలో నోవ్‌గ్రోడ్‌లోని స్టాల్ట్సీ మిలిటరీ ఎయిర్‌ఫీల్డ్‌పై కూడా దాడి జరిగినట్లు రష్యా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే పలు వరసల్లోని రష్యా రక్షణ వ్యవస్థలను దాటుకొని వచ్చి ఉక్రెయిన్ డ్రోన్లు ఈ దాడులు చేయడం విశేషం. షైకోవ్కా స్థావరం నుంచి రష్యా తపలోవ్ టీయూ-22ఎం3 సూపర్‌సానిక్ లాంగ్ రేంజి బాంబర్లను ఆపరేట్ చేస్తోంది. ఇవి తరచూ ఉక్రెయిన్‌లోని లక్ష్యాలను సుదూరం నుంచి ఛేదించేలా కెహెచ్-22 క్షిపణుల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా తాము చేసిన దాడిలో కనీసం ఒక రష్యా లాంగ్‌రేంజి బాంబర్ విమానం ధ్వంసమైపోయిందని ఉక్రెయిన్ ప్రతినిధి ఆండ్రీ యూసోవ్ పేర్కొన్నారు. ఈ దాడిని అత్యంత సమన్వయంతో నిర్వహించినట్లు వెల్లడించారు. రష్యా అంతర్గత భూభాగాల నుంచే వివిధ పనులను తాము చక్కబెడుతున్నట్లు ఆయన చెప్పారు.' ఉక్రెయిన్ డ్రోన్ అక్కడ ఉదయం 8 గంటల సమయంలో ల్యాండ్ అయింది' అని పేర్కొన్నారు. సాధారణ పౌరులు ఉపయోగించే కాప్టర్‌కు ఐఇడిని అమర్చి బ్యాటరీ సాయంతో దానిని పేల్చినట్లు తెలుస్తోంది. రష్యా అత్యంత శక్తిమంతమైన వ్యూహాత్మక బాంబర్లను మోహరించిన ఈప్రాంతంపై వారం వ్యవధిలో జరిగిన రెండో దాడి ఇది. నోవ్‌గ్రోడ్‌లోని స్లాట్సీ మిలిటరీ ఎయిర్‌ఫీల్డ్‌పై జరిగిన దాడిలో కూడా ఓ విమానం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. గతకొన్నాళ్లుగా ఉక్రెయిన్ దాడుల్లో చాలా రష్యా వాయు సేన స్థావరాలు దెబ్బతిన్నాయి. వీటిల్లో రెండులాంగ్‌రేంజి బాంబర్లు కూడా ఉన్నాయి.

# విమానప్రమాదంలో రష్యా వాగ్నార్‌చీఫ్ ప్రిగోజిన్ మృతి

**మాస్కో, ఆగస్టు 23:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌పై తిరుగుబాటును ప్రకటించిన ప్రైవేటు సైన్యాధ్యక్షుడు వాగ్నార్ దళ అధిపతి విమాన ప్రమాదంలోజరిపోయారు. టివర్ ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న విమానం కుప్పకూలిందని, దీనితో వాగ్నార్ చీఫ్ యెవ్‌గనీ ప్రిగోజిన్ ఇతరప్రయాణీకులతోపాటే చనిపోయినట్లు అధికారులు తెలిపారు. రష్యా విమానయాన సంస్థ రోసావియాట్సియా ప్రిగోజిన్ మరణాన్ని ధృవీకరించింది. మాస్కోలోని అత్యవసరపరిస్థితుల నిర్వహణ మంత్రిత్వశాఖ ప్రైవేటు ఎంబ్రాయర్ లెగసీ విమానం మాస్కోనుంచి సెయింట్‌పీటర్స్ బర్గ్‌కు వస్తుండగా మార్గమధ్యంలో కుజెన్‌కినో గ్రామం వద్ద కుప్పకూలిందని ప్రకటించారు. విమానంలో పది మంది ఉన్నారని, ముగ్గురు క్రూసిబ్బంది మొత్తం చనిపోయారని వెల్లడించింది. అయితే



మంత్రిత్వశాఖ మాత్రం ప్రిగోజిన్ ఉన్నట్లు ధృవీకరించలేదు. ఉక్రెయిన్‌యుద్ధంకోసం మాస్కో అధ్యక్షుడు పుతిన్ స్వయంగా నియమించుకున్న వాగ్నార్‌ప్రైవేటు సైన్యాన్ని ముందుండి నడిపించాడు ప్రిగోజిన్. తదనంతరం బెలారస్ అధ్యక్షుడు లుకాషెంకో మధ్యవర్తిత్వంతో తిరుగుబాటు తగ్గింది. వాగ్నార్‌చీఫ్‌కూడా రష్యానుంచి వీడి బెలారస్‌లోనే ఆశ్రయం పొందారు. అలాగే మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల్లో వాగ్నార్‌చీఫ్‌పై నమోదయిన దేశద్రోహం కేసులు మొత్తం అన్నింటిని విత్‌డ్రావ్‌చేసుకున్నారు. తిరుగుబాటు తర్వాతనే జులై నెలలో అధ్యక్షుడు జోబైడెన్ ప్రిగోజిన్‌కు ప్రాణహాని ఉంటుందని, రష్యాలో తిరుగుబాటు విఫలం కావడంతో పుతిన్ ఫోకస్ అంతా ఇపుడు ప్రిగోజిన్‌పైనే ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రిగోజిన్ నిత్యం భుజించే ఆహారంపట్లకూడా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమూలనుంచి ఎటువైపునుంచి అయినా ప్రిగోజిన్‌కు ప్రాణహాని ఉంటుందని బైడెన్ పేర్కొన్నారు. చివరకు ప్రిగోజిన్ విమాన ప్రమాదంలో మృతిచెందారు.

# టి.నాబ్‌కు చిక్కిన గంజాయి స్మగ్లర్లు

### రూ.50 లక్షల గంజాయితో పాటు
### రూ.3.5 కోట్ల ఇళ్లు, వాహనాలు,
### రూ. 1.53 కోట్ల ఎఫ్‌డిలు జప్తు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) పోలీసులకు గంజాయి అమ్ముతున్న మరో ముఠా పట్టుబడింది. ఈ ముఠాలో ముగ్గురు కరుడుగట్టిన స్మగ్లర్లతో పాటు ఓ బాలుడు వున్నాడు. వీరి వద్ద నుంచి 50 లక్షల రూపాయల గంజాయితో పాటు ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త చట్టం ప్రకారం మూడున్నర కోట్ల రూపాయల విలువచేసే భవనాలు, వాహనాలతో పాటు గంజాయి స్మగ్లింగ్ వల్ల సంపాదించిన 1.53 కోట్ల రూపాయలను బ్యాంకుల్లో ఎఫ్‌డిలుగా వుంచగా వాటిని కూడా జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టి.నాబ్ ఎస్‌పి గుమ్మి చక్రవర్తి బుధవారం మీడియాకు వెల్లడించారు. నగర శివార్లలోని శేరిలింగంపల్లిలోని నానక్‌రాంగూడకు చెందిన కలాపతి గౌతం సింగ్ (21), ఇతని సమీప బంధువులైన కలాపతి నితూభాయి (45), మధు బాయి (60)లు చాలా కాల ంగా గంజాయి విక్రయాలలో ఆరితేరారు. నగరంలోని ధూల్‌పేట్‌లో తమకు తెలిసిన స్మగ్లర్ల నుంచి కిలో గంజాయిని ఎనిమిది వేల రూపాయలకు కొనుగోలు చేసి ఆనక దానిని ఐదు గ్రాముల ప్యాకెట్లుగా మార్చి ఒక్కో దానిని 250 రూపాయలకు అమ్మడం వీరి ప్రత్యేకత. ఇలా కిలో గంజాయికి వీరు 50 వేల రూపాయలు సంపాదించసాగారు. ఈ ముఠాలోని గౌతం సింగ్‌పై ఇంతకు ముందు శేరిలింగంపల్లి అబ్కారీ పోలీసు స్టేషన్‌లో పలు కేసులున్నాయి. నితూభాయిపై ఇదే పోలీసు స్టేషన్‌లోనే ఆరు కేసులున్నాయి.

ఇవన్నీ గంజాయి అమ్మకాలకు సంబంధించినవే కావడం గమనార్హం. నీతూభాయిపై 2021లో పిడి అమలు చేసి ఏడాది పాటు జైలుకు తరలించగా ఆ తరువాత బెయిలుపై విడుదలైనా కూడా తన తీరును మార్చుకోకుండా మళ్లీ గంజాయి అమ్మకాలు సాగించసాగింది. కాగా ఈ ముఠా కదలికలపై గోల్కొండ పోలీసులకు పక్కా సమాచారం అందగా దీని ఆధారంగా టి.నాబ్ అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం నానక్‌రాం గూడలో నిఘా వుంచారు.

ఇదే సమయంలో గౌతం సింగ్, నీతూభాయి. మధుబాయితో పాటు ఓ 16 ఏళ్ల బాలుడు కలిసి స్కార్పియో కారులో వస్తుండగా పోలీసులు దాడిచేసి కారును సోదా చేయగా 22 కిలోల నాణ్యమైన గంజాయితో పాటు 281 గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వీటి విలువ 50 లక్షల రూపాయల వరకు వుంటుంది. వీరిని విచారించగా తమ నేరాన్ని అంగీకరిం చారు. గంజాయి స్మగ్లింగ్ ద్వారా వచ్చిన డబ్బులతో రెండిళ్లతో పాటు మరో 40 లక్షల 30 వేల రూపాయల ఆస్తులను కొన్నామని వారు అంగీకరించారు. దీంతో పాటు రెండు బైకులు. ఒక స్కార్పియో వాహనాన్ని కొన్నామని తెలిపారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లో వున్న వారి ఆస్తులను జప్తు చేసేందుకు సర్కారు తీసుకువచ్చిన కొత్త చట్టంలో భాగంగా వీరి ఆ స్తులను టి.నాబ్ అధికారులు జప్తు చేశారు.

దీంతో పాటు వీరికి సంబంధించి 16 బ్యాంకుల్లో వున్న కోటి 53 లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా జప్తు చేశారు. కాగా మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌తో పాటు వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని ఎస్‌పి చక్రవర్తి ఈ సందర్భంగా వెల్లడించారు. మాదకద్రవ్యాల స్మగ్లర్లకు సంబంధించిన సమాచారం ఎవరికి తెలిసి నా పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో టి.నాబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ఖుషి' చేసేందుకు జంట రెడీ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన ఖుషి రిలీజ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది.. మరో9 రోజుల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈచిత్రాన్ని దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించారు. తాజాగా సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుంది.. సెన్సార్ బృందం ఖుషి మూవీ కి యుబైఎ సర్టిఫికెట్ అందించింది.. సెప్టెంబర్ 1న పాన్‌ఇండియా స్థాయిలో థియేటర్లలో ఈచిత్రం విడుదల కానుంది..



టైటిల్ నుంచి టీజర్, పాటలు, ట్రైలర్‌తో అన్నివర్గాల ప్రేక్షకుల్లో ఆసక్తి కల్గించేలా సినిమా ఉంటుందన్నారు. విజయ్‌దేవరకొండ, సమంత కాంబినేషన్, లవ్‌ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ రూపొందించటంలో దర్శకుడు శివ నిర్వాణ హిట్ ట్రాక్. మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడక్షన్ గ్రాండియర్..ఇవన్నీ కలిసి ఖుషి మీద భారీ అంచనాలు తీసుకొచ్చాయి.. ఇక రీసెంట్‌గా సెన్సార్ నుంచి వచ్చిన హిట్ టాక్‌తో థియేటర్లలోప్రేక్షకులు, ఈసినిమాతో ఖుషి చేసుకోవటం ఖాయంగా అన్పిస్తోంది.. ఇటీవల మ్యూజిక్ కాన్సర్ట్ కూడ హిట్టయ్యింది. ఆడియెన్స్‌లో కావాల్సినంత బజ్ ఏర్పడింది.. భారీ అంచనాల మధ్య ఈచిత్రం సెప్టెంబర్ 1న ప్రేక్షకులముందుకు రాబోతోంది.

**మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోగా నటించిన చిత్రం గాండీవధారి అర్జున.. సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించింది.. ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తున్నారు..శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు25న గ్రాండ్‌గా విడుదల కానుంది.. ఈసందర్భంగా హీరో వరుణ్‌తేజ్ మీడియాతో మాట్లాడారు.**



## సామాజిక బాధ్యతలను గుర్తుచేసేలా ...

ప్రవీణ్ సత్తారు సినిమాలు స్టార్టింగ్ నుంచి చూస్తుంటాను.. తన కాన్సెప్ట్‌లోసెన్సిబిలిటీస్ ఉంటాయి.. విభిన్నమైన సినిమాలను చేయటానికి ప్రయత్నిస్తుంటాను.. చందమామ కథలు, గరుడవేగ వంటి సినిమాలను చూశాను.. గని సినిమా షూటింగ్ సమయంలో ఫోన్‌చేశాడు.. ఆ సమయంలో కథ గురించి నేనేమీ అడగలేదు.. యాక్షన్ సినిమా చేద్దాం అన్నాడు.. తను యాక్షన్ సినిమా అయితే బాగాచేస్తాడని సరేనని కలిశాను.. కథ విన్న తర్వాత యాక్షన్ మూవీస్ సాధారణంగా యాక్షన్, స్టైలిష్ అంశాల మీద ఫోకస్ ఎక్కువగా ఉంటుం ది.. కంటెంట్ తక్కువగా ఉంటుంది.. కానీ ప్రవీణ్ కథ చెప్పినపుడు తను మాట్లాడాలనుకున్న ఇష్యూ ఏదైతే ఉందో అది చాలా పెద్దదని నాకు ఓ యంగ్ స్టర్‌గా తెలుసు.. కానీ ఇపుడున్న బిజీలైఫ్ వల్ల ఆ సమస్యను ఎవరూ పట్టించుకోం..అది వెంటనే మనపైన ప్రభావం చూపేదికాదు.. దాని ఎఫెక్ట్ కొన్నేళ్ల తర్వాత ఉంటుంది.. ప్రవీణ్ చెప్పినపుడు కథలోని మెయిన్ పాయింట్, ఎమోషన్స్ నచ్చాయి.. నటుడికి ఓ సామాజిక బాధ్యతాయుతమైన పాత్రల్లో నటించే సినిమాలు తక్కువగా వస్తుంటాయి.. ఎఫ్2, ఎఫ్3 లాగా కామెడీ చేయాల్సి ఉంటుంది.. గని విషయానికొస్తే, యాక్షన్ విత్ ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా.. అయితే మంచి కథతో పాటు సామాజిక బాధ్యతలను గుర్తుచేసేలా ఉండే సినిమా చేయటం నాకు బాగుంటుందని అన్పించింది. అవకాశం ఉన్న ప్రతిసారి చేయాల్సిన అవసరం ఉందనిపించింది. గాండీవధారి అర్జున.. కథకు యాప్ట్ అయ్యే టైటిల్. ఈసినిమాలోనూ ప్రాబ్లమ్ వచ్చినపుడు హీరోని పిలుస్తారు. తను పేరు అర్జున్.. అందుకనే ఈ టైటిల్ పెట్టాం. ఇది స్పై సినిమా కాదు..ఇందులో నేను బాడీగార్డ్ రోల్ చేశాను. సాధారణంగా మన దేశానికి చెందిన ప్రతినిధులు ఇతర దేశాల్లో చర్చలకు వెళ్లినపుడు వాళ్లు అక్కడ ప్రైవేట్ సెక్యూరిటీని తీసుకుంటారు.ఇలాంటి వాళ్లలో దేశ రక్షణ వ్యవస్థలో పనిచేసేవాళ్లే ఎక్కువగా ఉంటారు. ఇది ఏదో సందేశం ఇచ్చి మీరు మారాలని చెప్పటం లేదు. ఇపుడున్న సమస్య ఏంటి? అనేదాన్ని చూపిస్తున్నాం.. దానివల్ల ఎవరైనా మారితే మంచిదే. నేను రీసెంట్‌గా సినిమాను చూశాను. నాకు నచ్చింది. ఈచిత్ర కథ నాలుగు రోజుల్లో జరిగే సినిమాగా తెరకెక్కించారు. ఆకటుటకునే యాక్షన్ సన్నివేశాలతోపాటుచక్కటి ఎమోషన్స్ ఉంటాయి.. కథ డిమాండ్ మేరకే సినిమాను లండన్‌లో షూట్‌చేశాం. ఇపుడు నేను చేస్తున్న మట్కా సినిమాలో నా పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయి. అందులో నా క్యారెక్టర్‌లో నాలుగుషేడ్స్ ఉంటాయి.. మట్కా అనే ఆట ఎలా ప్రారంభమైందనే కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది.

# 'రెంట్' మూవీ రిలీజ్ డేట్

జెఎంఎం జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై శివారెడ్డి, జాష్టిని, వనితరెడ్డి హీరోహీరోయిన్లుగా రఘువర్ధన్‌రెడ్డి దర్శకుడిగా బలగం జగదీష్ నిర్మించిన చిత్రం రెంట్.. ఈ హారర్ థ్రిల్లర్ ఆగస్టు 25న విడుదల కానుంది.. ఈచిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ, రఘువర్ధన్‌రెడ్డి మంచి టాలెంట్ ఉన్న దర్శకుడు అన్నారు. తాను కోడైరెక్టర్‌గా పనిచేస్తున్నపుడు నుంచి నాకు తెలుసు అన్నారు. ఈచిత్రాన్ని చూశానని చాలా బాగుందన్నారు. మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. ఆగస్టు 25న విడుదల అవుతందన్నారు. హీరో శివరెడ్డి మాట్లాడుతూ, ఈచిత్ర దర్శకుడు నన్ను హీరోగా అడిగినపుడు చాలా ఆనందం కల్గిందన్నారు. యూత్‌కు చాలా బాగా నచ్చుతుందన్నారు. మంచి యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయన్నారు. మంచి మెసేజ్ ఉందన్నారు. సినిమా అందరికీ నచ్చుతుందన్నారు. కార్యక్రమంలో నటుడు అమిత్, హీరోయిన్‌జాష్టిని, వనితరెడ్డి తదితరులు మాట్లాడారు.





న్యూ ఫోటో షూట్ శ్రియశరణ్

# 'అను' ఆకట్టుకుంటుంది: ఆమని

కార్తీక్‌రాజు, ప్రశాంత్ కార్తి, మిస్తి చక్రవర్తి, ఆమని, దేవి ప్రసాద్, భీమినేనిశ్రీనివాసరావు, పోసాని ప్రధాన పాత్రల్లో అవి క్రియేషన్స్ సమర్పణలోతెరకెక్కిన చిత్రం 'అను'.. తేజస్వి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై సందీప్ గోపిశెట్టి ఈసినిమాకు దర్శక, నిర్మాత బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కళ్యాణ్ చక్రవర్తి గుంపిన ఈసినిమాకు లైన్ ప్రొడ్యూసర్..బుధవారం ఈచిత్రం యూనిట్ మీడియా సమావేశం నిర్వహించింది.. ఆమని మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. నేను



ఇందులో చాలా మంచి పాత్రను కొత్త క్యారెక్టర్‌ను చేస్తున్నానని అన్నారు.నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక,నిర్మాత సందీప్‌కు థాంక్స్ అన్నారు. ఎపుడూ టెన్షన్ పడలేదని, సినిమాను బాగా తీశారన్నారు. కరోనా వల్ల కాస్త సమస్యలు వచ్చినా, ఆలస్యం అయినా ఎపుడూ టెన్షన్ పడలేదన్నారు. మంచి సందేశాత్మక చిత్రమన్నారు. సినిమాను అందరూ ఆదిరించాలన్నారు. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. దర్శక, నిర్మాత సందీప్ మాట్లా డుతూ, ఇది నా తొలి చిత్రమన్నారు. ఆమని, దేవిప్రసాద్, భీమినేని వంటి పెద్దవాళ్లందరూ నటించారనిఅన్నారు. ఈ మూవీ అద్భుతంగా వచ్చిందన్నారు. సెప్టెంబర్‌లో ఈసినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నానని అన్నారు. ప్రశాంత్‌కార్తి మాట్లాడుతూ, ఈ మూవీలో విలన్‌గా నటించినట్టు తెలిపారు. సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. కార్యక్రమంలో దేవీ ప్రసాద్, భీమనేని శ్రీనివాసరావు, లైన్‌ప్రొడ్యూసర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు మాట్లాడారు.

**విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఖుషి.. పాన్‌ఇండియా స్థాయిలోరిలీజ్‌కు రెడీ అయ్యింది. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో సినిమాటోగ్రాఫర్ జి.మురళీ మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..**



నేను పుట్టింది తమిళనాడులో.. చిన్న ప్పటి నుంచి ఎడ్యుకేషన్, పెయింటింగ్, సోషల్ ఇష్యూస్, పాలిటిక్స్‌పై ఇంట్రెస్ట్ ఉండేది.. విద్యార్థిగా ఉన్నపుడు కమ్యూనిస్ట్ ఆర్గనైజేషన్స్‌లో పనిచేశాను. కొన్నాళ్లకు సినిమా రంగంవైపు రావాలని ఇంట్రెస్ట్ కలిగింది.. లైఫ్‌లోఎక్కువగా ఊహించుకోవటం కంటే వాస్తవిక జీవితంలో ఉండటానికి ఇష్టపడతాను.. నేను సినిమాటోగ్రఫీ చేసే సినిమాలు చేసే అలా రియల్ లైఫ్‌కు దగ్గరగా ఉండాలని కోరుకుంటా.. నేను 2005నుంచి తెలుగ చిత్ర పరిశ్రమలో ఉన్నాను.. అందాల రాక్షసి మూవీకి పనిచేశాను.. ఆ తర్వాత

## మంచి విజువల్ బ్యూటీ మూవీ

నేనుచేసిన లవ్,ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఖుషి..నే.. మైత్రీ రవిగారి ద్వారా ఈ ప్రాజెక్టులోకి వచ్చాను.. ఈసినిమాకు మైత్రీ మూవీ ప్రొడ్యూసర్స్ బ్యాక్‌బోన్ అని చెప్పొచ్చు. ఎందుకంటే వారికి సినిమాల మీద ఉన్నంత ఫ్యాషన్ నేను ఇంకోప్రొడక్షన్‌లో చూడలేదు. సినిమా బాగా వచ్చేందుకు ఏది కావాలన్నా సమకూర్చుతారు.. ఫిలిం మేకింగ్‌లో వాళ్లు ఎంతో ఇంట్రెస్ట్ చూపిస్తారు. ప్రేమ గురించి కొన్ని కలలు కనే యువకుడికి లవ్, లైఫ్ అంటే మన ఊహలకు అనుగుణంగా ఉండదని తెలిసిరావటమే ఈసినిమా నేపథ్యం.. మణిరత్నం సినిమాల్లో సినిమాటోగ్రాఫర్ పిసి శ్రీరామ్ చూపించే విజువల్స్ బ్యూటీ ఈచ్తిరంలోచూస్తారు.. అయితే ఇలాంటి సీన్స్‌ను మేం కాపీ కొట్టలేదు.. అలాంటి ఫీల్ కల్గించేలా విజువల్స్ ఉంటాయి.దర్శకుడు శివ వ్యక్తిగతంగా చాలా మంచివాడు.. సినిమా మేకింగ్ మీద ఇష్టం ఉన్న దర్శకుడు. సినిమాకు సంబంధించిన ప్రతి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాడు.. సినిమా గురించే ఆలోచిస్తుంటాడు.. ఆయనమ్యూజిక్ సెన్స్ సూపర్.. ఇవాళ ఖుషిలో ఇంత మంచి మ్యూజిక్ వచ్చిందంటే దానికి శివ నిర్వాణ మ్యూజిక్ టేస్ట్ కారణం. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఖుషి ఉంటుంది.. ఇందులోవిప్లవ్, ఆరాధ్య క్యారెక్టర్లలో విజయ్, సమంత నటిస్తునానరు. ఈసినిమాతో సమంతతో కలిసి తొలిసారిగా పనిచేశాను.. ఖుషిలో బ్యూటిఫుల్ ఫీల్ గుడ్ విజువల్స్ తెరపైకి తీసుకొచ్చే అవకాశం కలిగింది.. ఫుల్ లైఫ్ తెరపై చూపిస్తున్నఫీలింగ్ కలిగింది.. ఈసినిమా చూడటం పూర్తయ్యాక మీకు కొత్త అనుభూతి కలుగుతుంది.. కెమెరా ద్వారా ఆ ఎమోషన్ తీసుకొచ్చేందుకు నా ప్రయత్నం చేశాను.

**టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్‌బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి కన్నడ బ్లాక్‌బస్టర్ హాస్టల్ హుడుగారు బేకగిద్దరేను తెలుగులో బాయ్స్‌హాస్టల్ పేరుతో విడుదల చేస్తున్నారు. నితిన్ కృష్ణమూర్తి దర్శకుడి పరిచయం అవుతున్నారు. ఈచిత్రం ఆగస్టు 26న విడుదల కానున్న నేపథ్యలో నిర్మాత సుప్రియ యార్లగడ్డ మీడియాతో మాట్లాడారు. ఆవిశేషాలు.**

## క్రేజీ, ఫన్ రైడ్



**నేరుగా పెద్ద సినిమాలు నిర్మించే సామర్థ్యం ఉన్న మీరు డబ్బింగ్ సినిమాను చేయటానికి కారణం?**

మంచి సినిమా కాబట్టే... ట్రైలర్ చూడగానే నవ్వొచ్చింది.. ప్రపంచంలో కెల్లా మంచి ప్రేక్షకులు మన దగ్గర ఉన్నారు. మంచి కంటెంట్ ఇస్తే చాలా గొప్పగా ఆదరిస్తు న్నారు. డిస్ట్రిబ్యూషన్ పరంగా మంచి సినిమలు విడుదల చేయటంలో అందరికీ మంచి జరుగుతుంది.. ఈసినిమా అన్నపూర్ణ స్టూడియోస్‌కి వాల్యు యాడెడ్‌గా ఉంటుంది

**మీరు రెడీ చేసే ప్రొడక్ట్స్‌కి, వేరే భాషల్లో రెడీ అయిన ప్రొడక్ట్‌ను మార్కెట్ చేయటానికి ఎలాంటి తేడా ఉంటుంది?**

ఆసినిమాలో పల్స్ అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఒకప్పటి డబ్బింగ్ సినిమాకు ఇప్పటికీ చాలా తేడా ఉంది.. ఇపుడు తెలుగులోవిడుదల చేస్తే అంది తెలుగు సినిమాగా కన్పించాలి.. క్వాలిటీ విషయంలో ప్రేక్షకులు ప్రత్యేకంగా ఉంటున్నారు. ఈ సినిమానుచూడగానే డబ్బింగ్ చాలా కష్టం అన్పించింది.. ఎందుకంటే వందకుపైగా వాయిస్‌లు ఉన్నాయి.. హాస్టల్‌లో అల్లరి చేయటమే ఎనర్జీ.ఫన్,, చాలా కేర్ తీసుకుని ప్రతి వాయిస్‌ను నేటివిటికి తగ్గట్టు డబ్ చేశామన్నారు.. సినిమా చూస్తున్నపుడు తెలుగు సినిమాలానే ఉంటుంది.. అంత నాచురల్‌గా వచ్చింది..

**డబ్బింగ్, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ఎలా జరిగాయి?**

అన్నపూర్ణలోమూడు డబ్బింగ్ స్టూడియోలు ఉన్నాయి.. అయితే ఈసినిమాను ఆరు డబ్బింగ్ స్టూడియోస్‌లో డబ్‌చేశాం.. అన్నివాయిస్‌లుఇందులో ఉంటాయి. అలాగే రైటింగ్‌పై కూడ చాలా శ్రద్ధపెట్టాం.. ఒకేసారి పదిమంది మాట్లాడుతుంటే అందులో జోక్స్ పేలుతాయి.. దాన్నితెలుగులో రాయటం అంత ఈజీ కాదు.. దీన్నిచాలా చక్కగా రీక్రియేట్ చేశాం..

**అన్నపూర్ణ సినిమాల నిర్మాణంలో కొంత గ్యాప్ వచ్చింది కదా.కారణం?**

ఇపుడున్న పరిస్థితుల్లో సినిమా తీసే విధానం, పరుగుమారిపోయింది.. మేం యాభై ఏళ్లుగా నిలకడగానే ఉన్నాం. దాదాపుగా ఏడాదికి ఒక సినిమా చేస్తూనే ఉన్నాం.. ఈ విషయంలో మేం పెద్దగా మారలేదనే అనుకుంటున్నాం.

**నాగార్జున గారి 100 సినిమాకు స్పెషల్‌గా ప్లాన్‌చేస్తున్నారా?**

ఇది నాగార్జునగారిని అడగాలి..నేను ఏదైనా చెప్తేనాకు పడతాయి (నవ్వుతూ)

**చైతు,అఖిల్‌తో ప్రాజెక్టులు ఉన్నాయా?**


ప్రాజెక్టు లైన్‌లో ఉన్నాయి.

# వెన్నెల కిశోర్ హీరోగా'చారి 111'



వినోదానికి కేరాఫ్ అడ్రస్ వెన్నెల కిశోర్.. మేన రిజమ్స్ కావచ్చు, డైలాగ్ డెలివరీ కావచ్చు.. నటన తో కావచ్చు.. వినోదంలో వైవిధ్యం చూపిస్తూ ప్రేక్షకులకు నవ్వులు పంచుతూ అలరిస్తున్నారు. హాస్యనటుడిగా మాత్రమే కాదు.. కథానాయకుడిగానూ తనకు నూటయ్యే క్యారెక్టర్లు వచ్చినపుడు సినిమాలు చేస్తుంటారు.. వెన్నెల కిశోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం చారి 111. ఆయన హీరోగా బర్కత్ స్టూడి యోస్ పతాకంపై ఆదితి సోనీనిర్మిస్తున్న సినిమా చారి 111. టీజీ కీర్తికుమార్ దర్శకత్వం వహిస్తు న్నారు.. సుమంత్ హీరోగా నటించిన హిట్ సినిమా మళ్లీ మొదలైంది.. తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది.. ఇందులో వెన్నెల కిశోర్ సరసన సంయుక్తా విశ్వనాథ్ హీరోయిన్‌గా నటిస్తోంది. మురళీ శర్మ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. బుధ వారం ఈసినిమాను ప్రకటించటంతో పాటు కాన్సెప్ట్ టీజర్ కూడ విడుదల చేశారు. ఎపుడూ ప్రశాం తంగా ఉండే సిటీకి ప్రమాదం వచ్చి పడుతుంది.. దాని ని ఎదిరించటం కోసంమాజీ ఆర్మీ అధికారి ప్రసాద్‌రావు వస్తారు. .అసలు ఆ సమస్య ఏంటి. విలన్ ఎవరు.?; అనేది వెల్లడించలేదు.. కానీ హీరో క్యారెక్టర్ ఏమిటనేది చాలా క్లారిటీగా చూపిం చారు. కన్‌ఫ్యూజ్డ్ స్పై పాత్రలో వెన్నెల కిశోర్ వినోదం అందించనున్నారు.. ఈషా పాత్రలో హీరోయిన్ సంయుక్త విశ్వనాథన్, మహి పాత్రలో ప్రియా మాలిక్ నటిస్తున్నారు. దర్శ కుడు టీజీ కీర్తికుమార్ మాట్లాడుతూ, ఇదొక యాక్షన్ కామెడీ మూవీ అన్నారు. ఇందులో వెన్నెల కిశోర్ గూఢచారి పాత్రలోకన్పిస్తారన్నారు. ఓసిటీలో జరిగే అనుమా నాస్పద ఘటనలను వేధించే రహస్యగూఢచారి పాత్రలో ఆయన లుక్స్ స్టైలిష్‌గా ఉంటాయన్నారు. నిర్మాత ఆదితి సోనీ మాట్లాడుతూ, స్పై జానర్ సినిమాల్లో చారి 111 కొత్తగా ఉంటుందన్నారు.. వెన్నెల కిశోర్ నటన, టీజీ కుమార్ దర్శ కత్వం సినిమాకు హైలెట్ అవుతాయన్నారు. కథలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయన్నారు.

# ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ ఆలిండియా హక్కులు



ప్రముఖ క్రికెటర్ టెస్ట్ క్రికెట్‌లో 800 వికెట్లు తీసిన ఏకైక బౌలర్ శ్రీలంకన్ ఆఫ్‌స్పిన్నర్ ముత్త య్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 800. మూవీ ట్రైన్ మోషన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది.. మురళీధరన్ పాత్రలో స్లమ్ డాగ్ మిలియనీర్ ఫేమ్‌మధుర్ మిట్టల్, మురళీధరన్ భార్య మదిమలర్ పాత్ర లో మహిమా నంబియార్ నటిస్తు న్నారు.. ఈచిత్రానికి ఎంఎస్ శ్రీపతి దర్శకుడు.. బుక్‌ప్రైజ్ 2022 పురస్కార గ్రహీత షెహన్ కరుణ తిలకతో కలిసి ఆయన స్క్రిప్టు అందించారు. ఈచిత్రం ఆలిండియా పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాత, శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సొంతం చేసుకున్నారు. తమిళంలో రూపొందించిన ఈచిత్రాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీషుభాషల్లో విడుదల చేయను న్నారు.. ఏడాదిన్నర పాటు చిత్ర బృందం ఎంతో శ్రమించి సినిమా తీశారు. శ్రీలంక, ఇంగ్లాడ్, ఆస్ట్రేలియా, చెన్నై, కొచ్చిన్,చండీఘర్ లోచిత్రీకరణ చేశారు. భారీ వ్యయంతో తెరకెక్కిన చిత్రమిది. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడారు.. ముత్తయ్య మురళీధరన్ బయోపిక్‌లో నిజజీవితంలో ఆయన ఎదుర్కొన్న ఎన్నో సంఘటనలు, ఎత్తుపల్లాలు, భావోద్వేగ భరితంగా ఉంటాయన్నారు.. ఇలాంటి పరిస్థితులను ఆధిగమిస్తూ 800 వికెట్లు తీసి వరల్డ్ రికార్డు సాధించిన ఘనత మురళీధరన్ సొంతం అన్నారు. సెప్టెంబర్‌లో ట్రైలర్, అక్టోబర్‌లో సినిమాను విడుదల చేయటానికి సన్నాహాలుచేస్తున్నామన్నారు.



# వలసలకు అడ్డుకట్ట వేసి..



తన గ్రామం నుంచి వలస వెళ్లి పోతున్న వాళ్లను చూసి చలించిపోయింది జ్యోతి. పట్టణాలలో ఉపాధి దొరికితే డబ్బు వస్తుంది కానీ. మన ఊరు వెలవెలబోతుంది. నేల బీడువారుతుందని నచ్చచెప్పి ఒప్పించింది. సేంద్రియ వ్యవసాయం దిశగా వాళ్లని నడిపించి వలసలకు అడ్డుకట్ట వేసింది. ఝార్ఖండ్‌లోని కోటింగ్ సెరా గ్రామాన్ని సుసంపన్నం చేసిన 'జ్యోతి ఖండిత ' విజయం గూర్చి తెలుసుకుందాం...

సెరా గ్రామ వాసులకు కష్టపడి సాగు చేద్దామని ఉన్నా వర్షాలు, వసతులు తక్కువ. ఎంత కష్టపడ్డా దిగుబడి వచ్చేది కాదు. ఇక కొవిడ్ సమయంలో ఈ పరిస్థితి ఇంకా దిగజారింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా ఏటా సెరా గ్రామం ఉన్న గుమ్మా జిల్లా నుంచి ఐదు లక్షల మంది వలసెళ్లిపోతున్నారు. ఈ పరిస్థితి జ్యోతిలో దిగులు పుట్టించింది. ఇలా ఊరు నుంచి ఒక్కొక్కరూ వ్యవసాయాన్ని విడిచి వలస బాట పడుతుంటే గ్రామంలో ఒక్కరూ మిగలరనుకుంది. వాళ్ల మనసు మార్చడం అంత తేలిక్కాదని తనకీ తెలుసు. తనే రంగంలోకి దిగి వ్యవసాయం లాభసాటిదని నిరూపిస్తే తప్ప ఈ పరిస్థితులు మారవని అనుకుంది. ఖరీదైన రసాయనాల స్థానంలో ప్రకృతి సిద్ధమైన సేంద్రియ విధానాలు ఉపయోగించి సాగు మొదలుపెట్టింది. నైపుణ్యాల కోసం 'ప్రధాన్ సంస్థాన్' అనే ఎన్‌జిఒలో చేరింది. ఇక్కడ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, శిక్షణ అందిస్తారు. 'క్లాప్' (కాంప్రహెన్సివ్ లైవ్లీ అడాప్టేషన్ పాత్‌వే' పద్ధతి ద్వారా తక్కువ నీటితో, కొద్దిపాటి స్థలంలో..ఎక్కువ దిగుబడినిచ్చే పంటలు పండించడం ఎలానో ఇక్కడ నేర్పుతారు. 'నేను సేంద్రియ వ్యవసాయం ప్రారంభించాకా ఖర్చులు తగ్గాయి. ఆదాయం పెరిగింది. నన్ను చూసి మిగిలిన మహిళలూ ఈ సంస్థలో చేరారు. ఈ వ్యవసాయంలో మెలకువలు తెలుసుకున్నారు. ఇప్పుడు మా గ్రామంలో 150 మంది మహిళలు రసాయనాలు లేని సాగు చేస్తూ కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టుకోగలిగారు అంటోంది జ్యోతి.

**ఆడవాళ్లే ముందుకొచ్చారు...** 'మగవాళ్లు పని వెతుక్కుంటూ నగరాలకు వలస వెళ్లినా గ్రామాల్లో మహిళలు సేంద్రియ వ్యవసాయాన్ని ధైర్యంగా మొదలుపెట్టారు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. అది చూసిన మగవాళ్లు వెనక్కి వచ్చి సాగు మొదలుపెట్టారు. ఇలా వలస వెళ్లిన 300 కుటుంబాల మగవాళ్లు నగరాల నుంచి తిరిగి వచ్చేశారు. సేంద్రియ వ్యవసాయ పనుల్లో మహిళలకు సాయం



చేస్తున్నారు. ఈ విజయం నా ఒక్కదానిదే కాదు కోటెంగ్ సెరాలోని 150 మంది మహిళలది. సేంద్రియ వ్యవసాయం వల్ల గ్రామం ఆర్థికంగా బలోపేతం అయింది. దీనికి తోడు ప్రభుత్వ సహకారం తోడవ్వడంతో అభివృద్ధి సాధ్యమైందంటున్నారామె.❑

# స్క్రబ్ చేద్దాం ..



వాతావరణ మార్పుల కారణంగా చర్మంపై మృతకణాలు ఏర్పడతాయి. వీటి వల్ల మళ్లీ మొటిమలు, మచ్చలు, తొలగించడానికి ఖరీదైన స్క్రబ్‌లే అక్కర్లేదు. ఇంట్లో దొరకే సహజసిద్ధ పదార్థాలతోనే సమస్య దూరం చేసుకోవచ్చు. ఎలాగంటే..

చెంచా బేకింగ్‌సోడాలో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి పేస్టులా చేయాలి. దీన్ని ముఖానికి వలయాకారంలో మర్దనా చేస్తూ పట్టించాలి. ఆరాక చల్లటి నీటితో కడిగితే చాలు. చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి.

**ఓట్‌మీల్‌తో..** రెండు చెంచాల ఓట్‌మీల్‌కి అంతే పరిమాణంలో పెరుగు కలిపి ముఖానికి పట్టించాలి. ఆరాక గోరువెచ్చని నీటితో శుభ్రపరిస్తే ముఖం తేటగా కనిపిస్తుంది.

**నిమ్మతో....** టేబుల్ స్పూన్ బ్రౌన్‌షుగర్‌లో కొద్దిగా నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి.. పూర్తిగా ఆరాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే ట్యాన్ తొలగిపోతుంది.

**అరటితో..** ఒక అరటిపండు గుజ్జుకి రెండు చెంచాల బాదం పేస్టు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పది నిమిషాల తర్వాత శుభ్రం చేసుకుంటే చాలు. ముఖం నిగారిస్తుంది.

**స్ట్రాబెర్రీతో...** మూడు స్ట్రాబెర్రీలను మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దీనిలో కొద్దిగా తేనె వేసి బాగా కలపాలి. ఈ పేస్టును ముఖంపై సున్నితంగా మర్దనా చేయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే చర్మం తేటగా కనిపిస్తుంది.

**కీరతో..** కీరదోస రసంలో కొద్దిగా వంటసోడా కలిపి ముఖానికి రాయాలి. పావుగంటయ్యాక చల్లటి నీటితో కడిగితే సరి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం ఛాయ మెరుగవుతుంది.

**తేనెతో..** నాలుగు చిన్న అవకాడో ముక్కలు తీసుకుని మెత్తని పేస్టులా చేయాలి. ఈ మిశ్రమానికి ఒక చెంచా తేనె కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే చక్కని ఫలితం ఉంటుంది. ❑

# శ్రావణ లక్ష్మికి వాలుజడ






శ్రావణమాసంలో పూజలు, వ్రతాల కోసం ఇంటిని, పూజగదిని, రంగుల ముగ్గులతో తీర్చిదిద్దుతాం. అమ్మవారికి నగలు వేస్తాం. పట్టుచీరలు కట్టేస్తాం. అయినా సరే ఏదో వెలితి కనిపిస్తోందా! అయితే, జడబిళ్లలూ, పువ్వులూ, సూర్యచంద్రులు, పాపిటబిళ్లలు వంటి హంగులతో తయారుచేసిన ఈ రెడీమేడ్ కొప్పులూ, జడలతో లక్ష్మీదేవిని సిద్ధం చేయండి. సిరుల తల్లి రూపు మరింత నిండుగా కనిపిస్తుంది. మనికి సమయమూ కలిసి వస్తుంది. భలే చూడముచ్చటగా ఉన్నాయి కదూ!








# మానసిక ఆందోళనకు..

మనకు అనేక సందర్భాల్లో తలనొప్పి వస్తుంటుంది. ఒక్కోసారి మనసంతా దిగులూ దుఃఖం ఆవరించినట్లుగా అలసటగా, అశాంతిగా ఉంటుంది. దీని నుంచి బయటపడేందుకు పశ్చిమోత్థాసనం వేసి చూడండి. ఇది అనేక శారీరక సమస్యలను నివారించడంతో పాటు మానసిక ఆందోళన నుంచి కూడావిముక్తుల్ని చేస్తుంది.

**ఎలా చేయాలి...** కాళ్లు ముందుకు చాపి కూర్చోవాలి. మెల్లగా శ్వాస తీసుకుంటూ చేతులను పైకి లేపాలి. శ్వాస వదులుతూ ముందుకు వంగి తలను కాళ్ల మీద ఆనించి చేతులతో పాదాలను పట్టుకోవాలి. కష్టమనిపిస్తే వెన్నును వంచగలిగినంత వరకే వంచండి. కొన్ని రోజుల తర్వాత పొట్ట, ఉదర భాగం కాళ్లకు తాకేలా వంగుతుంది. కిందికి వంగినప్పుడు దీర్ఘంగా శ్వాస తీసుకుని 20 లేదా 30 సెకన్లు ఆపి ఉంచాలి. మెల్లగా శ్వాస వదులుతూ తలను పైకి లేపాలి. ఇలా మూడు సార్లు చేయాలి. అన్ని ఆసనాల్లాగే ఇది కూడా ఖాళీ కడుపుతో చేయాలి. ఉదయాన్నే వీలవ్వకపోతే మూడు గంటలపాటు ఆహారం తీసుకోకుండా ఉన్నప్పుడు చేయొచ్చు.




**ప్రయోజనాలు....** ఈ ఆసనంతో వెన్నెముక, భుజాలు, పొత్తికడుపు, తడ భాగాలు బలం పుంజుకుంటాయి. జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. ఊబకాయం తగ్గుతుంది. తలనొప్పి, యాంగ్జయిటీ, డిప్రెషన్‌ల నుంచి ఉపశమనం కలుగుతుంది. నెలసరిలో సమస్యలు తగ్గుతాయి. నిద్రలేమికీ మంచిది.

**ఎవరు చేయకూడదు..** ఉబ్బసంతో బాధపడుతున్న వారు ఈ ఆసనం చేయకూడదు. ఏదైనా అనారోగ్యం ఉన్న రోజుల్లో చేయకూడదు. వెన్ను సంబంధ సమస్యలున్న వారు యోగా శిక్షకుల నేతృత్వంలోనే చేయాలి.❑

**చెలి చిట్కా**

యాపిల్స్ తరిగాక అవి త్వరగా రంగు మారిపోతాయి. అలా కాకుండా ఉండాలంటే.. వాటిపై కొద్దిగా నిమ్మరసం చల్లండి. లేదా కత్తికి కొద్దిగా నిమ్మరసం రాసి ఆ తర్వాత యాపిల్‌ను కోయండి. ❑

# రైస్ ఖీర్



**కావలసినవి :** బియ్యం-కప్పు, పాలు-ఒకటిన్నర లీటరు (వెన్న తీయనవి), చక్కెర-కప్పు, యాలకుల పొడి 6టీ స్పూన్, కుంకుమ పువ్వు-చిటికెడు లేదా 15 రేకలు, బాదం-టేబుల్ స్పూన్, పిస్తా-టేబుల్ స్పూన్, కిస్‌మిస్-టేబుల్ స్పూన్.

**తయారీ :** బియ్యం కడిగి 15 నిమిషాల సేపు నానబెట్టాలి. చిన్న పాతలో నీటిని వేడిచేసి బాదం, పిస్తా వేసి మూత పెట్టాలి,

- అరగంట తర్వాత పొట్టు తీసి సన్నగా తరగాలి.
- కిస్‌మిస్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి.
- బియ్యం నానిన తర్వాత స్టవ్ మీద వెడల్పు పాత్ర పాలు పోసి మరిగించాలి.
- ఒక గరిటెడు పాలు విడిగా తీసుకుని కుంకుమ పువ్వు రేకలను నానబెట్టాలి.
- బియ్యంలోని నీటిని వంపేసిబియ్యాన్ని మరుగుతున్న పాలలో వేసి ఉడికించాలి.
- బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత చక్కెర వేసి కలిపి సన్నమంట మీద ఉడికించాలి.
- అన్నం ఉడికిందని నిర్ధారించరుకున్న తర్వాత యాలకుల పొడి, బాదం, పిస్తా తరుగు, కిస్‌మిస్, కుంకుమ పువ్వు కలిపిన పాలు పోసి బాగా కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. రైస్ ఖీర్ రెడీ.
- ఖీర్ దగ్గరయ్యే వరకు ఉడిచించాల్సిన అవసరం లేదు.
- స్టవ్ ఆపేసిన తర్వాత చల్లారే కొద్దీ దగ్గరవుతుంది.❑

# చికిత్సే చక్కని పరిష్కారం

**ప్రశ్న :** మా కోడలి వల్ల మా, అబ్బాయికి మనశ్శాంతి లేకుండా పోతున్నది. ఆమె పిచ్చి చేష్టలు, తిక్క పనులు వల్ల అందరం ఇబ్బంది పడుతున్నాము. ఇద్దరు పిల్లల తల్లి అయిన ఆమెలో మాతృత్వం కొద్దిగా కూడ కనిపించడంలేదు. అలాగే ఇల్లాలిగా ఇమడలేక నానా యాతనలకు గురి చేస్తున్నది. ఆమె తల్లి దండ్రులు కూడ వివేకరహితంగా ఆమెను వెనుక వేసుకొస్తున్నారు. మా అబ్బాయి డిగ్రీ వరకు చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. పదేళ్ళ క్రితం మాకు తెలిసిన వారి అమ్మాయిని చూసి నచ్చి పెళ్ళి చేశాము. ఆమె బి.టెక్ వరకు చదివింది. అయితే ఉద్యోగం రాక పోవడంతో ఇంటివద్దే ఉండేది. మా అబ్బాయిది ప్రభుత్వ ఉద్యోగం అని తెలియడంతో వెంటబడి పెళ్ళి చేసుకున్నది. అమ్మాయి తల్లిదండ్రులది మధ్యతరగతికుటుంబమే. అయితే పెళ్లయి నప్పటి నుంచి మా ఇంట్లో ఫర్నిచర్ బాగాలేదని, ఇల్లు చిన్నదని అసంతృప్తి వ్యక్తం చేసేవారు. మా కోడలు రోజు భర్తను అదికొను, ఇదికొను అంటు వేధించేది. ఆమెను సంతృప్తి పరచడానికి నానా తంటాలు పడేవాడు. ఏడాది తరువాత పోరుపెట్టి వేరు కాపురం పెట్టించింది. వారిద్దరూ సుఖంగా ఉంటే చాలని మేము అడ్డుచెప్పలేదు. అక్కడ కూడా రోజు అలిగిపోవడం, ఏడవడం చేస్తుంటే ఏమి చేయాలో తెలియక డాక్టర్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ డాక్టరు కొన్ని పరీక్షలు చేసి థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నదని చెప్పి మందులు ఇచ్చారు. మూడు నెలల తరువాత గర్భం దాల్చింది. తరువాత పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అన్నది తెలుసుకోవడానికి స్కానింగ్ చేద్దామని మా అబ్బాయిని అడిగింది. అమ్మాయి అయితే గర్భస్రావం చేయించుకుంటానని చెప్పింది. దీనికి మావాడు సమ్మతించక పోవడంతో అసంతృప్తితోనో గర్భం మోసింది. ఆడపిల్ల జన్మించడంతో చాల గొడవ చేసింది. ఆ పాపను చూస్తేనే అసహ్యించుకోవడం చేసేది. ఆఖరికి మేము పోతపాలు ఇచ్చి బిడ్డను పెంచుకుంటున్నాము. అలా నాలుగేళ్ళు గడిచిన తరువాత మళ్ళీ ఆడపిల్ల పుట్టింది. దీంతో అలిగి పుట్టింటికి వెళ్లింది. పురిటి బిడ్డను వదిలి పెట్టి వెళ్ళితే విమర్శలు వస్తాయని భయపడి తనతో తీసుకెళ్లింది. తరువాత మేము వెళ్లి బ్రతిమిలాడి,నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చాము. కొన్నాళ్ళు మా ఇంటిలోనే ఉండి తరువాత పట్టణంలో కాపురం పెట్టారు. చదువుకోసం మొదటి అమ్మాయిని తమతోనే పెట్టుకున్నారు. అయితే చీటికి మాటికి గొడవలు పడుతూనే ఉన్నారు. అలకలు, పుట్టింటికి వెళ్లం, మళ్ళీ తీసుకుని రావడం షరా మామూలు అయ్యింది. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం ఆత్మహత్యాప్రయత్నం చేసింది. ఒక పెద్దామెకు అనుమానం వచ్చి విషయం గ్రహించి ఆసుపత్రికి తీసుకెళ్ళి, చికిత్స చేయించింది. ఈ విషయం తెలియగానే ఆమె తల్లిదండ్రులు వచ్చి ఆమెను తమ ఇంటికి తీసుకెళ్ళారు. పిల్లలను కూడ తమతో తీసుకెళ్ళారు. మా అబ్బాయిది తప్పుయినట్టు ఆరోపనలు చేసి, ఆమెను భర్తతో పంపడానికి కుదరదని చెప్పారు. మేము, బంధువుల సహాయంతో వారి మనసు మార్చడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కోపం వచ్చి తనకు ఇష్టంలేని పిల్లలను మాకు ఇచ్చేసి, విడాకులు ఇమ్మని కోరాము. అయితే రెండింటికి సమ్మతించలేదు. నెల తరువాత కొంత మెత్తబడి భర్తతో వుంటానని చెప్పింది. తనను సరిగా చూసుకోకపోతే భర్తే కారణం అని చెప్పి రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంటానని షరతు పెట్టింది. ఈ నేపథ్యంలో ఆమెను తీసుకొస్తే అనవసర సమస్యలు వస్తాయని భయం వేస్తున్నది ఈ పరిస్థితులలో తగిన సలహా ఇవ్వగలరు.

- ఒక సోదరి, శ్రీకాకుళం



డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్టు

**జవాబు:** అమ్మా మీ సమస్య అర్థం అయ్యింది. మీ రిచ్చిన సమాచారం బట్టి మీ కోడలిలో ప్రవర్తనా లోపాలు ఉన్నాయని భావించాల్సి ఉంది. అర్థంలేని ఆశలు, నమ్మకాలు, అపోహాలు పెంచు కున్నట్లు ఉంది. దీనికి కుటుంబ నేపథ్యం, పెంపక లోపం కారణం కావచ్చు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ఆర్భాటంగా బ్రతకాలనుకోవడం వివేకంకాదు. కాగా ఆడపిల్ల పుట్టడాన్ని తల్లే అసహించుకోవడం వింతగా ఉంది. భర్తతో చీటికి మాటికి గొడవపడటం అలిగిపోవడం వెనుక కారణాలు అన్వేషించవలసి ఉంది. ఆమెలో లోపమా లేక మీ అబ్బాయిలో ఏదైనా లోపం ఉందా అన్న విషయం కూడ పరిశీలించ వలసి ఉంది. మీ కోడలికి థైరాయిడ్ సమస్య ఉండటం వల్ల కూడ ప్రవర్తనా లోపాలు తలెత్తి ఉండవచ్చు. సహజంగా థైరాయిడ్ సమస్య ఉన్నవారిలో ఒత్తిడి, డిప్రెషన్ లక్షణాలు బహిర్గతం అవుతుంటాయి. అలాగే ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేసినందువల్ల డిప్రెషన్‌కు గురవుతున్నట్టు భావించాలి. కాగా ఇప్పుడు ఇంటికి తీసుకుని వస్తే ఏదైనా అగత్యానికి పాల్పడు తుందేమో అన్న మీ భయంలో తప్పులేదు.ఒక వేళ డిప్రెషన్ పెరిగి ఆత్మహత్య చేసుకుంటే అన్ని విధాలా సమస్యలను ఎదుర్కొవలసివస్తుంది. కాబట్టి ఇప్పుడు థైరాయిడ్ సమస్యకు చికిత్స చేస్తున్న డాక్టరుతో సమస్యలను చెప్పి కూలంకశంగా చర్చించండి.ఈ లక్షణాలు పూర్తిగా థైరాయిడ్ వల్ల ఉత్పన్నమయినవా లేక మానసిక సమస్యలు ఉన్నాయా అన్నది తెలుసుకోండి. మానసిక సమస్యలు ఉన్నాయనిపిస్తే మంచి సైకియాట్రిస్టు ద్వారా చికిత్స చేయించండి. అలాగే దంపతులు ఇద్దరికి సైకాలజిస్టు ద్వారా కౌన్సిలింగ్ చేయించడం మంచిది. సైకాలజిస్టు వివిధ మార్గాల ద్వారా ఆమెతోపాటు మీ అబ్బాయిలో లోపాలు ఉంటే సరిదిద్దుతారు. సర్దుకుని బ్రతకడం నేర్పుతారు. ❑



**వ్యథ**

# రాలిన నక్షత్రం !



**తాత్యా సాహెబ్** నూల్కర్ షిరిడీలోని సాయి సన్నిధికి చేరాడు. 'తాత్యా(నూల్కర్) వచ్చావు. బాగుంది. ఎన్ని రోజులు ఉంటావు?' అని అడిగాడు సాయిబాబా. నూల్కర్ వినయంగా బాబా! నాకిక పండరీపురం వెళ్లాలని లేదు. దయచేసి నన్నింక షిరిడీలోనే ఉండనివ్వండి. కోర్టులో పాండురంగ ఆలయానికి సంబంధించిన కేసుకు తీర్పు చెప్పి వస్తున్నాను. మళ్ళీ మామూలు మనుష్యుల కక్షలు, కార్పణ్యాల(కేసు) గొడవలపై తీర్పు రాసేందుకు, నన్ను కలం పట్టుకోనివ్వక, ఆ దైవ సంబంధమైన తీర్పే నా చివరి తీర్పు కానివ్వండి అని వేడుకున్నాడు. ఇక సాయి సన్నిధిలో ఉండిపోయాడు. నూల్కరే ప్రథమ గురుపూర్ణిమకు కారకుడయ్యాడు. నూల్కరే ఆరతుల వ్యవస్థలో మొదటగా ఆరతులిచ్చిన వ్యక్తి అయ్యాడు. మధుమేహం వల్ల రాచకురుపు లేచింది. అది చాలా బాధింపసాగింది. రాచకురుపులు రాసాగాయి అతని శరీరంపై ఆనారోగ్యం తీవ్రమైంది. మంచానికే అంటి పెట్టుకొని ఉండవలసిన స్థితి వచ్చింది. ఆయన కుమారులు వామనరావ్, విశ్వనాథ్, స్నేహితుడు నీలకంఠ రామచంద్ర సహస్రబుద్దే సేవలు చేయసాగారు. జబ్బు నయమైపోవాలని సాయిని ప్రార్థించలేదు ఆయన. రాను రాను ద్వారాకమాయికి వెళ్లి సాయిని దర్శించటం కూడా వీలుకాకుండా పోయింది ఆయనకు కనీసం లెండీకి పోయేటప్పుడైనా సాయిని దర్శించే భాగ్యం కలగడటం లేదాయనకు. ఇందుకు ఎవరినీ, చివరకు తన కర్మను కూడా నిందిప లేదాయన. సాయికి తెలియదా! అనేది ఆయన భావన. ఒకసారి సాయి దర్శనం ఇప్పించమని కుమారుని పంపాడు సాయి వద్దకు. సాయికి ఆ విషయం చెప్పాడు నూల్కరు కుమారుడు. ఈలోగా నూల్కర్‌కు దూరదర్శన సిద్ధినిఇచ్చాడు. సాయి ద్వారకామాయిలో ఒక పిల్లవానితో ఆడే ఆటంతా కన్నులకు కట్టినట్లు కనిపింపసాగింది. ఇక సాయిని ఆయన ఏమి కోరేను? చివరి ఘడియాలు సమీపిస్తున్నాయని ఆయన గ్రహించాడు. సాయి పాద తీర్థం తీసుకున్నాడు. చివరగా మార్చి నెలలో, మసీదులో సాయి మన మసీదులో ఒక పెద్ద నక్షత్రం రాలిపోయింది. అన్నారు. నూల్కర్ ఆకాశంలో ఒక తారగా మిగిలిపోయాడు.



- యం.పి.సాయినాథ్

**ఆధ్యాత్మికం**

# డ్రాగా ముగిసిన రెండో గేమ్

## ప్రపంచటోర్నీలో ప్రజ్ఞానంద ఆధిపత్యం



**బాకూ(అజర్‌బైజాన్):** ప్రపంచకప్ చెస్‌టోర్నీ ఓపెన్ విభాగం టైటిల్‌కోసం భారత యువగ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ప్రపంచనంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌మధ్య జరిగిన రెండో గేమ్‌డ్రాగా ముగిసింది. తమిళనాడుకు చెందిన 18 ఏళ్లప్రజ్ఞానంద ఈ గేమ్‌లో నల్లపావులతో ఆడాడు. 30 ఎత్తుల తర్వాత ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. గంటలోపే ముగిసిన ఈ పోరు ఆరంభంలో ప్రజ్ఞానంద ఆధిక్యంలోనిలిచాడు. కానీ కార్ల్‌సన్‌పై ఎత్తులువేయడంతోప్రజ్ఞానంద ఆజోరును కొనసాగించలేకపోయాడు. గురువారం జరిగే టైబ్రేక్‌గేమ్‌లతో విజేతను నిర్ణఇస్తారు. ముందురోజు జరిగిన తొలిగేమ్ 35 ఎత్తుల తర్వాత డ్రాగాముగిసింది. ఇక సెమీస్‌లోప్రజ్ఞానంద 3.5–2.5 తేడాతో అమెరికా గ్రాండ్‌మాస్టర్‌కరువానాను మట్టికరిపించి ఫైనల్‌చేరిన సంగతి తెలిసిందే. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచకప్ ఫైనల్‌లో ప్రవేశించిన రెండో భారత ఆటగాడిగా ప్రజ్ఞానంద నిలిచాడు. సెమీస్‌లో మొదటినుంచి అమెరికా గ్రాండ్ మాస్టర్ కరువానాకు గట్టిపోటీనిచ్చిన 18 ఏళ్లప్రజ్ఞానంద టైబ్రేక్‌లోనూ పట్టువదలకుండా పోరాటంచేసాడు. మొదట తొలిరెండు క్లాసికల్‌గేమ్‌లు డ్రాకావడంతో పోరు టైబ్రేక్‌కు మళ్లింది. సోమవారంజరిగిన తొలిరెండు ర్యాపిడ్‌గేమ్‌లు కూడా డ్రా అయ్యాయి. తొలిగేమ్‌లో నల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 71 ఎత్తుల్లోడ్రాచేసుకున్నాడు. తర్వాత గేమ్‌లో తెల్లపావులతో ఆడి 53 ఎత్తుల్లోప్రత్యర్థిని నిలువరించాడు. దీనితో ర్యాపిడ్‌లోరెండో రౌండ్‌కు తెరలేచింది.

తొలిగేమ్‌లో తెల్లపావులతో ప్రజ్ఞానంద ఆధిపత్యంతో ఉన్నాడు. కరువానానుంచి గట్టిసవాలును దాటుకుని 63 ఎత్తుల్లోనే విజయం సాధించాడు. ఓవరాల్‌గా సెమీస్‌లోప్రజ్ఞానంద 3.5–2.5 తేడాతోకరువానాపై నెగ్గాడ. 2024 క్యాండిడేట్‌టోర్నీలో చోటు ఖాయంచేసుకున్నాడు. బాబిఫిషర్, కార్ల్‌సన్‌తర్వాత ఆపోటీల్లో తలపడే మూడో పిన్నవయసు ఆటగాడిగా నిలిచాడు. అంతేకాకుండా 2005లోప్రపంచకప్‌లో నాకౌట్ ఫార్మాట్‌ప్రవేశపెట్టిన తర్వాత ఫైనల్‌చేరిన తొలి భారత ఆటగాడు కూడా ఇతడే. లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగిన ప్రపంచకప్‌ల్లో ఆనంద్ 2000, ఆ తర్వాత 2002లో టైటిల్ నెగ్గాడు.



## వేలంలో ఆ ముగ్గురి కోసం

# ఆర్సీబీ ఫోకస్

**బెంగళూరు:** ఐపిఎల్ వచ్చే సీజన్‌కోసం రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సమాయత్వం అవుతోంది. ఇప్పటికే టీమ్‌ప్రక్షాళనను ప్రారంభించిన యాజమాన్యం డిసెంబరులో జరిగే ఐపిఎల్ 2024 మినీ వేలం కోసం ప్రణాళికలను సిద్ధంచేస్తోంది కొత్త హెడ్‌కోచ్ జింబాబ్వే దిగ్గజం ఆండీఫ్లవర్‌పర్యవేక్షణలో మినీ వేలానికి సిద్ధం అవుతోంది. జట్టుకు భారమైన ఆటగాళ్లను వదిలేయాలని సూచించాడు. ఇప్పటికే రిలీజ్‌చేసే ఆటగాళ్ల జాబితాను సిద్ధంచేసింది. గతసీజన్‌లో దారుణంగా విఫలం అయిన దినేశ్‌కార్తీక్‌తోపాటు షెహబాజ్ అహ్మద్, సుయాశ్‌ప్రభుదేశాయ్, వనిందు హాషరంగా, జోష్ హేజిల్‌వుడ్, ఫిన్ అలెన్, ఆకాశ్‌దీప్ వంటి వారిని వదులుకునేందుకు సిద్ధం అయింది. వీరిస్థానాల్లోనే జట్టుకు అవసరమైనవారికోసం గాలిస్తోంది. ఆర్సీబీలో లోయరార్డర్ బలహీనంగా ఉంది. బ్యాకప్ ప్లేయర్లు కూడా లేరు. విరాట్‌కోహ్లీ, ఫాఫ్ డుప్లెసిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్‌పైనే జట్టు ఆధారపడింది. జట్టులోని భారత ఆటగాళ్ల వైఫల్యం టీమ్ విజయావకాశాలను దెబ్బతీస్తోంది. ఈక్రమంలోనే ఆర్సీబీ ముగ్గురిపై కన్నేసింది. టీమిండియా వెటరన్ వికెట్‌కీపర్ కెఎల్‌రాహుల్‌తోపాటు ఆసీస్‌స్టార్‌పేసర్ ప్యాట్‌కమిన్స్, రవిబిష్ణోయ్‌లను తీసుకోవాలనుకుంటోంది. ఈ ముగ్గురికీ సాయిసుదర్శన్ సందీప్‌శర్మలను బ్యాకప్‌గా పెట్టుకుంది. రాహుల్‌ప్రస్తుతం లక్నోజట్టు కెప్టెన్‌గా ఉన్నాడు. ఐపిఎల్ 2023 సీజన్‌మధ్యలోనే రాహుల్ గాయంతో దూరం అయ్యాడు. రాహుల్ వేలానికివస్తే ఆర్సీబీ చేపడుతుంది. దినేశ్‌కార్తీక్‌స్థానాన్ని రాహుల్‌తో భర్తీచేయాలనుకుంటోంది. రాహుల్ అందుబాటులోకి రాకుంటే సాయిసుదర్శన్‌ను తీసుకోడంపై ఫోకస్‌పెట్టనుంది. గతసీజన్‌కు దూరంగా ఉన్న ప్యాట్‌కమిన్స్ ఈసారి బరిలోకి దిగుతాడు. భారీధరచెల్లించి అయినా ప్యాట్‌కమిన్స్‌ను కొనుగోలుకు ఆర్సీబీ ఆసక్తితో ఉంది. ఇక హసరంగా స్థానంలో రవిబిష్ణోయ్‌ను తీసుకోవాలని ఆర్సీబీ భావిస్తోంది.

## స్పెయిన్ ఫుట్‌బాల్ చీఫ్‌పై ప్రధాని పెడ్రో అసహనం

### ఫిఫా మహిళల టోర్నీ విజేతలను వేదికపైనే ముద్దాడిన వైనం



**మాడ్రిడ్:** స్పెయిన్ ఫుట్‌బాల్‌ఫెడరేషన్‌చీఫ్ లూయిస్ రుబియాలెస్‌పై ఆదేశప్రధాని పెడ్రో సాంచెజ్ తీవ్ర అసహనం వ్యక్తంచేసారు. రుబియాలెస్‌చేసింది ఘోరమైన తప్పు అని క్షమాపణలు కూడా సరిపోవని మండిపడ్డారు. ఫిఫా మహిళల ప్రపంచకప్ 2023 టైటిల్ స్పెయిన్‌సొంతంచేసుకున్న తరుణంలో ఈసంఘటన జరిగింది. ఫైనల్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి విశ్వవిజేతగా నిలతిచింది. తొలిసారి స్పెయిన్ మహిళల ఫిఫా ప్రఫంచకప్‌ను ముద్దాడింది. స్పెయిన్ ఫుట్‌బాల్‌ఫెడరేషన్‌చీఫ్ హద్దులు దాటిప్రనవర్తించాడు. మెడల్స్ అందచేసేక్రమంలో సెట్పయిన్‌క్రీడాకారిణులకు ముద్దులుపెట్టాడు. స్టార్‌ప్లేయర్ జెన్నిఫర్ హెర్మోసో పెదాలను ముద్దాడిన రుబియాలెస్ ఇతర క్రీడాకారిణుల చెంపలను కూడా కిస్‌చేసాడు. ఇందుకు సంబంధించిన విడియోటలు వైరల్ కావడంతో స్పెయిన్‌లో తీవ్రనిరసన వ్యక్తం అయింది. అయితే లూయిస్ బహిరంగ క్షమాపణలు కూడా చెప్పాడు. అంతులేని సంతోష సమయంలో ఎలాంటి దురుద్దేశంలేకుండానే నేను చేసానని, అయినా కూడా క్షమాపణలు చెపుతున్నట్లు చెప్పాడు. దీనిపైప్రధాని పెడ్రో స్పందిస్తూ లూయిస్ ఘోరతప్పిదంచేసాడని, క్షమాపణలు సరిపోవని అన్నాడు. సమాఖ్య స్వతంత్రంగా ఉంటుందని, చీఫ్‌ను నియామకం, తొలగించ అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. అయితే రుబియాలెస్‌ను తప్పించాలని లేదా ఆయనే స్వయంగా రాజీనామాచేయాలన్న డిమాండ్ బలంగా వస్తోంది.

## నేను బతికే ఉన్నా... హీత్‌స్ట్రీక్ ట్వీట్..!



**హరారే:** జింబాబ్వే క్రికెటర్ హీత్‌స్ట్రీక్ చనిపోయాడనే బాధలో ఉన్న క్రికెట్ అభిమానులకు జింబాబ్వే మాజీ ఆటగాడు హెన్రీ ఒలంగా గుడ్‌న్యూస్‌చెప్పాడు. హీత్ స్ట్రీక్ చనిపోలేదని ఒలంగా చెప్పాడు. తాను హీత్‌స్ట్రీక్‌తోచేసిన వాట్సాప్ చాటింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఒలంగా ట్వీట్‌చేసాడు. థర్డ్ అంపైర్ ఆత డిని వెనక్కిపిలిచాడు. ఆతడు బతికే ఉన్నా డని అంటూ ఒలంగా తెలిపాడు. నువ్వు చనిపోయావని ప్రచారం జరుగుతోందని హీత్ స్ట్రీక్‌కు ఒలంగా వాట్సాప్‌చేయగా జింబాబ్వే మాజీ కెప్టెన్ స్పందించాడు. భేషుగ్గా బతికే ఉన్నాను. ఈ రనౌ ఇట్‌ను తక్షణమే వెనక్కితీసుకోవాలంటూ స్ట్రీక్ జవాబిచ్చాడు.

నువ్వు రాత్రికి రాత్రే చనిపోయావు ఈ వార్త తుపానులా వ్యాపించింది. కానీ నువ్వుచెప్పేది వినేందుకు బాగుందంటూ ఒలంగా బదులిచ్చాడు. తాను చనిపోయాననే ప్రచారం అబద్ధమన్న హీత్‌స్ట్రీక్ ఈ ప్రచారం తనను బాధించిందన్నాడు. దీనికి కారకులైనవారు క్షమాపణలు చెప్పాల్సిందేనన్నాడు. స్ట్రీక్ ప్రస్తుత వయసు 49 ఏళ్లు.ఆయన కొన్నేళ్లుగా కేన్సర్‌తోపోరాటంచేస్తున్నాడు. దక్షిణాఫ్రికాలోచికిత్స పొందుతున్న ఆయన చనిపోయాడని ప్రచారంజరిగింది. స్ట్రీక్‌చనిపోయాడని ఒలంగానే ట్వీట్‌చేసాడు. ఇది నిజమేనని నమ్మిన క్రికెటర్లు మాజీ ఆటగాళ్లు స్ట్రీక్‌కు సంతాపం తెలిపారు. 1993లో జింబాబ్వే క్రికెట్‌జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు. 12 ఏళ్ల పాటు ఆ జట్టు తరపున ఆడిన స్ట్రీక్ 65 టెస్టులతోపాటు 189 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 216 వికెట్లు తీసిన ఆతడు వన్డేల్లో 239 వికెట్లు తీసాడు. జింబాబ్వే తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డుతీసిన హీత్‌స్ట్రీక్‌పేరిటే ఉంది. టెస్టులు వన్డేల్లో 100 వికెట్లు తీసిన తొలి జింబాబ్వే బౌఐలర్‌కూడా అతడే కావడం గమనార్హం.

## చంద్రయాన్ సక్సెస్‌పై టీమిండియా సంబరాలు!



**డబ్లిన్:** ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో ఐర్లాండ్‌పర్యటనలో ఉన్న భారతటీమ్ బృందంతోపాటు ఇతర సిబ్బంది మొత్తం హర్షంప్రకటించారు. వర్షంకారణంగా మ్యాచ్ కొంతసేపుజాప్యంకావడంతో చంద్రయాన్‌ను టీమ్‌మొత్తం వీక్షించింది. చంద్రుని దక్షిణధృవంపై అడుగుపెట్టినట్లు ఇస్రో ప్రకటించిన వెంటనే ప్రయోగం సక్సెస్ అయిందని ప్రపంచ వ్యాప్తంగా భారత్ చాటిచెప్పింది. ఈవిజయం ఘట్టాన్ని బుమ్రా నేతృత్వంలోని టీమిండియా కూడా ఐర్లాండ్‌లో సంబరాలుచేసుకుంది. ల్యాండర్ చంద్రుడిపై కాలుమోపడాన్ని టివిలోప్రత్యక్షంగా వీక్షించిన టీమిండియా ఆటగాళ్ల ఆనందాలకు అవధుల్లేవు. ఐర్లాండ్‌తోమూడో టి20కి వర్షం అంతరాయం కలిగించడంతో భారత ఆటగాళ్లంతా చంద్రయాన్–3 ప్రయోగంసక్సెస్‌ను టివిలో వీక్షించారు. ల్యాండర్ కాలుమోపిన వెంటనే టీమిండియా ఆటగాళ్లు చప్పట్లతో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# బియ్యంపై కేంద్రం కొత్త పన్ను

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** దేశంలో ఏర్పడిన వాతావరణ మార్పులు ఊహించని పరిణామాలకు దారితీస్తున్నాయి. ఇది కేవలం భారత్‌పై మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అలజడిని సృష్టిస్తోంది. రుతుపవనాల మార్పులు దేశంలో కూరగాయలు, పండ్లు, ఉల్లి, పప్పులు, బియ్యం, గోధుమల ఉత్పత్తిపై భారీగా ప్రభావాన్ని చూపింది. వీటికి తోడు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆ దేశాల నుంచి వచ్చే అనేక ఉత్పత్తుల ఉత్పత్తిని దెబ్బతీసింది. దీంతో వంటకు వినియోగించే సన్‌ఫ్లవర్ నూనె ధరలు అమాంతం పెరిగిన విషయం విదితమే. 2022 జూన్‌లో రష్యా ప్రభుత్వం బియ్యం ఎగుమతిని నిషేధించడంతో ప్రపంచమే బియ్యం కోసం భారత్‌పై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో బాస్మతీయేతర బియ్యం ఎగుమతిపై గత నెలలో ఎగుమతులను నిషేధిస్తూ ఆంక్షలు తీసుకొచ్చింది. ఎగుమతులు నియంత్రించబడుతున్న వేళ స్థానిక రైతులకు కనీస మద్దతు ధర పెంపు నిర్ణయం జాక్‌పాట్ అవుతుందని తెలుస్తోంది. ఇదే క్రమంలో తాజాగా ప్రభుత్వం పార్బాయిల్డ్ (ఉడకబెట్టిన) రకం బియ్యం ఎగుమతిపై పన్నును పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. సరఫరా ఆందోళనల కారణంగా ఈ నెలలో ఆసియా వ్యాప్తంగా బియ్యం ధరలు 2008 నాటి గరిష్టస్థాయికి చేరుకున్నాయి.



ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన ఆహారంగా ఉన్న బాస్మతియేతర బియ్యంపై భారత ప్రభుత్వ ఆంక్షలు ప్రపంచ జనాభాపై ఆర్థిక భారానికి కారణమైంది. దీన్ని అరికట్టేందుకు బాస్మతి బియ్యానికి కనీస ఎగుమతి ధరని నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో బాస్మతి బియ్యం కనీస ఎగుమతి ధర టన్నుకు దాదాపు 1,250 డాలర్లకు చేరుకోనుంది. పైగా దీర్ఘకాలిక నిషేధం అమెరికాలోని రైతలకు ప్రయోజనాన్ని కలిగించనుందని తెలుస్తోంది. యుఎస్ బియ్యం కోసం ప్రపంచ డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై భారత ప్రభుత్వం 20శాతం పన్ను విధించే ఆలోచనలో ఉంది. బాస్మతి ఎగుమతి పరిమాణం ఏప్రిల్–జూన్ నెలలో 1.1 మిలియన్ టన్నుల నుంచి 1.2మిలియన్ టన్నులకు పెరిగింది.

## 'పని ఉన్నా..నిపుణులే కరవు' గోయెంకా ట్వీట్ వైరల్

**ముంబై, ఆగస్టు 23:** నిరుద్యోగం దేశంలో తీవ్రమైన సమస్యగా మారింది. ఇది ఆర్థిక వ్యవస్థకు పెను సవాల్ విసురుతోంది. ఒక వైపు భారత్ శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నప్పటికీ, నానాటికీ పెరుగుతున్న జనాభా కారణంగా నిరుద్యోగ సమస్య వేధిస్తోంది. ఈ నేపథ్యంలో తమ కంపెనీలో నైపుణ్యం కలిగిన శ్రామిక కొరత ఉందంటూ ప్రముఖ వ్యాపారవేత్త హర్ష గోయెంకా చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. 'ఒకవైపు భారత్‌లోని కంపెనీలను నైపుణ్యం కలిగిన శ్రామికుల కొరత వేధిస్తోంటే, మరో వైపు లక్షలాది మంది నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మా కంపెనీలో కూడా నైపుణ్యం కలిగిన కార్మిక కొరతఉంది. మాకు ట్రక్ డ్రైవర్లు, తోట కార్మికుల అవసరముంది. ఈ సమస్యకు సరైన పరిష్కారం ఏమిటో అర్థం కావడంలేదు. మన అవసరాలను తీర్చుకునేందుకు మరింత యాంత్రిక శక్తి కావాలా?



ప్రజలు పని చేస్తే, వచ్చే డబ్బుతో జీవించేందుకు ఇష్టపడడం లేదా? నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి మరింత కృషి చేయాల్సిన అవసరం లేదా? యజమానులతో ఉద్యోగులు సమర్థవంతంగా సరిపోయే డిజిటల్ ప్లాట్‌ఫాం మనకు అవసరముందా? అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు. నైపుణ్య అభివృద్ధి ద్వారా నిరుద్యోగాన్ని ఏ విధంగా తగ్గించవచ్చు, కార్మికులు లేకపోవడానికి కారణాలను వివరిస్తూ నెటిజన్లు కామెంట్లుగుప్పిస్తున్నారు. డ్రైవర్లు, కార్పెంటర్లు, తాపీ పని చేసేవారిని కొందరు చిన్న చూపు చూస్తున్నారు. వారికి తగిన గౌరవం లభించడం లేదు. అందుకే మా పిల్లలను అలాకాకుండా మంచి స్థాయిలో చూడాలనుకుంటున్నాం అని ఒకరు పోస్టు చేశారు. నైపుణ్య కేంద్రాల్లో తగినంత మంది చేరడం లేదనేది చేదు నిజం. బ్లూ కాలర్ ఉద్యోగాల్లో మెరుగైన జీతం లభిస్తున్నా, యువత వైట్ కాలర్ ఉద్యోగాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఫ్యాన్, క్లర్క్ నియామక ప్రకటనలు రాగానే భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. అంటూ మరొకరు కామెంట్ చేశారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు యువత కోచింగ్ సెంటర్లను సంప్రదిస్తోంది అలాంటి వారికి పరిశ్రమలే శిక్షణ ఇచ్చి ఆ తర్వాత ఉద్యోగాన్ని కల్పిస్తే ఈ సమస్యను కొంతైనా పరిష్కరించవచ్చు అని ఒక నెటిజన్ సలహా ఇచ్చారు.

## ఆపిల్ ఫోన్ యూజర్లకు హెచ్చరిక

**వాషింగ్టన్, ఆగస్టు 23:** టెక్ దిగ్గజం, ఐఫోన్ మేకర్ ఆపిల్ కీలక హెచ్చరికలు జారీచేసింది. ముఖ్యంగా ఫోన్‌ను పక్కనే పెట్టుకొని నిద్రపోయే అలవాటు ఉన్న వ్యక్తుల కోసం కీలక హెచ్చరిక జారీచేసింది. స్మార్ట్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉండగా పక్కన పెట్టుకుని నిద్రపోవడం ప్రమాదకరమని హెచ్చరించింది. అంతేకాకుండా ఈ సూచనలు తమ ఆన్‌లైన్ యూజర్ గైడ్‌లో చేర్చింది. ఐఫోన్లను సరైన వెలుతురు ఉన్న వాతావరణంలోనూ, టేబుల్‌లాంటి ఫ్లాట్ ఉపరితలాలపై పెట్టి ఛార్జింగ్ చేయాలని సలహా ఇచ్చింది. దుప్పట్లు, దిండ్లు, శరీరం వంటి మృదువైన ఉపరితలాలపై ఉంచి ఛార్జ్ చేయవద్దని సూచించింది. ఛార్జింగ్ ప్రక్రియలో ఐఫోన్లు కొంత వేడిని ఉత్పత్తి చేస్తాయని తెలిపింది. ఫలితంగా ఫోన్ కింద ఉన్న భాగం కాలిపోవడం, తీవ్రమైన సందర్భాల్లో మంటలంటుకునే ప్రమాదానికి దారితీస్తాయని తెలిపింది. అలాగే ఫైను ఛార్జింగ్ చేస్తున్నప్పుడు పవర్ అడాప్టర్, వైర్‌లెస్ ఛార్జర్‌పై నిద్రపోవద్దని సూచించింది. వాటి పవర్ సోర్స్‌కి కనెక్ట్ చేసినప్పుడు దుప్పటి, దిండు, శరీరం కింద ఉంచవద్దంటూ యూజర్లకు మార్గదర్శకాలు జారీచేసింది. అంతేకాకుండా దెబ్బతిన్న కేబుల్స్ లేదా ఛార్జర్లను ఉపయోగించడం లేదా తేమగా ఉన్న ప్రదేశాల్లో ఛార్జింగ్ చేయకూడదని కూడా సలహా ఇచ్చింది.



కాగా పొద్దున లేచింది మొదలు రాత్రి పోయే వరకు చివరికి వాష్ రూంలో కూడా వదలకుండా ఫోన్ వాడటం ఇప్పుడు అందరికీ అలవాటుగా మారిపోయింది. అంతేకాకుండా చార్జింగ్‌లోఉన్నప్పుడు చాలా సార్లుఫోన్ పేలిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కూడా చాలానే చూశాం. ఫోన్ ఛార్జింగ్ పెట్టినప్పుడు ఫోన్ వినియోగం ప్రమాదకరం, సిగ్నల్ లేని సమయంలో వాడితే అరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఇప్పటికే పలు అధ్యయనాలు హెచ్చరించిన విషయం విదితమే.

## ఐపిఒకు శివ ఫార్మాకెమ్

**ముంబై, ఆగస్టు 23:** తాజాగా గుజరాత్‌కు చెందిన స్పెషాలిటీ కెమికల్ కంపెనీ శివ ఫార్మాకెమ్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ అవ్వాలని ప్లాన్ చేస్తోంది. కంపెనీ ఐపిఒ ద్వారా స్టాక్‌మార్కెట్లో లిస్టింగ్ కావాలనుకుంటోంది. దీని కోసం మార్కెట్ రెగ్యులేటర్ సెబికి అవసరమైన పత్రాలను సమర్పించింది. కెమికల్స్ వ్యాపారంలో ఉన్న సంస్థ ఐపిఒ ద్వారా రూ.900 కోట్లను సమీకరించాలని యోచిస్తోంది. వడోదరకు చెందిన శివ ఫార్మాకెమ్ డిఆర్‌హెచ్‌పి ప్రకారం, ఐపిఒ పూర్తిగా ప్రమోటర్ గ్రూప్ వాటాదారుల వాటా విక్రయాన్ని కలిగి ఉంటుంది. అంటే కంపెనీ తన ప్రమోటర్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విక్రయించి డబ్బును సేకరిస్తోంది. విశాల్ రాకేష్ అగర్వాల్, రాహుల్ రాకేష్ అగర్వాల్ ఒఎఫ్‌ఎస్‌లో పాల్గొంటారు. వీరిద్దరూ తమ వాటాల కింద రూ.383 కోట్ల విలువైన షేర్లను విక్రయిస్తారని వెల్లడైంది. కాగా గీతగంగా ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ 134 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించాలని నిర్ణయించింది. శివ ఫార్మాకెమ్ ఐపిఒ ద్వారా సేకరించిన సొమ్మువాటాలు విక్రయించిన వాటాదారులకు వెళ్తుంది. కంపెనీ ఎటువంటి నిధులను స్వీకరించదు. శివ ఫార్మాకెమ్ 2023లో 116.65 కోట్ల రూపాయల లాభాన్ని నివేదించింది. కంపెనీ ఆదాయం 2023లో 1079.5 కోట్ల రూపాయలకు పెరుగుతుందని అంచనా. 2023 నాటికి కంపెనీ 22 దేశాల్లో 181 బహుళజాతి, దేశీయ కంపెనీలకు సేవలను అందిస్తోంది. జర్మనీ,యుఎస్ఎ, స్విట్జర్లాండ్, ఇటలీ, మెక్సికోలు ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉన్నాయి. కంపెనీకి గుజరాత్‌లోని లూనా, దహేజ్ సెజ్‌లలో మూడు, హంగరీలో మూడు ఉత్పత్తి సౌకర్యాలు ఉన్నాయి.

# వాణిజ్యం

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఆగస్టు 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిసాయి. ఆరంభంలో సూచీలు నష్టాలు చవిచూసినప్పటికీ, తర్వాత కోలుకున్నాయి. ముఖ్యంగా బ్యాంకు, మెటల్, కేపిటల్ గూడ్స్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు పుంజుకున్నాయి. చివరికి సెన్సెక్స్ 213.27 పాయింట్లు పెరిగి 65,433.30 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 47.55 పాయింట్లు పెరిగి 19,444 పాయింట్ల వద్ద స్థిరపడింది.

డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.82.88గా ఉంది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకు, ఎల్‌అండ్‌టి, టాటా స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. జియో ఫైనాన్స్, సన్‌ఫార్మా, భారతీఎయిర్‌టెల్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి



వేరుపడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ వరుసగా మూడో రోజు లోయర్ సర్క్యూట్‌కు చేరింది. సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అవ్వగా, బుధవారం బిఎస్ఇలో రూ.227.25, ఎన్ఎస్ఇలో రూ.224.65కి చేరింది. కంపెనీ మార్కెట్ విలువ 1.44 లక్షలకు తగ్గింది.

## ఆదిత్యబిర్లాకు హిండాల్కో మద్దతు

**ముంబై, ఆగస్టు 23:** ఆదిత్యబిర్లా గ్రూప్‌కు చెందిన కంపెనీ లాభాల్లో ట్రేడింగ్ కొనసాగిస్తోంది. అయితే దీని వెనుక కంపెనీ అతిపెద్ద వ్యాపార వ్యూహం ఉన్నట్లు వెల్లడైంది. కుమార మంగళం బిర్లా యాజమాన్యంలోని హిండాల్కో కంపెనీ షేర్లు ఈ వారం మూడో ట్రేడింగ్ రోజైన బుధవారం కూడా లాభాల్లోనే ట్రేడయింది. పైగా షేర్లకు అత్యధికంగా డిమాండ్‌కనిపించింది. ఎన్ఎస్ఇలో హిండాల్కో 2.94 శాతం మేర పెరిగి రూ.463.60 వద్ద కొనసాగింది. సరుకు రవాణావ్యాగన్లు, ప్యాసింజర్ కోచ్‌లు, కాపర్, ఈ–వేస్ట్ రీసైక్లింగ్ సదుపాయాల కోసం 'ఎక్స్‌ట్రుషన్' సౌకర్యంపై కంపెనీ మొత్తదం రూ.4వేలకోట్లను పెట్టుబడి పెట్టనుందని హిండాల్కో ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా వెల్లడించారు. ఎక్స్‌ట్రుషన్ అనేది చాలా అధిక పీడనం కింద హైడ్రాలిక్ ప్రెస్ ద్వారా డై నుంచి లోహాన్ని వెలికితీసి అవసరమైన ఆకృతిలో వస్తువులను తయారు చేసే ప్రక్రియ. వందే భారత్ రైళ్ల కోసం ఫ్రైట్ కోచ్‌లు, ప్యాసింజర్ కోచ్‌ల అభివృద్ధికి కొత్త 'ఎక్స్‌ట్రుషన్' సదుపాయాన్ని ఏర్పాటు చేయడానికి కంపెనీ రూ.2వేల కోట్లు పెట్టుబడి పెట్టిందని 64న ఎజిఎంలో బిర్లా వెల్లడించారు. దేశంలో ఈ–వేస్ట్ రీసైక్లింగ్ చేసేందుకు అవసరమైన అత్యుత్తమ టెక్నాలజీ అందుబాటులో లేనందున విదేశాలకు ఎగుమతి జరుగుతోందని, ఇందుకు పరిష్కారాన్ని చూపేందుకు పెట్టుబడి పెట్టాలని బిర్లా గ్రూప్ నిర్ణయించినట్లు వెల్లడించారు. రాగితోపాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్ కోసం అత్యుత్తమ టెక్నాలజీని తీసుకొస్తున్నట్లు తెలిపారు.

## సెబి చర్యలతో బ్రైట్‌కామ్ షేర్లు పతనం

**ముంబై, ఆగస్టు 23:** బుధవారం స్టాక్ మార్కెట్లో బ్రైట్‌కామ్ గ్రూప్ లిమిటెడ్ షేర్లపై అందరి దృష్టి ఉంది. సెబి చర్యలతో ఒక్కసారిగా స్టాక్ కుప్పకూలింది. ఇది ఇన్వెస్టర్లలో ఆందోళనల భూకంపాన్ని సృష్టించింది. కంపెనీ షేర్లు బిఎస్ఇలో 5శాతం లోయర్ సర్క్యూట్లో లాక్ అయ్యాయి. దీంతో కంపెనీ షేర్ ధర రూ.22.98కి పడిపోయింది. అయితే ఈ పతనానికి కారణం సెబి ప్రముఖ ఇన్వెస్టర్ శంకర్ శర్మతో సహా 23 మందిపై నిషేధం విధించింది. బ్రైట్‌కామ్ షేర్లను విక్రయించకుండా అడ్డుకుంది. ఇదే క్రమంలో కంపెనీ చైర్మన్, సిఎఫ్ఒలను కంపెనీ బోర్డు నుంచి నిషేధిస్తున్నట్లు సెబి ప్రకటించడంతో తాజా పరిణామాలు ఉత్పన్నమయ్యాయి.



దీనిపై స్పందించిన శంకర్ శర్మ మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి అవసరమైన అన్ని రెమిటెన్స్ వివరాలను సమర్పించినట్లు ట్విట్టర్ వేదికగా తెలిపారు బ్రైట్‌కామ్ ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపులకు సంబంధించి అవకతవకలను 'స్పష్టంగా' గుర్తించిన తర్వాత సెబి తాజాగా ఆగస్టు 22న ఉత్తర్వులు జారీచేసింది. శర్మకు సెబి అందించిన నోటీసు నం–25 ప్రకారం, ఒక్కొక్కరికి రూ.37.77 చొప్పున 1,50,00,000 వారెంట్లు జారీచేయబడ్డాయి. దీనికింద కంపెనీకి 56.66 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉండగా, కేవలం 39.98 కోట్ల రూపాయలు మాత్రమే అందినట్లు వెల్లడైంది. దీంతో అకౌంటింగ్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఇదే క్రమంలో బ్రైట్‌కామ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, సిఎఫ్ఒ నారాయణ్ రాజు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఏదైనా లిస్టెడ్ కంపెనీ లేదా దాని అనుబంధ సంస్థల్లో డైరెక్టర్ లేదా ఏదైనా కీలకమైన మేనేజర్ పదవిని నిర్వహించకుండా సెబి ఆంక్షలు విధించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.